తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

# జనంసాక్షి

Estd : 2002

www.janamsakshi.org

ఆదివారం 09.08.2026 | సంపుటి :13 సంచిక : 20 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ప్రకటనల కోసం సంప్రదించండి

98483 28698







## డిజిటల్ ఇండియా కలకు గండికొడుతారా?

యూపీఐ విస్తరణకు ప్రధాన కారణాల్లో ఒకటి నగదు లావాదేవీలకు ప్రత్యామ్నాయంగా సులభమైన, వేగవంతమైన డిజిటల్ చెల్లింపు వ్యవస్థ అందుబాటులోకి రావడం. చిన్న వ్యాపారులు కూడా బ్యాంకు ఖాతాలు, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలోకి రావడానికి ఇది దోహదపడింది. ఇప్పుడు డిజిటల్ చెల్లింపులపై వ్యాపారులకు అదనపు ఖర్చు పెడితే, ముఖ్యంగా అతి చిన్న వ్యాపారులు మళ్లీ నగదు లావాదేవీల వైపు వెనక్కి మళ్లే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## యూపీఐపై పన్ను అంటూ ప్రచారం..

ఇక్కడ మరో కీలక విషయం. యూపీఐ ద్వారా వ్యక్తిగతంగా డబ్బు పంపిన ప్రతిసారీ ప్రభుత్వం కొత్తగా పన్ను వసూలు చేస్తోందని చెప్పడం సరైనది కాదు. యూపీఐ లావాదేవీ జరిపినంత మాత్రాన ఆ మొత్తంపై ఆదాయపు పన్ను విధించబడదు. అసలు చర్చ చెల్లింపు వ్యవస్థకు సంబంధించిన ఎండీఆర్ ఛార్జీల గురించి. ప్రభుత్వం ఏ విధానం అమలు చేస్తుంది? ఎవరికి వర్తింపజేస్తుంది? ఏ లావాదేవీలకు వర్తిస్తుంది? చిన్న వ్యాపారులకు మినహాయింపు ఉంటుందా? వంటి అంశాలపై తుది నిర్ణయమే కీలకం.

# డిజిటల్ వ్యాపారంపై కమ్ముకున్న మేఘాలు

## యూపీఐపై చార్జీల మోత.. చిరు వ్యాపారుల నడ్డి విరగనుందా?!

### డిజిటల్ చెల్లింపులు భారమైతే.. చిన్న వ్యాపారులకు పెనుముప్పే!

- చిల్లర దుకాణాల నుంచి వీధి వ్యాపారుల దాకా అందరిపైనా ప్రభావం
- చెల్లింపుల భారం చివరికి జేబుకు చిల్లే..
- వినియోగదారుడిపైనే పడే ప్రమాదం

### రోజువారీ వ్యాపారానికి యూపీఐనే జీవనాధారం!

టీ కొట్టు, కిరాణా దుకాణం, కూరగాయల వ్యాపారి, పండ్ల దుకాణం, చిన్న హోటల్, టిఫిన్ సెంటర్, ఆటో డ్రైవర్.. ఇలా కోట్లాది మంది చిన్న వ్యాపారులు రోజువారీ లావాదేవీలకు యూపీఐపైనే ఆధారపడుతున్నారు. నగదు అందుబాటులో లేకపోయినా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెల్లించడం ఇప్పుడు నిత్యకృత్యంగా మారిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో డిజిటల్ చెల్లింపులపై వ్యాపారికి ఏదైనా శాతం మేర ఛార్జీ విధిస్తే, పెద్ద కంపెనీలతో పోలిస్తే చిన్న వ్యాపారులపైనే దాని దెబ్బ ఎక్కువగా పడే అవకాశం ఉంది.

### చిన్న లావాదేవీలే ఎక్కువ.. లెక్క తేలితే భారీ మొత్తమే!

చిరు వ్యాపారుల వ్యాపారంలో ఒక్కో లావాదేవీ విలువ సాధారణంగా తక్కువగానే ఉంటుంది. కానీ రోజులో వందల సంఖ్యలో లావాదేవీలు జరగవచ్చు. ప్రతి లావాదేవీపై స్వల్ప శాతం ఛార్జీ విధించినా నెలాఖరుకు అది గణనీయమైన మొత్తంగా మారవచ్చు. ఉదాహరణకు ఒక వ్యాపారి రోజుకు యూపీఐ ద్వారా 20,000 స్వీకరిస్తున్నాడనుకుందాం. నెలకు 30 రోజులు లెక్కిస్తే 6 లక్షల డిజిటల్ లావాదేవీలు జరుగుతాయి. 0.25 శాతం ఎండీఆర్ ఉంటే నెలకు సుమారు 1,500 ఖర్చు అవుతుంది. 0.4 శాతం అయితే 2,400 అవుతుంది. చిన్న వ్యాపారానికి ఈ మొత్తం కూడా చిన్నది కాదు - నెలంతా కష్టపడి సంపాదించిన లాభంలో గండిపడ్డట్టే!

ప్రజలపై ప్రత్యక్షంగా యూపీఐ పన్ను పడకపోయినా.. దాని వినియోగంపై వ్యాపారులకు ఛార్జీలు విధిస్తే ఆ భారం చివరకు సామాన్యుడి జేబుకే చేరే ప్రమాదం ఉంది. ఇప్పటికే పెరుగుతున్న ఖర్చులు, తగ్గుతున్న లాభాలతో సతమతమవుతున్న చిరు వ్యాపారులకు డిజిటల్ చెల్లింపులపై అదనపు భారం మరో గుదిబండగా మారనుంది. టీ కొట్టు నుంచి కిరాణా షాపు, వీధి వ్యాపారి నుంచి ఆటో డ్రైవర్ వరకు కోట్లాది మంది ఆధారపడుతున్న యూపీఐపై ఛార్జీలు విధిస్తే చిన్న వ్యాపారాల మనుగడ ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి ఏర్పడొచ్చు. వ్యాపారులు ఆ భారాన్ని ధరల రూపంలో వినియోగదారులపై మోపితే నిత్యావసరాల ధరలు మరింత పెరిగే అవకాశముంది. నగదు రహిత ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించాల్సిన సమయంలో డిజిటల్ చెల్లింపులను ఖరీదైనవిగా మార్చడం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్న ఇప్పుడు ప్రజల్లో తలెత్తుతోంది. చిరు వ్యాపారికి భారమా.. చివరకు సామాన్యుడి జేబుకే చిల్లా? ఆగస్టు8నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా విస్తరించిన యూపీఐ చెల్లింపులపై భవిష్యత్తులో ఛార్జీలు విధించే అవకాశం చర్చకు రావడంతో చిన్న వ్యాపారుల్లో గుబులు మొదలైంది. అయితే ప్రస్తుతానికి సామాన్య వినియోగదారుడు యూపీఐ ద్వారా డబ్బు పంపినందుకు నేరుగా పన్ను చెల్లించాల్సిన పరిస్థితి లేదు. చర్చలో ఉన్న అంశం ప్రధానంగా వ్యాపారుల నుంచి వసూలు చేసే మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)కు సంబంధించినది.

హైదరాబాద్ (జనంసాక్షి ప్రతినిధి)




వార్త 2 లో

## సాగునీటి ప్రాజెక్టులకు సర్కారులో ప్రాధాన్యం

# నిధుల కొరత రానివ్వం

- రోళ్లవాగుపై ప్రత్యేక దృష్టి
- నిర్వాసితులకు పరిహారం, పునరావాసం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 8 (జనంసాక్షి) :**

సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. నిధుల కొరతతో సాగు నీటి పనులు ఆగొద్దని చెప్పుకొచ్చారు. శనివారం సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులను వెంటనే పునఃప్రారంభిస్తామని వివరించారు. పత్తిపాక రిజర్వాయర్‌ను ఫాస్ట్‌ట్రాక్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు. పత్తిపాకతో కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని పేర్కొన్నారు. 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణే లక్ష్యమని మంత్రి ఉత్తమ్ చెప్పు కొచ్చారు. ఆగస్టు నెలాఖరులోగా పత్తిపాక డీపీఆర్ సిద్ధం చేస్తామని తెలిపారు. 96 శాతం పూర్తైన రోళ్లవాగుపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. రోళ్లవాగుతో 15 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరు అందజేస్తామని చెప్పుకొచ్చారు. భూసేకరణ, టెండర్లు, అనుమతులను సమాంతరంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పెండింగ్ సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని సూచించారు. తదుపరి సమీక్షకు యాక్షన్ టేకెన్ రిపోర్ట్ తప్పనిసరని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు నీరందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.



9 లో..

## మళ్లీ భారత్‌పై వంద శాతం

# టారిఫ్ భారం

### రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై ట్రంప్ కన్నెర్ర

- 5 దేశాలపై 100 శాతం టారిఫ్‌లకు అవకాశం
- బిల్లుకు అమెరికా సెనేట్ ఆమోదం

**వాషింగ్టన్, ఆగస్టు 8 (జనంసాక్షి) :**

భారత్- అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై ట్రంప్ మళ్లీ టారిఫ్ లతో విరుచుకుపడేందుకు ముందడుగు పడింది. ఇందుకు సంబంధించిన బిల్లుకు అమెరికా సెనెట్ తాజాగా ఆమోద ముద్ర వేసింది. ఇటీవల మృతిచెందిన సెనెటర్ లిండ్సే గ్రాహమ్ పేరు మీదుగా తీసుకొచ్చిన ఈ శాంక్షనింగ్ రష్యా, ఇరాన్ యాక్ట్ 2026ను అమెరికా సెనెట్ 86-11తో ఆమోదించింది. ఆగస్టు 31న ఈ బిల్లు ప్రతినిధుల సభ ముందుకు రానుంది. అక్కడ కూడా ఆమోదం పొందిన తర్వాత అమెరికా అధ్యక్షుడి సంతకంతో ఇది చట్ట రూపం దాల్చనుంది.

ఈ బిల్లు అమల్లోకి వస్తే భారత్పై 100శాతం సుంకాలను విధించనున్నారు. ఉక్రెయిన్తో జరుగుతోన్న యుద్ధాన్ని ముగించేలా రష్యాపై ఒత్తిడి పెంచేందుకు అగ్రరాజ్యం ఈ బిల్లును తీసుకొచ్చింది. అప్పట్లో దీనిని ట్రంప్ ఆర్థిక బంకర్ బస్టర్ అభివర్ణించారు. రష్యా అధికారులు, ఆర్థిక సంస్థలు, ఇంధన ప్రాజెక్టులు లక్ష్యంగా ఈ బిల్లును రూపొందించారు. మాస్కో నుంచి చమురు దిగుమతులు చేసుకొనే దేశాలపై అధ్యక్షుడు అసాధారణ స్థాయిలో సుంకాలు విధించే అధికారం ఈ బిల్లుతో లభిస్తుంది.

## ఫ్యూచర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు

# దరఖాస్తుల వరద

### ఏడు వేల ఇళ్లకు 35 వేల దరఖాస్తులు

- దరఖాస్తుకు మరో రోజు మాత్రమే గడువు
- 20 తర్వాత లాటరీ..

**హైదరాబాద్, ఆగస్టు 8 (జనంసాక్షి) :**

ఇందిరమ్మ ఇళ్ల టవర్స్‌కు లబ్ధిదారుల నుంచి భారీ స్పందన వచ్చింది. 7,340 ఇళ్లకు 35,125 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులకు ఆగస్టు 10వ తేదీ వరకు మాత్రమే సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ గడువు విధించింది. ఆగస్టు 20వ తేదీ తర్వాత లాటరీ ద్వారా ఇళ్లను కేటాయించనుంది. మార్కెట్‌లో రూ.30 నుంచి రూ.58 లక్షల విలువైన ఫ్లాట్లను కేవలం రూ.6 లక్షలకే కాంగ్రెస్ సర్కార్ అందజేయనుంది. లబ్ధిదారులకు ఇళ్లు రాకపోతే రూ.10 వేల డిపాజిట్‌ను పూర్తిగా తెలంగాణ ప్రభుత్వం తిరిగి చెల్లించనుంది. కుల, ఆదాయ సర్టిఫికెట్లు లేకుండానే దరఖాస్తు చేసుకునే



అవకాశం కల్పించింది. ఈ ఏడాదిలోగా టవర్స్ నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయనుంది. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో 7,340 ఫ్లాట్ల నిర్మాణం చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

## మాకు అధికారం వచ్చాక..

# హెచ్‌ఎల్‌ఎఫ్ పాలసీ రద్దు చేస్తాం

### హిల్ట్ పాలసీపై సెప్టెంబర్లో అవగాహన కార్యక్రమాలు

పాలసీ కింద ఎవరైనా డబ్బులు చెల్లిస్తే నష్టపోతారు జాగ్రత్త : కేటీఆర్



**హైదరాబాద్, ఆగస్టు 8 (జనంసాక్షి) :**

నగరంలోని పారిశ్రామిక ప్రాంతాల్లోని భూములను బహుళ వినియోగ జోన్లుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ఫర్మేషన్ (హిల్ట్) పాలసీపై సెప్టెంబర్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. 10వేల ఎకరాలను ఎవరికో ధారాదత్తం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ పాలసీపై పారిశ్రామిక అసోసియేషనర్లకు లేఖలు రాస్తామన్న ఆయన.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక హిల్ట్ పాలసీ రద్దు చేస్తామని ప్రకటించారు. మీడియాతో ఇష్టాగోష్టిలో మాట్లాడిన కేటీఆర్.. ఈ పాలసీ కింద ఎవరైనా డబ్బులు చెల్లిస్తే నష్టపోతారు జాగ్రత్త అని హెచ్చరించారు. భూ మాఫియాతో

మిగతా 2లో..

# మహిళా శక్తిని బందీ చేశారు

## విపక్ష నేత రాహుల్



**ఢిల్లీ, ఆగస్టు 8 (జనంసాక్షి) :** భారతీయ మహిళల శక్తి ప్రస్తుతం బంధించబడి ఉందని రాహుల్ గాంధీ తెలిపారు. తమ ఆలోచనలను, ఆకాంక్షలను స్వేచ్ఛగా వ్యక్తపరిచే అవకాశం వారికి లభించడం లేదని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. మహిళా భాగస్వామ్యం లేకుండా ఏ దేశమూ విజయం సాధించలేదని చెప్పారు. సమాజంలో మహిళల భావప్రకటన లేకపోతే దేశం స్తబ్ధంగా, అసంపూర్ణంగా ఉండిపోతుందన్నారు. రాజకీయాల తీరు మారాలని, మహిళలకు తగిన ప్రాధాన్యం దక్కేలా ప్రజల్లో అవగాహన పెంచడమే తన రాజకీయాల ముఖ్య


మిగతా 2లో..

## జెన్ జీ కోసం

# దేశం ఎదురుచూస్తోంది

### ప్రశంసించిన ప్రధాని మోదీ

- సాంకేతిక రంగంతో పాటు దాదాపు అన్ని రంగాల్లో కొత్త మార్పులు
- జీవితాంతం కొత్త విషయాలను నేర్చుకోవాలని సూచన



**ఢిల్లీ, ఆగస్టు 8 (జనంసాక్షి) :**

విద్యార్థులు చదువు పూర్తయిన తర్వాత అడుగుపెట్టే ప్రపంచం వేగంగా మారుతోందని మోదీ అన్నారు. సాంకేతిక రంగంతో పాటు దాదాపు అన్ని రంగాల్లో కొత్త మార్పులు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు, ఆధునిక సాంకేతికత వంటి అంశాలు భవిష్యత్తును మరింతగా ప్రభావితం చేయనున్నాయని సూచించారు. ఢిల్లీలోని ఐఐటీ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మోదీ.. పట్టభద్రులైన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. రాబోయే రెండు, మూడు దశాబ్దాల్లో ప్రపంచం ఎలా మారుతుందో ఇప్పుడే కచ్చితంగా చెప్పడం సాధ్యం కాదని అన్నారు. అందుకే

మిగతా 2లో..

# వ్యక్తుల మధ్య లావాదేవీలకు చార్జీలు ఉండవట

- యూపీఐలపై సర్కారు ముచ్చట
- కేంద్ర ఆర్థికశాఖ కీలక ప్రకటన



9 లో..

## తెలంగాణలో పెట్టుబడులకు అపార అవకాశాలు

- రూ.3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- వేమో డ్రైవర్‌లెస్ కారులో ప్రయాణం
- హైదరాబాద్‌లో స్వయంచాలక మొబిలిటీపై ఆసక్తి
- ప్రవాసులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



12 లో..

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
9 ఆగస్టు 2026

# డిజిటల్ వ్యాపారంపై కమ్ముకున్న మేఘాలు




**భారం ఎవరు మోస్తారు?**
వ్యాపారులపై ఛార్జీలు విధించినప్పుడు వారు ఆ ఖర్చును పూర్తిగా భరించవచ్చు. లేకపోతే వస్తువుల ధరల్లో కొంత భాగాన్ని కలపవచ్చు. అలా జరిగితే యూపీఐ ఛార్జీని ప్రభుత్వం నేరుగా వినియోగదారుడి నుంచి వసూలు చేయకపోయినా, పరోక్షంగా వినియోగదారుడిపైనే భారం పడే అవకాశం ఉంటుంది. అయితే ఇది ప్రస్తుతం తప్పనిసరిగా జరుగుతుందని చెప్పలేం. ఎండీఆర్ విధానం, దాని పరిమితులు, ఎవరి నుంచి ఎంత వసూలు చేయాలి వంటి అంశాలపై తుది నిబంధనలే కీలకం.

**పెద్ద సంస్థలకు తేలిక.. చిన్నవారికేనా భారమంతా?**
పెద్ద రిటైల్ సంస్థలు, ఈ-కామర్స్ సంస్థలు, భారీ టర్నోవర్ ఉన్న వ్యాపార సంస్థలకు చెల్లింపు ఛార్జీలను భరించే సామర్థ్యం ఉంటుంది. కానీ రోజుకు కొన్ని వేల రూపాయల వ్యాపారం చేసే చిరు వ్యాపారులకు ప్రతి రూపాయి లాభం కీలకమే. అందుకే ఎండీఆర్ విధానం తీసుకొస్తే చిన్న వ్యాపారులకు ప్రత్యేక మినహాయింపులు లేదా పరిమితులు ఉండాలనే డిమాండ్ తెరపైకి రావచ్చు.

**సామాన్యుడి జేబుపై పడనున్న భారం ఎంత?**
యూపీఐ చెల్లింపులు ఇప్పటివరకు ప్రజలకు అత్యంత సౌకర్యవంతమైన చెల్లింపు మార్గంగా మారాయి. చిన్న మొత్తాల నుంచి పెద్ద మొత్తాల వరకు క్షణాల్లో చెల్లింపులు జరుగుతున్నాయి. ఈ వ్యవస్థలో అదనపు వ్యయం ప్రవేశిస్తే, అది మొదట వ్యాపారిపై పడినా, వ్యాపారి ధరలు పెంచడం ద్వారా చివరకు వినియోగదారుడిపైనా భారం మోపే అవకాశం ఉంది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించాలంటే వాటి ఖర్చును ఎవరు భరించాలి? చిరు వ్యాపారులపై భారం పడకుండా ప్రభుత్వం ఎలాంటి రక్షణ కల్పిస్తుంది? అన్నదే ఇప్పుడు జవాబు దొరకని ప్రధాన ప్రశ్న!

# 2028 నాటికి ఎయిర్ ట్యాక్సీలు

- కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై పరీక్షలు
- విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు




**బెంగళూరు, ఆగస్టు 8 (జనంసాక్షి) :** 2028 నాటికి దేశంలో ఎలక్ట్రిక్ ఎయిర్ టాక్సీలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని, ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై పరీక్షలు వచ్చే ఏడాది వేగవంతం కానున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. బెంగళూరులో సర్లా ఏవియేషన్ కొత్త ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవంలో రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. ఎలక్ట్రిక్ వర్టికల్ టేక్-ఆఫ్ అండ్ ల్యాండింగ్ విమానాలు బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి రద్దీగా ఉండే మహానగరాలకు కొత్త రవాణా మార్గాన్ని అందించగలవని అన్నారు. బెంగళూరులోనే కాకుండా, ముంబై, ఢిల్లీలలో కూడా వీటికి చాలా అవసరం ఉందని ఆయన చెప్పారు. 2028 నాటికి దేశంలో ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఎలక్ట్రిక్ వర్టికల్ టేక్-ఆఫ్ అండ్ ల్యాండింగ్ సాంకేతికత ద్వారా బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి మహానగరాల్లో ట్రాఫిక్ సమస్య భారీగా తగ్గుతుందని మంత్రి తెలిపారు. గంటన్నర నుంచి రెండు గంటలు పట్టే ప్రయాణ సమయం కేవలం 20 నుంచి 30 నిమిషాలకు తగ్గుతుందని స్పష్టం చేశారు. 'సర్లా ఏవియేషన' కంపెనీకి డిజైన్ ఆర్గనైజేషన్ అప్రూవల్ ను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ మంజూరు చేసిందని, నిబంధనలు, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా వచ్చే ఏడాది పూర్తిస్థాయి టెస్టింగ్ ఫేజ్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఎయిర్ ట్యాక్సీ ప్రత్యేకతలు ముఖ్యంగా ఇది పైలట్‌తో పాటు ఆరుగురు ప్రయాణికులను తీసుకెళ్లగలదు. ఇందులో మొత్తం 7 ఎలక్ట్రిక్ మోటార్లు ఉంటాయి (6 టేకాఫ్ కోసం, 1 ముందుకు వెళ్లేందుకు) ఇది ప్యూర్ ఎలక్ట్రిక్ ఆధారిత విమానం అయినప్పటికీ, అవసరమైతే గాల్లోనే బ్యాటరీ ఛార్జ్ చేసుకునేలా టర్బో-జెనరేటర్ అమర్చే వెసులుబాటు కూడా దీని డిజైన్‌లో ఉంది. స్వదేశీ తయారీ కావడంతో తక్కువ ధర: విమానయాన పరికరాలు (అవియోనిక్స్) మినహా మిగిలిన విడిభాగాలన్నీ భారత్‌లోనే తయారు కానున్నందున ప్రయాణ ధరలు సామాన్యులకు సైతం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని రామ్మోహన్ నాయుడు అభిప్రాయపడ్డారు. నిఖిల్ కామత్ (జెరోధా), బిన్నీ బన్సాల్ (ఫ్లిప్‌కార్ట్) వంటి దిగ్గజాల మద్దతు ఉన్న ఈ స్టార్టప్‌తో ఇప్పటికే బెంగళూరు ఎయిర్‌పోర్ట్ శంషాబాద్/లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం, మణిపాల్ హాస్పిటల్స్ ఎయిర్ అంబులెన్స్ సేవల కోసం ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ సాంకేతికత అందుబాటులోకి వస్తే నగర ప్రయాణాలే కాకుండా ఎయిర్ అంబులెన్స్, అత్యవసర వైద్య రవాణా, కార్గో సేవల రంగంలో భారత్ సరికొత్త రికార్డు సృష్టించడమే కాక విదేశాలకు కూడా విమానాలను ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటుందని కేంద్ర మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

# నేడు నర్సంపేటకు మాజీ సిఎం కెసిఆర్

### పెద్ది కుటుంబ సభ్యులకు పరామర్శ

**వరంగల్,ఆగస్టు 8 (జనంసాక్షి) :** బీఆరఎస్ అధినేత కేసీఆర్ నేడు నర్సంపేటకు రానున్నారు. స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించనున్నారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ, పార్టీ కోసం కృషి చేస్తూ, తన ముఖ్య అనుచరుడుగా కొనసాగిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో కేసీఆర్ విషాదంలో మునిగిపోయారు. కాగా, పెద్ది కుటుం బాన్ని ఆదుకునేందుకు తన విశాల హృదయాన్ని చాటుకున్న కేసీఆర్, ఇప్పటికే రూ.2 కోట్ల 25 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు.

# సంఘటన్ సృజన్ అభియాన్ ఛైర్మన్‌గా గంప వేణుగోపాల్



**హైదరాబాద్ :** సంఘటన్ సృజన్ అభియాన్ ఛైర్మన్‌గా గంప వేణుగోపాల్ నియమితులయ్యారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని ఎస్ఎస్ఏకి సంబంధించి కార్యకలాపాల సమన్వయం, పర్యవేక్షణ, అమలుకు నాయకత్వం వహించడం. సంస్థాగత నిర్మాణం, క్రమశిక్షణ, క్షేత్రస్థాయి అమలును బలోపేతం చేయడమే ఈ నియామకం లక్ష్యం. గంప వేణుగోపాల్ కాంగ్రెస్ పార్టీకి 30 ఏళ్లకు పైగా అంకితభావంతో సేవలందించిన అనుభవం ఉంది. 16 ఏండ్ల వయసు నుండి సిద్దిపేట డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్ యూఐ అధ్యక్షునిగా, వివిధ దేశాల్లో టీపీసీసీ ఎన్నారై సెల్ స్థాపనలో కీలకంగా పనిచేస్తూ కాంగ్రెస్‌లో కీలక పాత్రలు నిర్వహించారు. విద్యాపరంగా మూడు మాస్టర్స్ డిగ్రీలు సాధించారు. సీనియర్ నాయకత్వం మార్గదర్శకత్వంలో తెలంగాణలో ఎస్ఎస్ఏ కార్యక్రమాలను నిరంతరం ముందుకు నడిపిస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ నాయకత్వంలో పని చేయడం. క్షేత్రస్థాయి సమీకరణను వేగవంతం చేయడం, అన్ని సంస్థాగత స్థాయిలలో సమన్వయాన్ని మెరుగుపరచడం దీని లక్ష్యం.

# హనీట్రాప్‌లో వింగ్ కమాండర్!

- పాక్ కోసం గూఢచర్యం.. మేలోనే అరెస్టు
- సోషల్ మీడియా పరిచయంతో వలలోకి
- కీలక పత్రాలు, ఫొటోలు డిజిటల్‌గా పంపినట్లు ఆరోపణ
- సహోద్యోగి ఫోన్‌లో స్పైవేర్ ఇన్‌స్టాల్ చేసినట్లు వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 8 (జనంసాక్షి) :** పాకిస్థాన్ కోసం గూఢచర్యానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై భారత వైమానిక దళానికి చెందిన ఓ వింగ్ కమాండర్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. మే నెలలోనే ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పాక్ నిఘా వర్గాలు పన్నిన హనీట్రాప్‌లో ఆయన చిక్కుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వ్యక్తిగత జీవితంలో ఎదురైన ఇబ్బందులను ఆసరాగా చేసుకున్న సోషల్ మీడియా పరిచయమైన ఓ మహిళ తొలుత చాటింగ్, ఆ తర్వాత వీడియో కాల్స్ ద్వారా ఆయనకు దగ్గరైనట్లు సమాచారం. నమ్మకం ఏర్పడిన తర్వాత సైనిక కదలికలకు సంబంధించిన సమాచారం, ఫొటోలు, కీలక పత్రాలను ఆమె కోరినట్లు దర్యాప్తు వర్గాలు తెలిపాయి. ఆమె సూచనల మేరకు వింగ్ కమాండర్ కొన్ని కీలక సమాచారాన్ని డిజిటల్ మాధ్యమాల ద్వారా పంపినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా తన సహోద్యోగి ఫోన్‌లో స్పైవేర్ ఇన్‌స్టాల్ చేసేందుకు కూడా ప్రయత్నించినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. ఫోన్‌లోని సమాచారాన్ని రిమోట్‌గా సేకరించడం, లొకేషన్ వివరాలు తెలుసుకోవడం, కాల్స్‌ను పర్యవేక్షించడం వంటి లక్ష్యాలతో ఈ స్పైవేర్‌ను ఉపయోగించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారం వెనుక పెద్ద గూఢచర్య నెట్‌వర్క్ ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పాక్‌లోని హ్యాండ్లర్ల సూచనల మేరకే మహిళ వింగ్ కమాండర్‌ను హనీట్రాప్‌లోకి దింపినట్లు దర్యాప్తులో తేలినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. శత్రు దేశానికి చేరిన సమాచారంతో దేశ భద్రతకు ఎంతమేర ముప్పు ఏర్పడిందన్న అంశాన్ని అధికారులు విశ్లేషిస్తున్నారు. మహిళ వెనుక ఉన్న విదేశీ హ్యాండ్లర్లు ఎవరు? వారికి భారత రక్షణ వ్యవస్థకు సంబంధించిన సమాచారం ఎలా చేరింది? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.

# బొలెరో.. లోయలో పడి ఆరుగురు దుర్మరణం!

**నైనిటాల్, ఆగస్టు 8 (జనంసాక్షి) :** ఉత్తరాఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. దేవ్‌ప్రయాగ్ నుంచి పౌరీ వెళ్తున్న బొలెరో వాహనం శుక్రవారం సాయంత్రం సబ్దర్‌ఖల్ వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కనున్న లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో బొలెరోలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వాహనం లోయలో పడిపోవడంతో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని దేవ్‌ప్రయాగ్ పోలీసులు, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఓ బాలుడు మృతి చెందడంతో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. సమాచారం అందిన వెంటనే పోలీసులు, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను వెలికితీసి తదుపరి చర్యలు చేపట్టారు. ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు బొలెరో అదుపుతప్పడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# మహిళా శక్తిని బందీ చేశారు

ఉద్దేశమని స్పష్టం చేశారు.
రాహుల్ విడుదల చేసిన ఈ వీడియోలో మహిళల సామర్థ్యంపై విస్తృతంగా ప్రసంగించారు. దేశంలోని మహిళల శక్తి ఇంకా పూర్తిస్థాయిలో బయటకు రాలేదన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే మహిళలు తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తం చేయాలని, తమకు నచ్చిన రంగాల్లో ముందుకు సాగేందుకు అవకాశం ఉండాలని పేర్కొన్నారు. మహిళలు.. వ్యాపారం, రాజకీయాల్లో రాణించడమే కాకుండా.. ఇళ్లలోనూ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పగలగాలని, సమాజంలో ఎలాంటి భయం లేకుండా తిరగగలగాలని చెప్పారు. పితృస్వామ్య భావజాలం, మహిళలపై ఉండే కఠిన నియంత్రణ నుంచి కొంత విముక్తి అవసరమని రాహుల్ అభిప్రాయపడ్డారు. మహిళా శక్తి, మహిళా రిజర్వేషన్ అంశాలపై రాహుల్ చేసిన వరుస వ్యాఖ్యల నేపథ్యంలో.. కేంద్రంతో కాంగ్రెస్ మధ్య రాజకీయ వాగ్వాదం మరోసారి తెరపైకి వచ్చింది.

# జెన్ జీ కోసం దేశం ఎదురుచూస్తోంది



విద్యార్థులు ఒకసారి చదువు పూర్తయిందని భావించకుండా జీవితాంతం కొత్త విషయాలను నేర్చుకోవాలని సూచించారు. ఎప్పుడూ ఆసక్తిని కొనసాగిస్తూ, కొత్త విషయాలను తెలుసుకునే అలవాటు ఉన్నవారే మారుతున్న పరిస్థితుల్లో ముందుకు వెళ్లగలరని చెప్పారు.

**సమస్యను చూసి భయపడకుండా పరిష్కారం వెతకాలి**
జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యను ఒక సవాలుగా మాత్రమే చూడకూడదని ప్రధాని సూచించారు. సమస్యల వెనుక కొత్త అవకాశాలు కూడా దాగి ఉంటాయని చెప్పారు. పెద్ద సమస్య ఎదురైనప్పుడు దానిని చూసి ఆందోళన చెందకుండా, దాన్ని చిన్న చిన్న అంశాలుగా విభజించి పరిష్కరించేందుకు ప్రయత్నించాలని విద్యార్థులకు సూచించారు. కేవలం సమస్యను గుర్తించడం లేదా దానిపై ప్రశ్నలు లేవనెత్తడం సరిపోదని మోదీ అన్నారు. దానికి ఆచరణ సాధ్యమైన పరిష్కారం కనుగొనే ఆలోచనా విధానాన్ని యువత అలవర్చుకోవాలని సూచించారు. సవాళ్లను అవకాశాలుగా మార్చే సామర్థ్యమే భవిష్యత్తులో విజయాన్ని అందిస్తుందని చెప్పారు.

**దేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలి**
ప్రతి తరానికి దేశం పట్ల కొన్ని బాధ్యతలు ఉంటాయని మోదీ పేర్కొన్నారు. యువత తమ వ్యక్తిగత భవిష్యత్తుతో పాటు దేశ ప్రగతి గురించి కూడా ఆలోచించాలని పిలుపునిచ్చారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చే ప్రయాణంలో యువత ప్రత్యక్ష భాగస్వాములుగా మారాల్సిన అవసరం ఉందన్నారు.

# మాకు అధికారం వచ్చాక..హెచ్‌ఎల్‌ఎఫ్ పాలసీ రద్దు చేస్తాం

చేతులు కలపొద్దని పారిశ్రామికవేత్తలను కోరుతున్నట్లు పేర్కొన్నారు.

**కేసీఆర్ చేసినన్ని యాగాలు ఎవరూ చేయలేదు..**
బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసినన్ని యాగాలు ఎవరూ చేయలేదని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ నేతలు చేస్తున్న వరుణ యాగాలు సహా పలు అంశాలపై స్పందిస్తూ.. "యాగాలు చేయొచ్చు కానీ.. ప్రభుత్వం కూడా తన బాధ్యతలు నిర్వర్తించాలి. దైవకృపకు మానవ ప్రయత్నం కూడా ఉంటేనే ఫలితం వస్తుంది. హరీశ్రవు గుడికి వెళ్తే.. కాంగ్రెస్ నేతలు చిల్లరగా మాట్లాడుతున్నారు. క్షుద్ర పూజలంటూ కాంగ్రెస్ క్షుద్ర, సిగ్గుమాలిన రాజకీయాలు చేస్తోంది. వ్యవసాయం, రైతుల పట్ల సీఎం రేవంత్ రెడ్డికి పట్టింపు, అవగాహన లేవు. పాలమూరు బిడ్డగా చెప్పుకొనే ఆయన.. ఆ జిల్లాకు సాగునీరు ఇవ్వట్లేదు. అధికారంలో ఉన్నా.. లేకున్నా రాష్ట్రం బాగు కోరుకుంటాం. ఎక్కడికైనా వెళ్లాం.. 24 గంటల కరెంటు ఎక్కడ వస్తుందో చూపాలి. పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీ నీరు తీసుకుంటున్నా.. ఈ ప్రభుత్వానికి పట్టడం లేదు. తెలంగాణ నీటి హక్కుల్ని ఏపీ కొల్లగొడుతుంటే పట్టించుకోవట్లేదు. కేసీఆర్ నాయకత్వంలో పెద్దఎత్తున పోరాటం చేస్తాం. తెలంగాణ ఉద్యమం స్థాయిలో మళ్లీ ఉద్యమిస్తాం. గోదావరి బోర్డు సమావేశంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏంటో స్పష్టం చేయాలి. హైడ్రా పేరిట ఈ ప్రభుత్వం పేదల కడుపు కొడుతోంది" అని విమర్శించారు.

# నేడు,రేపు హైదరాబాద్ బోనాలు

### పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్,ఆగస్టు 8 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో బోనాల ఉత్సవాలు ఆగస్టు 9, 10 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు. లాల్ దర్వాజా, కార్వాన్ దర్బార్ మైసమ్మ, అంబర్‌పేట్ మహంకాళి, చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయాల పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు వెల్లడించారు. లాల్ దర్వాజా బోనాల నేపథ్యంలో పాతబస్తీలో ఆగస్టు 9వ తేదీన ఉదయం 6 గంటల నుంచి, 10వ తేదీన ఉదయం 9 గంటల నుంచి ఊరేగింపు ముగిసే వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని వెల్లడించారు. మదీనా ఎక్స్ రోడ్డు నుంచి ఇంజిన్ బౌలి (చార్మినార్, నాగుల్ చింతా విదుగా) రహదారి బోనాల ఊరేగింపు పూర్తయ్యే వరకు పూర్తిస్థాయిలో ఈ రోడ్డును మసివేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు వివరించారు. ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలకు చార్మినార్, ఫలక్‌నుమా వైపు నో ఎంట్రీ ఉంటుందని తెలిపారు. వాహనదారులను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించినట్లు వెల్లడించారు. కార్వాన్ దర్బార్ మైసమ్మ బోనాల సందర్భంగా ఆగస్టు 8వ తేదీ రాత్రి 9 గంటల నుంచి ఆగస్టు 10వ తేదీ ఉదయం వరకు పురానాపూల్, జియాగూడ, టప్పాచబుత్రా పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు. అంబర్‌పేట్ మహంకాళి ఆలయం వద్ద ఆగస్టు 9వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 10వ తేదీ మధ్యాహ్నం 12గంటల వరకు మళ్లింపులు ఉంటాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. బస్సులు, భారీ వాహనాలు అంబర్‌పేట్[illegible]గ-లఓల్లవర్ విదుగా వెళ్లాలని సూచించారు. చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయం వద్ద ఆగస్టు 9, 10వ తేదీల్లో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. సీతాఫల్‌మండి, పద్మారావు నగర్ వైపు వాహనాలను మళ్లిస్తున్నట్లు చెప్పారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# నిరుద్యోగ యువతపై ఇంత కాఠిన్యమా?

### కాంగ్రెస్ అణచివేతకు ఇదే నిదర్శనం సరూర్‌నగర్.. ఘటనపై మండిపడ్డ రాంచంద్రరావు

**హైదరాబాద్,ఆగస్టు 8 (జనంసాక్షి) :** సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగ యువతపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం తీవ్ర బాధాకరమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత ధోరణిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాహుల్ గాంధీ ఢిల్లీలో 'మొహబ్బత్ కీ దుకాణ' అని గొప్పలు చెప్తూ, తెలంగాణలో మాత్రం ఉపాధి కోరిన యువతపై లాఠీలు ఝుళిపిస్తున్నారని విమర్శించారు. హైడ్రాలో కేవలం 150 ఖాళీల కోసం వేలాది మంది యువత తరలిరావడం రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ తీవ్రతకు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి సాక్ష్యమని రామచందర్ రావు అన్నారు. అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్, నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి, స్వయం ఉపాధికి రూ.10 లక్షల వడ్డీ లేని రుణాలు ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని గుర్తు చేశారు. అయితే రెండేళ్లు గడిచినా ఒక్క హామీనీ నెరవేర్చలేదని ఆయన మండిపడ్డారు. హామీలను నమ్మి ఓటేసిన యువతను రోడ్లపాలేసి, కనీసం ఆశతో వచ్చిన వారిపై పోలీసులతో దౌర్జన్యం చేయించడం అన్యాయమని రామచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ యువత ఆకాంక్షలపై అధికారంలోకి వచ్చారో, అదే యువత భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం అంధకారంలోకి నెట్టివేసిందని ఆరోపించారు. ఉద్యోగాల కోసం వచ్చిన అభ్యర్థులపై పోలీసుల ప్రయోగంపై కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు, యువతకు సమాధానం చెప్పాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు.



# స్వర్గీయ కృష్ణారావు రాసిన పుస్తకావిష్కరణ

**మహబూబాబాద్ :** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి వాస్తవ్యులు ఒద్దిరాజు కృష్ణారావు ప్రముఖ రచయిత,వైద్యులు.ఇనుగుర్తికి చెందిన ఒ.వీ.నరసింహారావు,రంగనాయకమ్మ దంపతుల కుమారైన కృష్ణారావు పలు సినిమాల నిర్మాణంలో ముఖ్య భూమిక పోషించారు, రచయిత, వైద్యులు,ఆయన 1995లో పరమ పదించారు.ఆయన రాసిన "మిస్ అండ్ మిస్టర్"(వినోద,శృంగార,హాస్యభరిత) పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం హైదరాబాద్ నార్సింగి-మంచిరేవుల 10 విల్లాస్ లోని నివాసంలో జరిగింది.ఈ కార్యక్రమానికి ఎంపీ రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి కృష్ణారావుతో తనకున్న సాన్నిహిత్యాన్ని ఆయన కుటుంబ సభ్యులతో కలిసి గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీ రవిచంద్రతో కలిసి డాక్టర్ సీ.ఏల్.నర్సింహారావు, సుభాష్ చంద్ర, రమేష్, శిరీష్ రెడ్డి,సీతారాం చందర్ రావు, ఉమాశంకర్ రావు, శ్రీనివాసరావు, వేణుగోపాల్ రావు, అనిల్ కుమార్, సతీష్, కళ్యాణ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజును కృష్ణారావు కుటుంబ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు, అంతకుముందు జరిగిన దీపారాధన,పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

# డాక్టర్ ప్రియాంక హత్యపై అఖిలపక్ష సమావేశం

### నేడు అయిజలో సమావేశం.. హాజరుకావాలని అఖిలపక్ష కమిటీ పిలుపు

**అయిజ, ఆగస్టు 8 (జనం సాక్షి):** రాజమండ్రిలో అల్లరి మూకల చేతిలో హత్యకు గురైన డాక్టర్ ప్రియాంక మృతిని నిరసిస్తూ అయిజ మండలంలోని ఏక్లాస్పురం గ్రామానికి చెందిన కనిక వెంకటేష్ కుమార్తె డాక్టర్ ప్రియాంక హత్యపై అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు అఖిలపక్ష కమిటీ తెలిపింది. నేడు (ఆగస్టు 9) సాయంత్రం 4 గంటలకు అయిజలోని ఠాగూర్ పాఠశాల ఆవరణలో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఈ సమావేశానికి విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాలు, సామాజిక సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, రైతు సంఘం, చేనేత సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కమిటీ కోరింది.డాక్టర్ ప్రియాంక హత్య ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యాచరణపై సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపింది. ఈ సమావేశానికి ప్రతి ఒక్కరూ సమయానికి హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేసింది.
వ్యక్తిగతంగా ఫోన్ చేసి ఆహ్వానించలేకపోయినా, ఈ ప్రకటననే ఆహ్వానంగా భావించి ఘటనను ఖండించేందుకు సమావేశానికి హాజరుకావాలని అఖిలపక్ష కమిటీ కోరింది.

# 4వేల మంది భారత నావికులను సురక్షితంగా తీసుకొచ్చాం : కేంద్రం

**న్యూఢిల్లీ, ఆగస్టు 8 (జనంసాక్షి) :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ జల మార్గాల్లో చిక్కుకుపోయిన నాలుగు వేల మందికి పైగా భారత నావికులను సురక్షితంగా స్వదేశానికి తీసుకు వచ్చామని కేంద్ర షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ వెల్లడించారు. నావికుల భద్రత, సంక్షేమానికి సంబంధించి ముంబయిలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమం లో మాట్లాడిన ఆయన.. ప్రతి నావికుడికి సంబంధించిన వివరాలను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మారిటైమ్ అడ్మినిస్ట్రేషన్ అందుబాటులో ఉంచుతామన్నారు. "అంతర్జాతీయంగా సముద్రజలాల్లో ఉన్న నౌకల్లోని ప్రతి ఒక్క భారతీయ నావికుడు సురక్షితంగా ఉండేలా చూడటం మా లక్ష్యం. ఇప్పటివరకు 4048 మందిని సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చాం. వారి కుటుంబాలకూ అండగా నిలిచాం" అని కేంద్ర మంత్రి వెల్లడించారు. సంక్షోభ సమయంలో నావికులను సురక్షితంగా తీసుకువచ్చేందుకు విదేశాంగ శాఖ, ఆయా దేశాల్లోని దౌత్య కార్యాలయాలు, భారత నౌకాదళం, నౌకల యజమానులు సహా ఆయా విభాగాలు కృషి చేశాయన్నారు. నావికులు, షిప్పింగ్ కంపెనీలు, పోర్టులు, వివిధ భాగస్వామ్య పక్షాలకు సేవలందించేందుకు ఈ-సముద్ర పేరుతో డిజిటల్ వేదికను త్వరలో అందుబాటులోకి తేనున్నామని వివరించారు.




# ఈ రోజుల్లో 'సర్టిఫికెట్లకు' విలువ లేదు : రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 8 (జనంసాక్షి) :** భారత్‌లో ఉన్న సుమారు 40 కోట్ల మంది యువతే దేశానికి అసలైన సంపద అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. వారి సామర్థ్యం ప్రపంచంలోనే సాటిలేనిదన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్లో 'విద్యార్థుల గళం' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఈ రోజుల్లో దేశంలో స్టడీ సర్టిఫికెట్లకు విలువ లేదని, అవి ఉద్యోగాలు కల్పించడం లేవన్నారు. ఉద్యోగం పొందాలంటే కేవలం డిగ్రీ ఉంటే సరిపోదన్నారు. "అమెరికా, చైనా, రష్యాల గురించి ఎంతో మాట్లాడుకుంటున్నప్పటికీ.. మన దేశ యువతకు ఎవరూ సాటిలేరు. కానీ, ఈ రోజుల్లో మన దేశంలో స్టడీ సర్టిఫికెట్లకు విలువ లేదు. అవి మీకు ఉద్యోగాలు ఇప్పించలేవు. దేశంలో ఉపాధికి సంబంధించిన అన్ని దారులు మూసుకుపోయాయి. తయారీ రంగం పడిపోవడం, రుణాలు పొందడంలో ఇబ్బందులు, పరీక్ష పత్రాల లీకేజీ, ఉద్యోగాలను ఏఐ భర్తీ చేయడం వంటివి యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయి" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# డిలిమిటేషన్‌పై తమిళనాట ఉత్కంఠ

- సిఎం విజయ్ నేతృత్వంలో అఖిలపక్ష ఎంపిల భేటీ
- ఉన్న ఎంపి సీట్లను అలాగే కొనసాగించాలని డిమాండ్



**చెన్నై, ఆగస్టు 8 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'డీలిమిటేషన' ప్రక్రియపై తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రాష్ట్ర రాజకీయ ప్రాతినిధ్యం తగ్గకుండా అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శనివారం చెన్నైలోని కలైవానర్ అరంగంలో తమిళనాడు ఎంపీలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అయితే, రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకేలతో పాటు పీఎంకే, డీఎండీకే ఈ భేటీని బహిష్కరించడం చర్చనీయాంశమైంది. పార్టీ రాజకీయాలకు అతీతంగా తమిళనాడు హక్కుల పరిరక్షణెలి లక్ష్యంగా కాంగ్రెస్, విసికె, సిపిఐ సిపిఎం, ఎండిఎంకె, ఐయుఎంఎల్ పార్టీలకు చెందిన దాదాపు 21 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఈ భేటీలో పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 వద్దే ఉంచాలని ఈ సందర్భంగా ఎంపీలు డిమాండ్ చేశారు. తమిళనాడుకు ప్రస్తుతం ఉన్న 39 లోక్‌సభ స్థానాల కేటాయింపులో ఎలాంటి మార్పులు చేయకూడదని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా తమిళనాడు, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేశాయని ఎంపీలు గుర్తుచేశారు. ఇప్పుడు కేవలం జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల సంఖ్యను పెంచితే, జనాభా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాలకు లబ్ది చేకూరి, దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తీవ్రంగా తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడు పాత్రను పార్లమెంట్‌లో తగ్గించే ఏ డీలిమిటేషన్ సూత్రాన్నైనా తీవ్రంగా నిరసిస్తామని, లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచితే అది ప్రభావవంతమైన పార్లమెంట్ కాబోదని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం పేర్కొన్నారు. తమిళనాడును ఇన్నేళ్లు పాలించిన డీఎంకే, అన్నాడీఎంకేలు రాష్ట్ర హక్కుల కోసం నిర్వహిస్తున్న భేటీకి రాకపోవడం విచారకరమని, వారికి రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమని కాంగ్రెస్ ఎంపీలు ప్రవీణ్ చక్రవర్తి, విష్ణు ప్రసాద్ విమర్శించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన 57 మంది ఎంపీలలో 36 మంది ఈ భేటీకి దూరంగా ఉండటం, విజయ్ ప్రభుత్వానికి స్పష్టమైన ఎజెండా లేదంటూ డీఎంకే ఆరోపించడం.. తమిళనాడు రాజకీయ సవికరణాలను మరింత ఆసక్తికరంగా మార్చాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
09 ఆగస్ట్ 2026

## ట్రంప్ సుంకాల సెగ.. రూపాయికి పతన భయం

### భారత్‌పై అమెరికా ఆర్థిక కర్రపెత్తనం ఎంతవరకు?

సంపాదకీయం

భారత్‌పై అమెరికా మరోసారి ఆర్థిక బెదిరింపులకు దిగింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై 100 శాతం సుంకాలు విధించే బిల్లుకు అమెరికా సెనేట్ ఆమోదం తెలపడం ఆందోళన కలిగించే పరిణామం. ఒక సార్వభౌమ దేశం తన ఇంధన అవసరాలను ఎక్కడి నుంచి తీర్చుకోవాలో నిర్ణయించుకునే హక్కును ప్రశ్నించే స్థాయికి అమెరికా వెళ్లడం మిత్రదేశాల మధ్య సంబంధాల అసలు స్వరూపాన్ని బయటపెడుతోంది.

భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోంది. ఎందుకు? చౌకగా లభిస్తే కొనుగోలు చేస్తోంది. దేశానికి నిరంతరంగా ఇంధన సరఫరా అవసరం. అంతర్జాతీయ మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ధరలు, సరఫరా భద్రత, దేశ ప్రయోజనాలను బేరీజు వేసుకుని భారత్ నిర్ణయం తీసుకుంటోంది. ఇందులో అమెరికాకు అభ్యంతరం ఏమిటి? రష్యాతో భారత్ యుద్ధం చేయడం లేదు. అమెరికా విధించిన ఆంక్షలను భారత్ ఉల్లంఘించడం ద్వారా అమెరికా ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగించడం లేదు. అయినా భారత్‌పై 100 శాతం సుంకాల బెదిరింపు ఎందుకు? "మేము చెప్పిన దేశం నుంచే కొనాలి.. లేదంటే భారీ సుంకాలు చెల్లించాలి" అన్నది వాణిజ్య విధానమా? లేక ఆర్థిక కర్రపెత్తనమా?

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల్లో రెండింటిగా భారత్, అమెరికాలు తమను తాము చెప్పుకుంటాయి. వ్యూహాత్మక భాగస్వామ్యం, రక్షణ సహకారం, సాంకేతిక భాగస్వామ్యం అంటూ రెండు దేశాల ప్రభుత్వాలు ఎన్నో సందర్భాల్లో గొప్పగా చెప్పుకున్నాయి. మరి ఆ భాగస్వామ్యంలో భారత్‌కు తన సొంత ఆర్థిక నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ లేదా? కరోనా సమయంలో జరిగిన "హౌడీ మోదీ" కార్యక్రమం గుర్తుండే ఉంటుంది. ఆ సమయంలో భారత్-అమెరికా స్నేహబంధాన్ని ప్రపంచానికి చాటేందుకు ఇరు దేశాల నాయకులు భారీ ప్రదర్శన చేశారు. పరస్పర ప్రశంసలు కురిపించారు. కానీ ఇప్పుడు అదే భారత్ తన జాతీయ ప్రయోజనాల ప్రకారం చమురు కొనుగోలు చేస్తే సుంకాల బెదిరింపులు చేయడం ఎంతవరకు మిత్రత్వం?

రష్యా చమురు ఆదాయాన్ని తగ్గించడం ద్వారా ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు ఒత్తిడి పెంచాలనేది దాని లక్ష్యం. రష్యా ఆదాయం తగ్గితే యుద్ధానికి నిధులు తగ్గుతాయని అమెరికా భావిస్తోంది. భారత్, చైనా వంటి భారీ కొనుగోలుదారులను రష్యా చమురు నుంచి దూరం చేయడం ద్వారా మాస్కోపై ఒత్తిడి పెంచవచ్చని అమెరికా లెక్కలు వేస్తోంది. కానీ ఆ లెక్కల్లో భారత్ ప్రయోజనాలు ఎక్కడ? ఉక్రెయిన్ యుద్ధాన్ని భారత్ ప్రారంభించలేదు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి భారత్ కారణం కాదు. యుద్ధాన్ని ఆపాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజానిదే. కానీ ఆ యుద్ధం కారణంగా భారతీయ వినియోగదారులు, పరిశ్రమలు, వ్యాపారులు, రూపాయి ఎందుకు మూల్యం చెల్లించాలి? 100 శాతం సుంకాల ప్రభావం వాణిజ్యంపై పడితే భారత ఎగుమతులపై ఒత్తిడి పెరగవచ్చు. విదేశీ పెట్టుబడిదారులలో అనిశ్చితి ఏర్పడవచ్చు. దిగుమతుల వ్యయం పెరిగితే రూపాయిపై మరింత ఒత్తిడి రావచ్చు. రూపాయి బలహీనపడితే చమురు, బంగారం, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర దిగుమతుల ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. చివరికి ఆ భారాన్ని మోయాల్సింది ఎవరు? సామాన్య భారతీయుడే.

జనంసాక్షి

అమెరికా విధానం అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థకు కూడా ప్రమాదకర సంకేతం. ఒక దేశం తన రాజకీయ లక్ష్యాల కోసం మరో దేశం వాణిజ్య నిర్ణయాలను శాసించేందుకు ప్రయత్నిస్తే, రేపు ఇదే విధానాన్ని ఇతర శక్తివంతమైన దేశాలు అనుసరిస్తే ప్రపంచ వాణిజ్యం ఎటువైపు వెళ్తుంది? ఇది కేవలం భారత్-అమెరికా సమస్య కాదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఎవరి పెత్తనం ఉండాలి అన్న ప్రశ్న.

భారత్ చిన్న దేశం కాదు. 140 కోట్లకు పైగా జనాభా ఉన్న భారీ మార్కెట్. ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక వ్యవస్థల్లో ఒకటి. సాంకేతిక రంగంలో వేగంగా ఎదుగుతున్న దేశం. అంతర్జాతీయ సరఫరా గొలుసుల్లో కీలక భాగస్వామి. భారత్‌ను ఒత్తిడితో వంచించాలనుకోవడం అమెరికాకే దీర్ఘకాలంలో నష్టం కలిగించవచ్చు. బెదిరింపులు పెరిగితే భారత్ కూడా ప్రత్యామ్నాయ వాణిజ్య భాగస్వామ్యాల వైపు మరింత వేగంగా వెళ్లవచ్చు. చమురు దిగుమతులను విభిన్న దేశాల నుంచి పొందవచ్చు. దేశీయ ఇంధన వనరులపై దృష్టి పెంచవచ్చు. పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత బలోపేతం చేయవచ్చు. అంటే అమెరికా విధించే ఒత్తిడి, అనుకోకుండా భారత్‌ను మరింత ఆత్మనిర్భరత వైపు నడిపించే అవకాశం కూడా ఉంది. అందుకే కేంద్ర ప్రభుత్వం కూడా కేవలం అమెరికా నిర్ణయాన్ని ఖండించడం సరిపోదు. రూపాయి విలువను కాపాడేందుకు, ఎగుమతులను రక్షించేందుకు, చమురు ధరల ప్రభావాన్ని తగ్గించేందుకు స్పష్టమైన కార్యాచరణ అవసరం. వాణిజ్య భాగస్వామ్యాలను విస్తరించాలి. విదేశీ మారక ఆదాయాన్ని పెంచాలి. దేశీయ ఉత్పత్తి, ఇంధన భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి.

రక్షణ, సాంకేతికత, పెట్టుబడులు, విద్య, వాణిజ్యం వంటి అనేక రంగాల్లో రెండు దేశాలకు పరస్పర ప్రయోజనాలు ఉన్నాయి. కానీ ఆ సంబంధం సమానత్వం మీద ఉండాలి.. ఒత్తిడి మీద కాదు. భారత్‌కు అమెరికా అవసరం ఉంది. అదే సమయంలో అమెరికాకు కూడా భారత్ అవసరం ఉంది. కాబట్టి చర్చల ద్వారా సమస్య పరిష్కరించుకోవడమే రెండు దేశాలకు మంచిది. మిత్రత్వం పేరుతో ఆర్థిక ఆంక్షలు.. భాగస్వామ్యం పేరుతో వాణిజ్య బెదిరింపులు.. వ్యూహాత్మక సంబంధాల పేరుతో సార్వభౌమ నిర్ణయాలపై పెత్తనం ఇవి ఏవీ ఆమోదయోగ్యం కావు. భారత్ తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకుంటూనే అమెరికాతో చర్చించాలి. అవసరమైతే గట్టిగా సమాధానం చెప్పాలి. ఎందుకంటే ఇది కేవలం చమురు కొనుగోలు సమస్య కాదు. ఇది భారత ఆర్థిక సార్వభౌమత్వానికి సంబంధించిన ప్రశ్న. ట్రంప్ సుంకాల సెగ భారత్‌ను తాకకముందే.. భారత్ తన ఆర్థిక కవచాన్ని మరింత గట్టిగా నిర్మించుకోవాలి. స్నేహం కావాలి.. కానీ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టి కాదు.

# ఆకలి తీర్చిన వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్

భారతదేశ వ్యవసాయ చరిత్రలో కొన్ని పేర్లు కేవలం శాస్త్రవేత్తలుగా మిగిలిపోలేదు. దేశ ఆహార భద్రతను, రైతుల భవిష్యత్తును, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసిన చారిత్రక వ్యక్తులుగా నిలిచిపోయాయి. అలాంటి అరుదైన వ్యవసాయ శాస్త్రవేత్తల్లో డాక్టర్ మంకొంబు సాంబశివన్ స్వామినాథన్ ఒకరు. 1925 ఆగస్టు 7న తమిళనాడులోని కుంభకోణంలో జన్మించిన ఆయన భారతదేశం ఎదుర్కొన్న తీవ్రమైన ఆహార సంక్షోభాన్ని శాస్త్రీయ పరిజ్ఞానంతో ఎదుర్కొనే దిశగా తన జీవితాన్ని అంకితం చేశారు. ఆగస్టు 7 ఆయన జయంతి సందర్భంగా భారత వ్యవసాయ రంగానికి ఆయన చేసిన సేవలను స్మరించుకోవడం అంటే కేవలం ఒక శాస్త్రవేత్తను గుర్తుచేసుకోవడం కాదు, ఆకలి నుంచి ఆహార భద్రత వైపు భారతదేశం సాగించిన చారిత్రక ప్రయాణాన్ని గుర్తుచేసుకోవడం.

జనంసాక్షి

1943లో బెంగాల్‌లో సంభవించిన భయంకరమైన కరువు స్వామినాథన్ మనస్సుపై తీవ్ర ప్రభావం చూపింది. ఆకలి కేవలం ఆహారం లేకపోవడం వల్ల ఏర్పడే సమస్య కాదని, దాని వెనుక వ్యవసాయ ఉత్పత్తి, పేదరికం, వనరుల పంపిణీ, రైతుల ఆర్థిక పరిస్థితి వంటి అనేక అంశాలు ఉన్నాయని ఆయన గ్రహించారు. దేశంలో ఆకలిని నిర్మూలించాలంటే వ్యవసాయాన్ని శాస్త్రీయ పరిశోధనతో అనుసంధానం చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు. వ్యవసాయ శాస్త్రాన్ని తన జీవిత లక్ష్యంగా ఎంచుకుని భారత వ్యవసాయ పరిశోధనా సంస్థలో విద్యాభ్యాసం చేశారు. తరువాత కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసించి జన్యు శాస్త్రం, మొక్కల అభివృద్ధి, వ్యవసాయ ఉత్పాదకతపై పరిశోధనలు సాగించారు. 1960వ దశకంలో భారతదేశం ఆహార సంక్షోభంతో పోరాడుతున్న సమయంలో స్వామినాథన్ పాత్ర మరింత కీలకంగా మారింది. జనాభా వేగంగా పెరుగుతున్నా వ్యవసాయ ఉత్పత్తి అందుకు అనుగుణంగా పెరగలేదు. వరుస కరువులు దేశ ఆహార భద్రతను ప్రమాదంలోకి నెట్టాయి. ఆహార ధాన్యాల కోసం విదేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో అధిక దిగుబడి వంగడాలు, మెరుగైన సాగు పద్ధతులు, ఎరువులు, సాగునీరు, వ్యవసాయ పరిశోధనలను సమగ్రంగా ఉపయోగించుకో వాల్సిన అవసరం ఏర్పడింది.

ప్రపంచ ప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త నార్మన్ బోర్లాగ్ అభివృద్ధి చేసిన అధిక దిగుబడి గోధుమ వంగడాలను భారత పరిస్థితులకు అనుగుణంగా విస్తరించడంలో స్వామినాథన్ కీలక



స్వామినాథన్ భారతదేశానికి ఇచ్చిన గొప్ప సందేశం ఇదే.. వ్యవసాయ విజయం అంటే కేవలం ఎక్కువ పంట కాదు; రైతు సంక్షేమం, వినియోగదారుడి ఆహార భద్రత, గ్రామీణ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ అన్నీ కలిసిన సమగ్ర వ్యవస్థ. హరిత విప్లవం భారతదేశానికి ఆకలి నుంచి విముక్తి కల్పించిన చారిత్రక అధ్యాయం అయితే, శాశ్వత హరిత విప్లవం భవిష్యత్ తరాలకు భద్రమైన వ్యవసాయాన్ని అందించే తదుపరి అధ్యాయం కావాలి.

పాత్ర పోషించారు. గోధుమ, వరి ఉత్పత్తిలో అధిక దిగుబడులు సాధించే విధంగా పరిశోధన, విత్తనాల అభివృద్ధి, రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించడం, సాగునీటి విస్తరణ, ఎరువుల వినియోగం వంటి అంశాలను సమన్వయం చేశారు. ఫలితంగా భారతదేశ వ్యవసాయ రంగంలో ఉత్పత్తి విప్లవాత్మకంగా పెరిగింది. ఈ పరిణామాన్నే హరిత విప్లవంగా పేర్కొంటారు. ఇక్కడ ఒక చారిత్రక స్పష్టత అవసరం. ప్రపంచవ్యాప్తంగా "హరిత విప్లవ పితామహుడు" అనే బిరుదు సాధారణంగా నార్మన్ బోర్లాగ్‌కు ఉపయోగించబడుతుంది. భారతదేశంలో హరిత విప్లవానికి శాస్త్రీయ, సంస్థాగత నాయకత్వం అందించిన ప్రముఖ వ్యక్తిగా ఎం. ఎస్. స్వామినాథన్‌ను గౌరవిస్తారు.

హరిత విప్లవం భారతదేశానికి ఆహార భద్రతను అందించినప్పటికీ, దాని సామాజిక, ఆర్థిక, పర్యావరణ పరిణామాలను కూడా సమగ్రంగా పరిశీలించాలి. అధిక దిగుబడి వంగడాల సాగుతో పాటు రసాయన ఎరువులు, పురుగుమందులు, సాగునీటి వినియోగం గణనీయంగా పెరిగాయి. వ్యవసాయంలో యాంత్రీకరణ, మార్కెట్ ఆధారిత ఉత్పత్తి, పెట్టుబడి అవసరాలు పెరిగాయి. పెద్ద రైతులు కొత్త సాంకేతికతను వేగంగా స్వీకరించ గలిగినప్పటికీ చిన్న, సన్నకారు రైతులకు ఆర్థిక పరిమితులు అడ్డంకిగా నిలిచాయి. కొన్ని ప్రాంతాల్లో భూగర్భజలాల అధిక వినియోగం, నేల సారం తగ్గడం, జీవ వైవిధ్యంపై ప్రభావం వంటి సమస్యలు కూడా వెలుగులోకి వచ్చాయి.

హరిత విప్లవంతో వ్యవసాయ ఉత్పత్తి పెరిగినప్పటికీ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కొత్త సామాజిక, ఆర్థిక సంబంధాలు ఏర్పడ్డాయి. వ్యవసాయంలో పెట్టుబడి అవసరాలు పెరగడం, మార్కెట్‌పై ఆధారపడటం, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యంత్రాల వినియోగం విస్తరించడం వంటి పరిణామాలు వ్యవసాయాన్ని మరింత వాణిజ్యీకరించాయి. మిగులు ధాన్యాల సేకరణ, నిల్వ, పంపిణీ కోసం ప్రభుత్వ వ్యవస్థలు బలోపేతం అయ్యాయి. కనీస మద్దతు ధర, ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ, భారత ఆహార సంస్థ వంటి సంస్థాగత ఏర్పాట్లు ఆహార భద్రత నిర్మాణంలో కీలకంగా మారాయి. ఈ పరిణామాలన్నింటినీ స్వామినాథన్ స్వయంగా కూడా విమర్శనాత్మకంగా పరిశీలించారు. కేవలం ఉత్పత్తి పెంచడం మాత్రమే వ్యవసాయ విజయానికి ప్రమాణం కాదని ఆయన భావించారు. రైతు ఆదాయం, వినియోగదారుల పోషకాహారం, పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల సంరక్షణ కూడా వ్యవసాయ విధానంలో భాగం కావాలని ఆయన స్పష్టం చేశారు. అందుకే ఆయన తరువాత "శాశ్వత హరితవిప్లవం" అనే భావనను ముందుకు తెచ్చారు. ఉత్పత్తి పెరగాలి; అదే సమయంలో నేల, నీరు, జీవ వైవిధ్యం వంటి ప్రకృతి వనరులు కాపాడబడాలి అనేది ఈ భావనలోని ప్రధాన సూత్రం.

భారత వ్యవసాయ చరిత్రలో స్వామినాథన్ పాత్రను తెలంగాణతో అనుసంధానించే మరో ముఖ్యమైన అంశం అంతర్జాతీయ పంటల పరిశోధనా సంస్థ. 1972లో ప్రస్తుత తెలంగాణలోని పటాన్‌చెరు సమీపంలో అంతర్జాతీయ పంటల పరిశోధనా సంస్థ స్థాపనకు ఆయన విశేషంగా కృషి చేశారు. ఎండ ప్రాంతాలు, అర్ధ శుష్క ప్రాంతాల వ్యవసాయ సమస్యలపై పరిశోధనలు చేయడంలో ఈ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యతను సంపాదించింది. కంది, శనగ, వేరుశనగ, జొన్న, సజ్జ వంటి పంటలపై పరిశోధనలు సాగించడం ద్వారా వర్షాధార వ్యవసాయానికి శాస్త్రీయ పరిష్కారాల అన్వేషణకు ఇది తోడ్పడింది.

2004లో ఏర్పాటు చేసిన జాతీయ రైతుల కమిషన్‌కు స్వామినాథన్ అధ్యక్షత వహించడం ఆయన రైతు సంక్షేమ దృక్పథానికి మరో ఉదాహరణ. రైతుల ఆదాయం, వ్యవసాయ పెట్టుబడులు, నీటి నిర్వహణ, భూ సంరక్షణ, రుణ సౌకర్యం, పంట బీమా, మార్కెటింగ్, కనీస మద్దతు ధర వంటి అంశాలను కమిషన్ సమగ్రంగా పరిశీలించింది. రైతులకు ఉత్పత్తి వ్యయం ఆధారంగా సముచిత ధర లభించాల్సిన అవసరాన్ని కమిషన్ బలంగా ప్రతిపాదించింది. రైతు సమస్యలను కేవలం వ్యవసాయ సమస్యగా కాకుండా గ్రామీణ జీవన భద్రత, ఆహార భద్రత, సామాజిక న్యాయానికి సంబంధించిన అంశంగా చూడాలనే దృక్పథాన్ని ఈ సిఫార్సులు ప్రతిబింబించాయి.

స్వామినాథన్ ఆలోచనలలో అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం రైతు కేంద్రిత వ్యవసాయ విధానం. రైతు కేవలం ఉత్పత్తిదారు కాదు; దేశ ఆహార భద్రతకు మూలస్తంభం. రైతు పొలంలో విత్తనం వేసినప్పటి నుంచి వినియోగదారుడి భోజన పళ్లెంలో ఆహారం చేరే వరకు ఒక పెద్ద ఆర్థిక వ్యవస్థ పనిచేస్తుంది. ఈ వ్యవస్థలో రైతుకు న్యాయమైన వాటా లభించాలి. ఉత్పత్తి వ్యయం, కుటుంబ శ్రమ, భూమి, నీరు, పెట్టుబడి, ప్రమాదం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని రైతు ఆదాయాన్ని నిర్ధారించే విధానాలు అవసరం.

వ్యవసాయ విధానంలో ధర భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి. కనీస మద్దతు ధర ప్రకటించడం మాత్రమే కాకుండా, అవసరమైన పంటలకు సమర్థవంతమైన ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ, నిల్వ సదుపాయాలు, మార్కెట్ మౌలిక వసతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ప్రత్యక్ష మార్కెటింగ్ అవకాశాలు బలోపేతం కావాలి. రైతు పంటను అమ్మే సమయంలో అతని బలహీన స్థితిని మార్కెట్ శక్తులు ఉపయోగించుకోకుండా రక్షణ కల్పించాలి. రైతు ఆదాయం స్థిరంగా ఉన్నప్పుడే వ్యవసాయం యువతకు ఆకర్షణీయమైన వృత్తిగా మారుతుంది.

ఆకలితో ఉన్న భారతదేశానికి ఆహారాన్ని అందించిన శాస్త్రవేత్తగా స్వామినాథన్ చరిత్రలో నిలిచిపోయారు. రైతు సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన వ్యవసాయం, పోషకాహార భద్రత కోసం ఆయన చూపిన మార్గం భవిష్యత్ భారతదేశానికి దిశానిర్దేశం చేస్తుంది. ఆకలిని జయించిన హరిత విప్లవం ఆయన శాస్త్రీయ వారసత్వమైతే, రైతును కాపాడుతూ ప్రకృతిని పరిరక్షించే శాశ్వత హరిత విప్లవమే ఆయనకు ఇవ్వగలిగే నిజమైన నివాళి.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# ఆదివాసీల హక్కులను హరించి అభివృద్ధికి కొత్త భాష్యాలు

ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవం. ఇది కేవలం ఒక వర్గాన్ని స్మరించుకునే రోజు కాదు. ఆధునిక అభివృద్ధి నమూనా ఎవరి భూమిపై, ఎవరి వనరులతో, ఎవరి మూల్యంతో నిర్మితమవుతోందన్న ప్రశ్నను సమాజం ముందుంచే సందర్భం. ప్రపంచవ్యాప్తంగా ఆదివాసీ సమాజాలు ప్రకృతి సంరక్షణకు కీలకమైన జ్ఞానాన్ని తరతరాలుగా కాపాడుతున్నప్పటికీ, అభివృద్ధి పేరుతో వారి భూమి, అడవి, జీవనాధారాలపై ఒత్తిడి పెరుగుతూనే ఉంది.



భారతదేశంలో ఈ సమస్య మరింత సంక్లిష్టమైనది. 2011 జనగణన ప్రకారం దేశంలో షెడ్యూల్డ్ ట్రైబ్ జనాభా 10.43 కోట్లు. ఇది మొత్తం జనాభాలో 8.6 శాతం. అంటే దేశ జనాభాలో ప్రతి పన్నెండు మందిలో ఒకరు ఆదివాసీ సమాజానికి చెందినవారు. అయితే జనాభాలో వారి వాటా 8.6 శాతమే అయినప్పటికీ, ఖనిజ సంపద, అడవులు, నదుల పరీవాహక ప్రాంతాలు, జీవవైవిధ్యం అధికంగా ఉన్న భూభాగాల్లో వారి నివాసం ఎక్కువ. అందువల్ల ఆర్థికాభివృద్ధి, పారిశ్రామికీకరణ, గనుల తవ్వకం, ఆనకట్టలు, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి చర్యలకు వారు ప్రత్యక్షంగా ప్రభావితమయ్యే వర్గంగా మారుతున్నారు.

స్వాతంత్ర్యం తరువాత దేశ నిర్మాణానికి భారీ ప్రాజెక్టులు అవసరమయ్యాయి. కానీ వాటి సామాజిక వ్యయం సమానంగా పంచబడలేదు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ఒక నివేదిక ప్రకారం 1951--1990 మధ్య ఆనకట్టలు, గనులు, పరిశ్రమలు, వన్యప్రాణి అభయారణ్యాలు తదితర ప్రాజెక్టుల కారణంగా సుమారు 85 లక్షల మంది ఆదివాసీలు నిర్వాసితులయ్యారు. అదే కాలంలో మొత్తం నిర్వాసితుల్లో వారి వాటా సుమారు 40 శాతంగా నమోదైంది. ఇది ఒక అసౌకర్యకరమైన ప్రశ్నను లేవనెత్తుతుంది: దేశ అభివృద్ధి ఫలితాలు అందరికీ సమానంగా దక్కకపోతే, దాని భారం కూడా సమానంగా పంచబడుతున్నదా?

జనంసాక్షి


ఇక్కడ సమస్య కేవలం భూమి కోల్పోవడం మాత్రమే కాదు. భూమితో పాటు జీవన విధానం, సామాజిక సంబంధాలు, సంస్కృతి, స్థానిక ఆర్థిక వ్యవస్థ, అడవిపై ఆధారపడిన ఆహార భద్రత కూడా దెబ్బతింటాయి. ఒక ఆదివాసీ కుటుంబానికి అడవి అంటే కేవలం చెట్ల సమూహం కాదు. అది ఆహారం, ఔషధం, ఉపాధి, నీరు, పశువుల మేత, సంస్కృతి, ఆధ్యాత్మిక జీవితం అన్నింటికీ ఆధారం. అందుకే అడవిని కోల్పోవడం అంటే ఒక భౌగోళిక స్థలాన్ని మాత్రమే కోల్పోవడం కాదు. ఒక సంపూర్ణ జీవన వ్యవస్థను కోల్పోవడం.

ఈ వాస్తవాన్ని గుర్తించినందుకే భారత రాజ్యాంగం 5, 6వ, షెడ్యూళ్ల ద్వారా ప్రత్యేక రక్షణలను కల్పించింది. పంచాయతీల విస్తరణ షెడ్యూల్డ్ ప్రాంతాల చట్టం, 1996 (పెసా) స్థానిక గిరిజన సమాజాలకు నిర్ణయ ప్రక్రియలో పాత్ర కల్పించేందుకు రూపొందించబడింది. అలాగే అటవీ హక్కుల చట్టం, 2006 అడవులపై ఆధారపడే గిరిజనులకు వ్యక్తిగత, సామూహిక, నివాస, మేత, నీటి వనరులు, జీవవైవిధ్యం, సంప్రదాయ జ్ఞానం, సామూహిక అటవీ వనరుల సంరక్షణ వంటి హక్కులను గుర్తించింది.

కానీ చట్టం ఉండటం ఒక విషయం. అది నేలమీద అమలవడం మరో విషయం. ప్రభుత్వమే గిరిజనుల హక్కులను చట్టబద్ధం చేసి, అదే సమయంలో ఆ ప్రాంతాల్లో పెద్ద ప్రాజెక్టులకు అనుమతులు ఇస్తే, పరస్పర విరుద్ధమైన విధానాలు ఏర్పడతాయి. అభివృద్ధి ప్రాజెక్టు కోసం భూమి అవసరమైతే స్థానిక సమాజం అభిప్రాయం తీసుకోవడం, సరైన పునరావాసం కల్పించడం, జీవనాధారాన్ని పునరుద్ధరించడం, నష్టానికి న్యాయమైన పరిహారం ఇవ్వడం ప్రజాస్వామ్య బాధ్యత. లేకపోతే 'అభివృద్ధి' అనే పదం ప్రజల భాగస్వామ్యానికి బదులుగా వారి నిర్వాసితత్వానికి పర్యాయపదంగా మారుతుంది.

విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో కూడా ఈ అంతరం కొనసాగుతోంది. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్వయంగా షెడ్యూల్డ్ ట్రైబ్‌లలో అత్యల్ప అక్షరాస్యత కలిగిన సమూహాలపై ప్రత్యేక గణాంకాలను ప్రచురిస్తోంది. 2011 జనగణన ఆధారంగా గిరిజన విద్యా స్థితిపై ప్రత్యేక పట్టికలు కూడా అందుబాటులో ఉన్నాయి. అంటే సమస్యను కేవలం 'అడవి హక్కులు' అనే ఒక కోణంలో చూడటం సరిపోదు. నాణ్యమైన విద్య, స్థానిక భాషల్లో బోధన, ఆరోగ్య సేవలు, పోషణ, డిజిటల్ ప్రాప్యత, ఉపాధి, మహిళల ఆర్థిక సాధికారత వంటి అనేక అంశాలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. అయితే మరో ప్రమాదం కూడా ఉంది. ఆదివాసీ సమాజాన్ని కాపాడాలనే పేరుతో వారిని అభివృద్ధి నుంచి దూరంగా ఉంచడం కూడా పరిష్కారం కాదు. వారికి రహదారులు కావాలి, పాఠశాలలు కావాలి, ఆసుపత్రులు కావాలి, ఇంటర్నెట్ కావాలి, ఆధునిక ఉపాధి అవకాశాలు కావాలి. కానీ నిర్ణయం తీసుకునే హక్కు లేకుండా కేవలం అభివృద్ధిని వారిపై రుద్దడం మాత్రం అభివృద్ధి కాదు. వారి భూమిపై ప్రాజెక్టు నిర్మించాలా వద్దా అన్న నిర్ణయంలో వారి గొంతు వినిపించాలి. అక్కడ స్థానిక ప్రజల అభిప్రాయానికి గౌరవం ఇవ్వడం కనీస మానవ ధర్మం. అక్కడ ఒక ప్రాజెక్టు వచ్చినా దాని ప్రయోజనాల్లో వారికి న్యాయమైన వాటా ఉండాలి.

అందువల్ల ఆగస్టు 9ను ఉత్సవ దినంగా మాత్రమే కాకుండా, భారత అభివృద్ధి నమూనాను పునఃపరిశీలించే దినంగా చూడాలి. దేశం తన ఖనిజ సంపదను వినియోగించుకోవచ్చు. మౌలిక సదుపాయాలు నిర్మించుకోవచ్చు. పారిశ్రామికాభివృద్ధిని కొనసాగించవచ్చు. కానీ దాని కోసం ఒక సమాజం తన భూమిని, అడవిని, సంస్కృతిని, భవిష్యత్తును త్యాగం చేయాల్సిన పరిస్థితి వస్తే అది ప్రజాస్వామ్యానికి విజయచిహ్నం కాదు. నిజమైన అభివృద్ధి అంటే అడవిలోని మనిషిని అడవి నుంచి గెంటివేయటం కాదు. అడవితో అతని బంధాన్ని గౌరవిస్తూ అతనికి విద్య, ఆరోగ్యం, గౌరవప్రదమైన జీవితం, ఆర్థిక అవకాశాలు కల్పించడం. భారత రాజ్యాంగం ప్రసాదించిన ఆదివాసీల హక్కులు రక్షించబడినప్పుడే ప్రకృతి రక్షించబడుతుంది. ప్రకృతి రక్షించబడినప్పుడే అభివృద్ధి కూడా సహజంగా, దీర్ఘకాలికంగా నిలుస్తుంది.



డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్,
ramkishore.1504@gmail.com

# ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ నైతికత

## డబ్బు కోసం నాసిరకం ఉత్పత్తులను ప్రమోట్ చేస్తే బాధ్యత ఎవరిది?

సామాజిక మాధ్యమాలు ఈ రోజుల్లో కేవలం సమాచార మార్పిడికి లేదా వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా ఒక అతిపెద్ద వ్యాపార కేంద్రంగా రూపాంతరం చెందాయి. ఇన్ స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్ బుక్ వంటి వివిధ సామాజిక వేదికల్లో కోట్ల మంది ఫాలోవర్లను సంపాదించుకున్న ఇన్‌ఫ్లుయెన్సర్లు, సినీ ప్రముఖులు తమ ఖాతాల ద్వారా రకరకాల ఉత్పత్తులను ప్రచారం చేస్తున్నారు. అందాన్ని పెంచే క్రీముల నుంచి బరువు తగ్గించే ఔషధాల వరకు ప్రతి వస్తువునూ మార్కెట్ చేస్తున్నారు. పరిశ్రమ వర్గాల అంచనాల ప్రకారం రాబోయే ఏళ్లలో గణనీయమైన స్థాయిలో కొనుగోళ్లు నేరుగా ఈ డిజిటల్ క్రియేటర్ల పేజీల ద్వారానే సాగనున్నాయి. లైవ్ కామర్స్ వ్యాపార పరిమాణం వేల కోట్ల రూపాయలకు చేరుతుందని భావిస్తున్నారు. అయితే ఈ భారీ పురోగతి వెనుక ఒక తీవ్రమైన ఆందోళనకర అంశం కూడా దాగి ఉంది. కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం నాణ్యత లేని, ఆరోగ్యాన్ని దెబ్బతీసే ఉత్పత్తులను సైతం అత్యుత్తమమైనవిగా ప్రచారం చేయడం ఇక్కడ ప్రధాన సమస్యగా మారింది. గతంలో ఇటువంటి ప్రచారాల్లో పాల్గొన్న ప్రముఖులు లేదా ఇన్‌ఫ్లుయెన్సర్లు ఏవైనా పొరపాట్లు జరిగితే "మేము కేవలం మాకు ఇచ్చిన సమాచారాన్ని చదివాం" అని సులభంగా తప్పించుకునేవారు. అయితే వినియోగదారుల పరిరక్షణ చట్టం-2019 అమలులోకి వచ్చాక ఈ పరిస్థితిలో పూర్తి మార్పు వచ్చింది. ఈ చట్టం ప్రముఖుల ఎండార్స్‌మెంట్లను కూడా నేరుగా వాణిజ్య ప్రకటనలుగానే గుర్తిస్తోంది. ప్రజల నిర్ణయాలను ప్రభావితం చేసే ప్రతి ఒక్కరినీ చట్టం ముందు జవాబుదారీగా నిలబెడుతోంది. చట్టంలోని వివిధ నిబంధనల ప్రకారం ఉత్పత్తుల గురించి తప్పుడు వివరణలు ఇవ్వడం, లేని గుణాలను ఉన్నట్లు చూపడం, నాణ్యత లేదా పరి మాణాన్ని తప్పుగా చూపించడం, వినియోగదారులకు తెలపాల్సిన కీలకమైన విషయాలను దాచడం వంటి చర్యలను తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు.




ఈ నిబంధనలను కఠినంగా అమలు చేసేందుకు ఏర్పడిన సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) కి విస్తృత అధికారాలు కల్పించారు. తప్పుదోవ పట్టించే రీతిలో ఉన్న ప్రకటనలను తక్షణమే నిలిపివేయాలని లేదా మార్పులు చేయాలని ఆదేశించే హక్కు ఈ సంస్థకు ఉంది. నిబంధనలు ఉల్లంఘించిన వారికి భారీ స్థాయిలో ఆర్థిక జరిమానాలు విధిస్తారు. తొలిసారి తప్పు చేస్తే రూ.10 లక్షల వరకు, ఆ తర్వాత మళ్లీ అదే పొరపాటు పునరావృతమైతే రూ.50 లక్షల వరకు జరిమానా విధించే అవకాశముంది. అంతేకాకుండా సదరు ప్రచారకర్తలను ఏడాది నుంచి మూడేళ్ల కాలం పాటు ఎలాంటి ప్రకటనల్లోనూ నటించకుండా నిషేధించే అధికారం కూడా ఉంది. అంటే ఒక ఉత్పత్తి విషయంలో లోపం జరిగితే కేవలం తయారు చేసిన కంపెనీ మాత్రమే కాకుండా, దానికి ప్రచారం కల్పించిన ఇన్‌ఫ్లుయెన్సర్ కూడా సమానంగా చట్టపరమైన బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇలాంటి వ్యవహారాల్లో "మాకు సరైన సమాచారం తెలియదు" అనే కారణం చెల్లదని అధికారులు స్పష్టం చేశారు. ప్రచారకర్తలు తాము చేసే దావాల నిజాయితీని స్వయంగా ధృవీకరించుకోవాల్సిన బాధ్యత ఉంది. కేవలం బ్రాండ్ ఇచ్చిన సమాచారంపై ఆధారపడటం సరికాదు. అలాగే పెయిడ్ భాగస్వామ్యాలను రహస్యంగా ఉంచడం కూడా చట్టరీత్యా నేరమే. ప్రకటన ప్రసారమయ్యే సమయంలో స్క్రీన్‌పై లేదా వివరణలో అది రుసుము తీసుకుని చేసిన ప్రచారం అని స్పష్టంగా పేర్కొనాలి. అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఏఎస్ సీఐ) కూడా వినియోగదారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక మార్గదర్శకాలను అమలు చేస్తోంది. గతంలో వెలుగుచూసిన కొన్ని ప్రధాన వివాదాలు ఈ అంశంపై దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీశాయి. ఉత్పత్తి నాణ్యత మరియు భద్రతపై తప్పుడు ప్రచారం చేశారనే ఆరోపణలతో ప్రచారకర్తలను విచారించడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఆ ఘటనల నుంచే నేటి కఠినమైన చట్టాలు ప్రాణం పోసుకున్నాయి. ప్రతిఫలం తీసుకుని పనిచేస్తున్నప్పుడు దాని వల్ల కలిగే పరిణామాలకు కూడా పూర్తి బాధ్యత వహించాలనే సందేశం దీని ద్వారా స్పష్టమైంది. ఉత్పత్తిని తయారుచేసే సంస్థ, దాన్ని ప్రచారం చేసే ఇన్‌ఫ్లుయెన్సర్, కొనుగోలు చేసే వినియోగదారుడు ఈ ముగ్గురి పాత్ర ఇక్కడ అత్యంత ముఖ్యం. తయారీదారులు నాణ్యతను పాటించాలి, ప్రచారకర్తలు వాస్తవాలను సరిచూసుకోవాలి, వినియోగదారులు కూడా కేవలం ఫాలోవర్ల సంఖ్యను చూసి మోసపోకుండా సరైన సమీక్షలు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి. ప్రకటనల వల్ల నష్టపోయిన వినియోగదారులు జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ నంబర్ 1915 ద్వారా లేదా అధికారిక వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉంది. ప్రజల నమ్మకాన్ని సొమ్ము చేసుకోవడం నైతికంగా సరైనది కాదనే సత్యాన్ని ప్రస్తుత చట్టాలు స్పష్టం చేస్తున్నాయి.

డా .సూర్యదేవర రామకృష్ణ
9490754169

## కూర్చోవడం.. ప్రతి ఉద్యోగి హక్కే!

"రండి... కూర్చోండి" అని అతిథులను ఆహ్వానించడం భారతీయ సంస్కృతిలో గౌరవానికి ప్రతీక. కూర్చునే అవకాశం కల్పించడం అనేది కేవలం సౌకర్యం కాదు, ఒక వ్యక్తి పట్ల చూపే మర్యాద. కానీ ఉద్యోగ రంగంలో ఈ గౌరవం చాలా మంది కార్మికులకు దక్కడం లేదు. ముఖ్యంగా దుకాణాలు, షోరూములు, సూపర్ మార్కెట్లు, వస్త్ర దుకాణాలు, కొన్ని పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు పని ఉన్నా లేకపోయినా గంటల తరబడి నిలబడే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కనీసం కొద్దిసేపు కూర్చునే అవకాశం కూడా లేకుండా విధులు నిర్వహించడం వారి శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. బ్రిటిష్ పాలనలో భారతీయులను అధికారుల ఎదుట కూర్చోనివ్వకుండా అవమానించేవారు. ప్రత్యేక అనుమతి పొందిన కొందరికి మాత్రమే ఆ హక్కు ఉండేది. ఆ అవమానకర పరిస్థితులు స్వాతంత్ర్య పోరాటానికి కూడా ప్రేరణగా నిలిచాయి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా ఉద్యోగులను అనవసరంగా నిలబెట్టే సంస్కృతి కొనసాగడం బాధాకరం. రిటైల్ రంగంలో పనిచేసే సేల్స్ సిబ్బంది వినియోగదారులను చిరునవ్వుతో ఆహ్వానించి, వారి సందేహాలకు ఓర్పుతో సమాధానాలు ఇస్తూ సంస్థ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తారు. అయినప్పటికీ వారికి కూర్చునే సౌకర్యం కల్పించకపోవడం, గోడకు ఆనుకుని నిల్చున్నా తప్పుగా చూడడం, నిరంతర నిఘాలో ఉంచడం వంటి పరిస్థితులు వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నాయి. భారతదేశంలో రిటైల్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. లక్షలాది మందికి ఈ రంగం ఉపాధి కల్పిస్తోంది. అయినప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి అవసరమైన కనీస సౌకర్యాలు అన్ని చోట్ల అందుబాటులో లేవు. ప్రపంచంలోని అనేక దేశాలు ఇప్పటికే లిలి"రైట్ టు సిట్" (కూర్చునే హక్కు)లిలిను కార్మిక హక్కుగా గుర్తించి చట్టబద్ధం చేశాయి. కూర్చోవడం సోమరితనం కాదు, అది ఉద్యోగి ఆరోగ్యం, గౌరవాన్ని కాపాడే హక్కు. మన దేశంలో ఈ అంశాన్ని ముందుకు తీసుకువచ్చింది కేరళ మహిళల ఉద్యమం. సేల్స్ ఉద్యోగులుగా పనిచేస్తున్న మహిళలు పనిచేసే చోట కూర్చునే అవకాశం, మరుగుదొడ్ల సౌకర్యం, సురక్షితమైన పని వాతావరణం కల్పించాలని డిమాండ్ చేస్తూ దీర్ఘకాలం పోరాడారు. వారి ఉద్యమ ఫలితంగా కేరళ ప్రభుత్వం 2018లో చట్టాలను సవరించి ఉద్యోగులకు కూర్చునే సౌకర్యం, విశ్రాంతి సమయం, మరుగుదొడ్లు, మహిళల భద్రత వంటి అంశాలను తప్పనిసరి చేసింది. తరువాత తమిళనాడు కూడా ఇదే విధానాన్ని అమలు చేసింది. ఎక్కువసేపు నిలబడి పనిచేయడం వల్ల వెన్నునొప్పి, మోకాళ్ల నొప్పి, పాదాల సమస్యలు, వెరికోస్ వెయిన్స్, కీళ్ల నొప్పులు, గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్య పరిశోధనలు సూచిస్తున్నాయి. మహిళల్లో మూత్ర సంబంధిత ఇన్‌ఫెక్షన్లు, ఇతర ఆరోగ్య సమస్యలు కూడా పెరిగే అవకాశం ఉంది. కాబట్టి ఉద్యోగులకు భద్రమైన, ఆరోగ్యకరమైన పని వాతావరణాన్ని కల్పించడం వారి ప్రాథమిక హక్కు. ప్రతి ఉద్యోగి గౌరవంతో పనిచేసే హక్కును పొందాలి. కూర్చోవడానికి అవకాశం ఇవ్వడం యజమాని దయ కాదు; అది చట్టబద్ధమైన మానవ హక్కు. కేరళ, తమిళనాడు తరహాలో దేశంలోని అన్ని రాష్ట్రాలు కూడా "రైట్ టు సిట్" చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి ప్రతి ఉద్యోగి ఆరోగ్యం, గౌరవం, సంక్షేమాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది.



హరిప్రసాద్ దూపాటి
సామాజిక విశ్లేషకుడు

# ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్సీ ప్రకటించాలి

**శంకర్‌పల్లి, ఆగస్టు 8 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రెండో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ డీఏ బకాయిలను విడుదల చేయాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ - టియుటిఎఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.టియుటిఎఫ్ 15వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఏర్పడిన సంస్థగా టియుటిఎఫ్ పనిచేస్తుందని అన్నారు.ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆయన కోరారు.ఉద్యోగ, ఉపాధ్యాయులు గత 3




సంవత్సరాలుగా రెండో పీఆర్సీ కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్.డి.ఏలు పెండింగ్‌లో ఉన్నాయని, దీనివల్ల ప్రతి ఉద్యోగి నెలకు 15-20 వేల రూపాయలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వానికి అయినా ఇది శ్రేయస్కరం కాదన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి పీఆర్సీ నివేదికను బహిర్గతం చేసి అమలు చేయాలని,పెండింగ్ డీఏలు,పెండింగ్ బిల్లులు అన్నింటినీ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మునీర్ పాషా, జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ, జిల్లా కార్యదర్శి సుదర్శన్, రాష్ట్ర కార్యదర్శి మొగులయ్య, శంకర్‌పల్లి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంజయ్య, శ్రీనివాస్ చారి, టియుటియు కొందర్గు ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి, చేవెళ్ల ప్రధాన కార్యదర్శి శివానందం, ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు వెంకటేశ్వర్ రావు, జగదీశ్వర్, బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సాంప్రదాయాలకు నిదర్శనం బోనాల ఉత్సవాలు

**మునిపల్లి, ఆగస్టు 8 (జనం సాక్షి) :** తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకుల నిదర్శనంగా ఆషాడమాసంలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మునిపల్లి మండలంలోని తాటిపల్లి యునైటెడ్ , బుదేరా ఎస్ వి ఆర్ పాఠశాలలో విద్యార్థులు బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో విద్యార్థులు మన తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బోనాలు తయారు చేసారు. మరి కొందరు విద్యార్థులు పోతురాజు వేశాధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండంట్ తాటిపల్లి మల్లేశం, ప్రధానోపాధ్యాయులు అరుంధతి, విజయ్ కుమార్ మరియు షౌకత్ అలీ వారి ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



## పిల్లల భద్రత, పాఠశాల పరిశుభ్రత కోసమే ప్రత్యేక చర్యలు

**యాలాల, అగస్టు 8 (జనంసాక్షి) :** యాలాల మండలం దేవనూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్, హై స్కూల్, అంగన్‌వాడీ కేంద్రం మరియు గ్రామ లైబ్రరీ భవనాల పైభాగంలో పెరిగిన చెట్లను, పేరుకుపోయిన చెత్తను శనివారం తొలగించారు.గత కొంతకాలంగా భవనాల పైకప్పులపై చెట్లు పెరగడం, ఆకులు, చెత్త పేరుకుపోవడంతో వర్షపు నీరు నిలిచి భవనాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉండేది. దీనిని గుర్తించిన గ్రామ పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు మాట్లాడుతూ పిల్లల భద్రత, పాఠశాలల పరిశుభ్రత కోసం ఈ పనులు చేపట్టాం. భవనాల పైనున్న చెట్లు వేర్లతో కాంక్రీట్‌కు నష్టం కలిగిస్తాయి. అందుకే వెంటనే తొలగించి, పైకప్పుపై ఉన్న మొత్తం చెత్తను కూడా శుభ్రం చేయించాం. ఇకపై కూడా ప్రతి మూడు నెలలకు ఒకసారి తనిఖీ చేసి ఇలాంటి సమస్యలు రాకుండా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు సర్పంచ్ చొరవను అభినందించారు.



# తాండూర్ మాణిక్‌నగర్‌లో పోలీసుల కార్డెన్‌సెర్చ్

- 65 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు 56 మద్యం బాటిళ్లు స్వాధీనం
- నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు
- ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించడమే పోలీసుల ప్రధాన లక్ష్యం
- డీఎస్పీ నర్సింగ్ యాదయ్య

**తాండూరు, అగస్టు 8 (జనంసాక్షి) :** జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు తాండూర్ డీఎస్పీ ఎన్. యాదయ్య ఆధ్వర్యంలో తాండూర్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాణిక్ నగర్ మరియు మున్సిపల్ క్వార్టర్స్ ప్రాంతాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీతో పాటు పట్టణ సిఐ పరమేశ్వర్, కరణ్ కోట్ సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, డివిజన్ పోలీసు సిబ్బంది, ఏఆర్ పార్టీ సిబ్బంది పాల్గొని



అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు మరియు అక్రమ కార్యకలాపాలపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.తనిఖీలలో భాగంగా ఇద్దరు అనుమానిత వ్యక్తులను తనిఖీ చేయడంతో పాటు, పాపిలాన్ పరికరాన్ని ఉపయోగించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 65 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు మరియు 56 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించిన పత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలు మరియు ఇతర రికార్డులను పరిశీలించిన అనంతరం, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నారు.ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు తాండూర్ పట్టణంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించామని తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు మరియు అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. తనిఖీల్లో గుర్తించిన వాహనాల పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.నేరాల నియంత్రణ, అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించడమే పోలీసుల ప్రధాన లక్ష్యం. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై సమాచారం అందించాలని పేర్కొన్నారు.

## విద్యార్థినుల ఆరోగ్య రక్షణే ధ్యేయం

- గురుకుల మహిళ కళాశాల వైద్యాధికారిని భాగ్యలక్ష్మి



**షామీర్‌పేట్, అగస్టు 8 (జనం సాక్షి) :** శామీర్‌పేట్‌లో తెలంగాణ గురుకుల సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాలలో వైద్యాధికారిణి డాక్టర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి చూపు పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఆప్టోమెట్రిస్ట్ శ్రావణి ఈ శిబిరంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వ హించారు.ఈ శిబిరంలో సుమారు 60 మంది విద్యార్థినులు కంటి చూపును పరీక్షించు కున్నారు. పరీక్షల్లో సుమారు 30 మంది విద్యార్థిను లకు కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. అవసర మైన విద్యార్థినులకు కంటి అద్దాలను అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్‌తోపాటు కంప్యూటర్ వినియోగం ఎక్కువగా ఉండే వివిధ గ్రూపుల్లో విద్యార్థినులు విద్యనభ్య సిస్తున్నందున, ఎక్కువ సమయం కంప్యూటర్ స్క్రీన్‌లను విని యోగించడం వల్ల కంటి అలసట, చూపు సంబంధిత సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని ఈ నేపథ్యంలో విద్యార్థినుల కంటి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా ఈ కంటి పరీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారిణి డాక్టర్ డి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. అవసరమైన విద్యార్థినులకు కంటి అద్దాలను అందించనున్నట్లుగా తెలిపారు. విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ భవిష్యత్తు లోనూ ఇలాంటి ఆరోగ్య కార్యక్రమాలను కొన సాగిస్తామని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. వి. స్రవంతి తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థినులు జె. ప్రసన్న, ఏ. సింధుజ, నక్షత్ర, యజ్ఞశ్రీ తదితరులు పాల్గొని కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించారు.

# ఘనంగా మన్సూరాబాద్ కాటమయ్య బోనాలు

**హయత్ నగర్, ఆగస్టు 8 (జనం సాక్షి) :** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ప్రెస్ కాలనీలో గల శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో కాటమయ్య బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మన్సూరాబాద్ గౌడ కులస్తులు భక్తిశ్రద్ధలతో కాటమయ్యకు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మన్సూరాబాద్ చౌరస్తా నుంచి శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయం వరకు బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లారు. డప్పు చప్పుళ్లు, ఆటపాటలతో సాగిన ఈ ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది. అనంతరం కాటమయ్యకు ప్రత్యేకంగా బోనాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాటమయ్య దేవాలయ చైర్మన్ పాతూరి శ్రీధర్ గౌడ్, మాజీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ పాతూరి చంద్రుడు గౌడ్, మాజీ కార్పొరేటర్లు కొప్పుల నరసింహారెడ్డి, చెరుకు సంగీత, ప్రశాంత్ గౌడ్, అలాగే మల్లేష్ గౌడ్, నాగేశ్వర్ రావు గౌడ్, రాజేందర్ గౌడ్, రమేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, జయరాజ్ గౌడ్, వెంకట్ స్వామి గౌడ్, కృష్ణ గౌడ్, అమర్ గౌడ్, నర్సింహా గౌడ్, నరేష్ గౌడ్, జగదీష్



గౌడ్, సాయిదాస్ గౌడ్, రాకేష్ గౌడ్, కిరణ్ గౌడ్, నాగరాజ్ గౌడ్, సునీల్ గౌడ్, త్రిలోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మహిళా సోదరీమణులు, గౌడ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాటమయ్య బోనాల వేడుకలను విజయవంతం చేశారు.

## ఉపసర్పంచ్‌పై దాడి చేసినవారిని వెంటనే అరెస్ట్ చేయాలి

- యాచారం పిఎస్ ఎదుట ఉపసర్పంచుల ఫోరం ధర్నా



**యాచారం, ఆగస్టు 8 (జనం సాక్షి) :** యాచారం మండల పరిధిలోని ధర్మన్నగూడ ఉపసర్పంచ్ గౌర నాగరాజుపై జరిగిన భౌతిక దాడిని తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచుల ఫోరం తీవ్రంగా ఖండించింది. గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాగరాజుపై చెన్నయ్య, శ్రీనివాస్, అనిల్ అనే ముగ్గురు వ్యక్తులు కలిసి అభివృద్ధి పనులను అడ్డుకుంటూ అమానుషంగా దాడికి పాల్పడ్డారని ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడిని నిరసిస్తూ శుక్రవారం యాచారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఉపసర్పంచుల ఫోరం నాయకులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బొట్ల కార్తీక్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులపై వరుసగా దాడులు జరగడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నెల రోజుల క్రితమే తక్కళ్లపల్లి తండా ఉపసర్పంచ్‌పై కూడా దాడి జరిగిందని, ఇలాంటి ఘటనల వల్ల గ్రామీణ స్థాయి ప్రజాప్రతినిధులకు రక్షణ కరువైందని ఆవేదన చెందారు. నాగరాజుపై దాడికి పాల్పడిన నిందితులపై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, వారిని వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. బాధితుడికి తక్షణమే న్యాయం జరగకపోతే రంగారెడ్డి జిల్లా డీసీపీతో పాటు రాష్ట్ర డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తామని కార్తీక్ హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్ట శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు భాస్కర్ నాయక్, గౌరవ అధ్యక్షులు శివ గౌడ్, ఉపాధ్యక్షులు రోహిత్, మచ్చ అనిల్ కుమార్, రాజు, మధుకర్ రెడ్డి మరియు వివిధ మండలాల ఫోరం అధ్యక్షులు, పెద్ద సంఖ్యలో ఉపసర్పంచులు పాల్గొని బాధితునికి సంఘీభావం ప్రకటించారు.

# నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**జడ్చర్ల, అగస్టు 8 (జనంసాక్షి) :** జడ్చర్ల మున్సిపాలిటీలో కొనసాగుతున్న వర్షపు నీటి కాల్వ పనులు, జాతీయ రహదారి పనులు, కల్వర్టు పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న వర్షపు నీటి కాల్వ పనులు, జాతీయ రహదారి పనులు, కల్వర్టు పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, నాణ్యతను ఆయన పరిశీలించి సమీక్షించారు. సంబంధిత మున్సిపల్, ఇంజనీరింగ్ అధికారులు పనులను వేగవంతం చేసి, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని సంబంధిత శాఖల మధ్య సరైన సమన్వయం ఉండేలా చూడాలని, ముఖ్యంగా పనులు జరుగుతున్న సమయంలో సాధారణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేదా సమస్యలు కలగకుండా ఉండేందుకు తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యత, భద్రతా ప్రమాణాలను పాటిస్తూ పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గిరీష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పండుగల వేళ అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

- రౌడీషీటర్లకు మేడిపల్లి పోలీసుల హెచ్చరిక
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం
- సీఐ జలంధర్‌రెడ్డి

**బోడుప్పల్, ఆగస్టు 8 (జనంసాక్షి) :** బోనాలు, గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో మేడిపల్లి పోలీసులు అప్రమత్తమయ్యారు. పండుగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు శనివారం సీఐ జలంధర్‌రెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు.రౌడీషీటర్లు తమ ప్రవర్తనను మార్చుకుని బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని సీఐ సూచించారు. గొడవలు, బెదిరింపులు, అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. పండుగల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బోనాలు, గణేష్ ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో మేడిపల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం

**బాలానగర్, ఆగస్టు 8 (జనం సాక్షి) :** పేద కుటుంబాలకు చెందిన చిన్న పిల్లల గుండెజబ్బుల నివారణ చికిత్స కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు చేసిన పోరాటం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే సామాజిక ఆరోగ్య చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది కేవలం కుల రిజర్వేషన్ల కోసమే కాకుండా మానవతా దృక్పథంతో ఆయన చేసిన ఈ ఉద్యమం ఎందరో పేద చిన్నారుల ప్రాణాలను కాపాడింది. ఈ పోరాటంలో ఆయన పోషించిన కీలక పాత్ర మరియు ప్రస్థానం, ఉద్యమానికి మూలం 2004లో జరిగిన సంఘటన నసీమ అనే బాలిక ఉదాహరణతో 2004 ఖమ్మం జిల్లా మధిరకు చెందిన నసీమా అని ముస్లిం కార్మికుడి కుటుంబానికి తీవ్ర గుండె జబ్బుతో బాధపడుతుంది ఆమె ఆపరేషన్కు 1,40,000 అవసరం కాక అప్పటి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి కేవలం 25 వేలు మంజూరు చేసింది. ప్రభుత్వంతో ఘర్షణ మిగిలిన నిధుల కోసం మందకృష్ణ మాదిగ అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డిని ఆశ్రయించారు, అయితే ఇలాంటి వాటికి నిధులు ఇస్తే మిగతావారు కూడా వస్తారని ప్రభుత్వం పై భారం పడుతుందని సీఎం నిరాకరించారు, దీనిపై స్పందించిన మందకృష్ణ మాదిగ పేద పిల్లల ప్రాణాల కంటే ప్రభుత్వానికి ఏది ఎక్కువ కాదని పోరాటానికి సిద్ధమయ్యారు. చిన్నారుల గుండె జబ్బుల చికిత్స కోసం భారీ ర్యాలీలు అరెస్టులు హైదరాబాదులో నిరసన మొదలై,పేద కుటుంబాల హృద్రోగ బాధిత పిల్లలను వారి తల్లిదండ్రులను ఏకం చేసి మందకృష్ణ మాదిగ 2004 ఆగస్టులో హైదరాబాదులో ఒక భారీ చారిత్రాత్మక ర్యాలీ నిర్వహించారు పోరాట తీవ్రత చిన్నారుల ప్రాణాలు కాపాడాలంటూ సచివాలయం ముట్టడికి ప్రయత్నించారు ఈ సమయంలో ఉద్రిక్త చోటు చేసుకుంది ఈ నిరసన కారణంగా అప్పట్లో మందకృష్ణ మాదిగను పోలీసులు అరెస్ట్ కూడా చేశారు ఈ ఆందోళన సమయంలో సరైన వైద్యం అందక కొందరు పిల్లలు మరణించడం తీవ్ర సంచలనం సృష్టించింది సాధించిన విజయాలు ప్రభుత్వం దిగొచ్చుడు మందకృష్ణ మాదిగ చేసిన నిరంతర వృత్తిడి ఆందోళన పోరాట ఫలితంగా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దిగివచ్చి కీలక నిర్ణయం తీసుకుంది ఉచిత స్క్రీనింగ్ క్యాంపులు 2004 ఆగస్టులోనే రాష్ట్రవ్యాప్తంగా 24 ఉచిత గుండెజబ్బుల నిర్ధారణ క్యాంపులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది వీటి ద్వారా సుమారు 5500 మందికి పైగా చిన్నారులకు గుండె జబ్బులు ఉన్నట్లు గుర్తించారు ఉచిత గుండే ఆపరేషన్లు కార్పోరేట్ ఆసుపత్రుల సహకారంతో వేలాదిమంది పేద పిల్లలకు ఉచితంగా గుండాపరేషన్లు చేసేలా ప్రభుత్వాన్ని ఒప్పించారు ఇదే రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి పునాది మందకృష్ణ మాదిగ




చిన్నారుల గుండెజబ్బుల కోసం చేసిన ఈ సుదీర్ఘ పోరాటమే తదనంతర కాలంలో వైయస్సార్ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ప్రవేశపెట్టిన విప్లవాత్మక రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉచిత వైద్య సేవల పథకం కు ప్రధాన పునాదిగా నిలిచింది. ఇదే పథకం స్ఫూర్తితో తర్వాత కాలంలో దేశవ్యాప్తంగా ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని తీసుకువచ్చింది. మందకృష్ణ మాదిగ కేవలం దళిత ఉద్యమ నేత గానే కాకుండా వికలాంగుల హక్కులు వృద్ధులు వితంతువుల పింఛన్ల పెంపు మరియు పేద పిల్లల ఉచిత గుండె వైద్యం కోసం పోరాడిన గొప్ప సామాజిక సంస్కర్త ఆయన చేసిన ఈ నిరంతర ప్రజాసేవను గుర్తిస్తూ భారత ప్రభుత్వం 2025లో ఆయనకు ప్రతిష్టాత్మక పద్మశ్రీ అవార్డు ప్రకటించి గౌరవించింది.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
09 ఆగస్టు 2026

# వనపర్తి అభివృద్ధికి ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రతిపాదనలు

- బీసీ విద్యాసంస్థలు, జిల్లా రవాణా కార్యాలయ భవనాలకు ప్రతిపాదనలు
- పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించడమే లక్ష్యం
- నీటిపారుదల అధికారులతో సమీక్ష



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 8 (జనంసాక్షి) :** వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సమర్పించారు. వనపర్తి నియోజకవర్గంలో మెరుగైన రవాణా సేవలు అందించడంతో పాటు బీసీ విద్యార్థులకు మెరుగైన విద్యా, వసతి సౌకర్యాలు కల్పించేందుకు పలు నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు అందించారు. శాస్త్రీయ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌తో కూడిన జిల్లా రవాణా కార్యాలయ నూతన భవనం, చిట్యాలలో ఎంజేపీ తెలంగాణ బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల (బాలుర) భవనం, కడుకుంట్లలో బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల (బాలుర) భవనం, పెబ్బేరులో బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల (బాలికల) భవనం, వెల్టూరులో బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల (బాలికల) నూతన భవనాలకు సంబంధించిన ప్రతిపాదనలు ఇందులో ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్య, ప్రస్తుతం ఉన్న వసతులు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన భవనాలను మంజూరు చేయాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించి, ప్రతిపాదనలను పరిశీలించి శాఖాపరమైన ప్రక్రియను పూర్తి చేసి త్వరలో మంజూరీలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి సానుకూలంగా స్పందించిన మంత్రికి మేఘారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

**పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించడమే లక్ష్యం**

మరోవైపు వనపర్తి నియోజకవర్గంలోని సాగునీటి సమస్యలు, పెండింగ్ పనులు, కొత్తగా చేపట్టాల్సిన పనులపై ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నీటిపారుదల శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చాంబర్‌లో ఈ సమావేశం జరిగింది. అనివార్య కారణాల వల్ల మంత్రి సమావేశానికి హాజరు కాలేకపోయిన నేపథ్యంలో ఎమ్మెల్యే నీటిపారుదల శాఖ అధికారులతో నియోజకవర్గానికి సంబంధించిన వివిధ అంశాలపై సవివరంగా చర్చించారు. వనపర్తి నియోజకవర్గ పరిధిలోని పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించేలా అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, వారం రోజుల్లో సమగ్ర నివేదికలు అందించాలని అధికారులకు సూచించారు. నివేదికలు అందిన వెంటనే వాటిని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, రైతులకు ప్రయోజనం కలిగేలా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపడతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమీక్ష సమావేశంలో నీటిపారుదల శాఖ సీఈ రహీమ్‌ద్దీన్, ఎస్ఈ చంద్రశేఖర్, డీసీ వెంకట్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## క్రీడలలో క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి

- మల్టీ జోన్ 1 ఐజి చంద్రశేఖర్ రెడ్డి




**తూప్రాన్, ఆగస్టు 8 (జనం సాక్షి) :** క్రీడలలో విద్యార్థులు రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించాలని మల్టీ జోన్ 1 ఐజి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. తూప్రాన్‌లోని ఒలింపియా స్కూల్‌లో నిర్వహించిన ఖో-ఖో క్రీడా ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడి, క్రీడల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ఐజీ టోల్ ప్లాజా వద్ద ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను పరిశీలించారు. హైవేపై ట్రాఫిక్ నియంత్రణ, కీలక ప్రాంతాల పర్యవేక్షణ, సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా తదితర అంశాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు, ఐపీఎస్, మెదక్ అడిషనల్ ఎస్పీ విక్రాంత్ కుమార్, ఐపీఎస్, తూప్రాన్ డీఎస్పీ నరేంద్ర గౌడ్, తూప్రాన్ సీఐ మరియు తూప్రాన్ ఎస్ఐ గంగరాజు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి



**తూప్రాన్, ఆగస్టు 8 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌ను మల్టీ జోన్-ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి సందర్శించి పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, రిజిస్టర్లు మరియు స్టేషన్ నిర్వహణను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బందితో ఐజీపీ మాట్లాడి, పోలీస్ స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, కార్యాలయ నిర్వహణ మరియు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించే విధంగా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదేవిధంగా నూతన మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక చర్యలు మరియు చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించి, అవసరమైన సూచనలు మరియు ఆదేశాలను జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు, ఐపీఎస్, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్, డీఎస్పీ తూప్రాన్ నరేందర్ గౌడ్ మరియు సీఐ తూప్రాన్ వెంకటరాజగౌడ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం

- రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి అద్దాల పంపిణీ




**వెల్దుర్తి, ఆగస్టు 8 (జనం సాక్షి) :** మండల కేంద్రమైన వెల్దుర్తిలో శ్రీ బాలాజీ ఫంక్షన్ హాల్‌లో శనివారం రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి హాజరై కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమన్న గారి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో మూడుసార్లు ఎమ్మెల్యేలుగా పనిచేసిన నాయకులు వారి స్వార్థం కొరకు మాత్రమే పనులు చేసుకున్నారు కానీ పేద ప్రజలకు అవసరమైన పనులు ఏమాత్రం చేయలేరన్నారు. అలాగే నియోజకవర్గంలో ఉన్న గర్భిణీలకు బాలింతలకు ఉచిత ప్రోటీన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 6000 మంది కంటిచూపు సమస్యతో బాధపడుతున్న వారికి కంటి అద్దాలను పంపిణీ చేయడమే కాకుండా సుమారు 1000 మందికి కంటి శస్త్ర చికిత్స చేయించిన అన్నారు. ఈ కార్యక్రమంలో తలారి మల్లేశం సుధాకర్ గౌడ్ హౌస్ల మల్లేశం తో పటు ఆయా గ్రామాల సర్పంచులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాకతీయ పాఠశాలలో బోనాల పండుగ



**జహీరాబాద్, ఆగస్టు 8 (జనం సాక్షి) :** పట్టణంలోని కాకతీయ పాఠశాలలో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు విద్యార్థులతో కలిసి నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తాటిపల్లి మల్లేశం, డైరెక్టర్ శివశంకర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## వనపర్తిలో రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 8 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర 72వ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ శనివారం వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఘనంగా ప్రారంభమైంది. జిల్లా అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు బి. శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి వి.వి. రమణ, వనపర్తి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. మన్మోహన్‌రావు, కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే బాల్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులను అభినందించారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని, తద్వారా విద్యతో పాటు ఇతర కార్యక్రమాలపై ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర జట్టు తరఫున జాతీయ స్థాయిలో పాల్గొని రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి వి.వి. రమణ, జిల్లా అధ్యక్షుడు మన్మోహన్‌రావు, కార్యదర్శి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ఉమ్మడి జిల్లాల నుంచి జట్లు టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయని తెలిపారు. క్రీడాకారులు, ఎంపైర్లు, సెలక్షన్ కమిటీ సభ్యులు కలిపి సుమారు 250 మంది ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు వెల్లడించారు.

**తొలి రోజు ఫలితాలు**

టోర్నమెంట్‌లో భాగంగా జరిగిన పురుషుల విభాగంలో నిజామాబాద్ జిల్లా జట్టు 35-29, 35-14 తేడాతో కరీంనగర్ ఉమ్మడి జిల్లా జట్టుపై విజయం సాధించింది. రంగారెడ్డి జిల్లా జట్టు 35-22, 35-14 తేడాతో ఖమ్మం జిల్లా జట్టును ఓడించింది. వరంగల్ జిల్లా జట్టు 35--23, 35--10 తేడాతో మహబూబ్‌నగర్ జిల్లా జట్టుపై గెలుపొందింది. మహిళల విభాగంలో మెదక్, హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, నల్గొండ జట్లు తొలి రౌండ్లలో ముందంజలో నిలిచాయి. పురుషుల విభాగంలో రంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, నల్గొండ జట్లు సెమీఫైనల్ దశకు చేరుకోగా, మహిళల విభాగంలో వరంగల్, ఖమ్మం, నల్గొండ, హైదరాబాద్ జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధించాయి. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

## అకాడమిక్-ఇండస్ట్రీ అనుసంధానంతోనే 'వికసిత భారత్ 2047

- పరిశ్రమల అవసరాలకు తగినట్లు విద్యార్థులను తీర్చిదిద్దాలి
- పాలమూరు వర్సిటీలో 'విజన్ ఇండియా ప్యానెల్ చర్చ



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 8 (జనం సాక్షి) :** విద్య, పరిశోధన, పరిశ్రమ, సాంకేతికత మరియు యువశక్తిని సరైన రీతిలో సమన్వయం చేయడం ద్వారా మాత్రమే 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దగలమని పలువురు ప్రముఖ నిపుణులు స్పష్టం చేశారు. పాలమూరు యూనివర్సిటీ ఆధ్వర్యంలో కన్హా శాంతివనంలో నిర్వహిస్తున్న "విజన్ ఇండియా ఏ2047" జాతీయ సదస్సులో భాగంగా యూనివర్సిటీ లైబ్రరీ ఆడిటోరియంలో "అకాడమిక్ అండ్ ఇండస్ట్రీ అనుసంధానం"పై ప్రత్యేక ప్యానెల్ చర్చ జరిగింది. ప్రొఫెసర్ పాట్రిక్ మోడరేషన్ లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్.ఐ.ఎన్ సైంటిస్ట్ డా. ఎన్. రాజేందర్, ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ డీన్ డా. జోషి, బిట్స్ పిలానీ ప్రొఫెసర్ సాయి ప్రసాద్, కోడ్ తంత్ర సీఈఓ టి.ఎస్.వి. రమణలు పాల్గొని విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, పరిశోధనలు సమాజానికి ఉపయోగపడే విధానం మరియు విద్యాసంస్థలు - పరిశ్రమల మధ్య ఉండాల్సిన బలమైన భాగస్వామ్యంపై తమ విశ్లేషణను పంచుకున్నారు. ఈ చర్చలో విశ్వవిద్యాలయాలు తమ కరిక్యులమ్‌ను పరిశ్రమల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని నిపుణులు సూచించారు. విద్యార్థులను కేవలం ఉద్యోగార్థులుగానే కాకుండా ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ ప్రాజెక్టులు, క్రిటికల్ థింకింగ్ మరియు డిజిటల్ స్కిల్స్ ద్వారా స్టార్టప్‌లు నెలకొల్పే 'ఉద్యోగ సృష్టికర్తలుగా' తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పూస రమేష్ బాబు మాట్లాడుతూ.. వర్సిటీలు కేవలం విద్యను అందించే కేంద్రాలుగా కాకుండా ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి మరియు పరిశ్రమల భాగస్వామ్య కేంద్రాలుగా ఎదగాలని, ఆ దిశగా పాలమూరు యూనివర్సిటీ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. విజ్ఞానాత్మకంగా సాగిన ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు మరియు పరిశ్రమల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా అవసరాలను తీర్చడం అభినందనీయం

- సీసీ రోడ్డు ప్రారంభోత్సవంలో కాట దంపతులు



**అమీన్పూర్, ఆగస్టు 8 (జనం సాక్షి) :** ప్రజల అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించడం అభినందనీయమని పటాన్చెరువు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాటా సుధా పేర్కొన్నారు. శనివారం బీరంగూడ డివిజన్ పరిధిలోని ఎస్.ఎల్.ఎన్. హోమ్స్ నుంచి నల్లూరి హైట్స్ అపార్ట్మెంట్స్ వరకు మాజీ కౌన్సిలర్ లావణ్య శశిధర్ రెడ్డి సొంత నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాట దంపతులు మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు వ్యక్తిగతంగా ముందుకొచ్చి సీసీ రోడ్డు నిర్మించడం అభినందనీయమన్నారు. రహదారి నిర్మాణంతో స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగనున్నాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యురాలు లావణ్య కాలనీవాసులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నకిలీ ఎరువులు విక్రయిస్తే లైసెన్స్ రద్దు



**మహమ్మదాబాద్, ఆగస్టు 8 (జనంసాక్షి) :** మండలంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి శనివారం తనిఖీ చేశారు. డీఏపీ,యూరియాతో పాటు ఇతర ఎరువుల నిల్వలను పూర్తిగా పరిశీలించారు. ఎరువుల బస్తాలపై బ్యాచ్ నంబర్,తయారీ వివరాలు,డిస్ట్రిబ్యూటర్ల నుంచి వచ్చిన ఇన్వాయిస్‌లను స్టాక్ రిజిస్టర్‌తో సరిపోల్చి చూశారు. నకిలీ డీఏపీ లేదా అనధికార ఎరువుల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నకిలీ లేదా అనధికార ఎరువుల విక్రయం చేసినట్లు తేలితే లైసెన్స్ రద్దు చేయడంతోపాటు స్టాక్ సీజ్ చేసి,ఎసెన్షియల్ కమోడిటీస్ చట్టం-1955 కింద క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఎరువు విక్రయానికి తప్పనిసరిగా పోస్ మిషన్ ద్వారా బిల్లు ఇవ్వాలని సూచించారు. ఇన్వాయిస్ లేని స్టాక్‌ను దుకాణాల్లో నిల్వ చేయరాదన్నారు. డిస్ట్రిబ్యూటర్ ఇన్వాయిస్,స్టాక్ రిజిస్టర్,అమ్మకాల రిజిస్టర్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి ఉంచాలని డీలర్లకు సూచించారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు ఎరువులు విక్రయించరాదని,రైతులకు తప్పనిసరిగా రసీదు అందజేయాలని ఆదేశించారు. అనుమానాస్పద ఎరువులు కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో బిల్లు,బ్యాచ్ నంబర్,కంపెనీ పేరు తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. ఎరువుల విక్రయ నిబంధనలను పాటించాలని పేర్కొంటూ మండలంలోని అన్ని ఎరువుల దుకాణాల డీలర్లకు అధికారులు నోటీసులు జారీ చేశారు.

# నీళ్లపై నిరంజన్‌రెడ్డి ఆరోపణలు అవాస్తవం

- ఎమ్మెల్యే మేఘారెడ్డి



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 8 (జనంసాక్షి) :** రైతులకు సాగునీరు అందించడం లేదని, కృష్ణా నదిలో వరదలు ఉన్నప్పటికీ ప్రభుత్వం నీటిని వినియోగించుకోవడం లేదంటూ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చేసిన ఆరోపణలు వాస్తవ విరుద్ధమని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. నీటిపారుదల వ్యవస్థలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న విషయాలను తెలుసుకోకుండా రాజకీయ విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎంజీకేఎల్ఐ లిఫ్ట్-1 ద్వారా ఆగస్టు 1, 2026 నుంచే నీటి ఎత్తిపోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు శ్రీశైలం నుంచి 2.7 టీఎంసీల నీటిని ఎత్తిపోశామని తెలిపారు. ఎల్లూరు రిజర్వాయర్ మొత్తం సామర్థ్యం 0.355 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.34 టీఎంసీల నీరు ఉందన్నారు. సింగోటం రిజర్వాయర్ సామర్థ్యం 0.55 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.40 టీఎంసీల నీరు ఉన్నట్లు వివరించారు. లిఫ్ట్-2 కూడా ఆగస్టు 1 నుంచే పనిచేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. జొన్నలబొగడ రిజర్వాయర్ మొత్తం సామర్థ్యం 2.14 టీఎంసీలు కాగా, ఆగస్టు 7 నాటికి నీటి మట్టం 404.80 మీటర్లుగా, నిల్వ 1.753 టీఎంసీలుగా ఉందన్నారు. మూడు పంపుల ద్వారా 2,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 2,100 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతోందని చెప్పారు. ఆగస్టు 8న కల్వకుర్తి ఎడమ కాలువలోని 29వ ప్యాకేజీ ద్వారా 2,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీంతో మోటర్లు పనిచేస్తున్నాయని, రిజర్వాయర్లలోకి నీటిని ఎత్తిపోస్తున్నామని స్పష్టం చేశారు. అదేవిధంగా లిఫ్ట్-3ను ఆగస్టు 6 నుంచే ప్రారంభించినట్లు తెలిపారు. గుడిపల్లిగట్టు రిజర్వాయర్ మొత్తం సామర్థ్యం 0.62 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.42 టీఎంసీల నీరు ఉందన్నారు. ఆగస్టు 7న అన్ని కాలువలకు సాగునీటిని విడుదల చేసినట్లు, ఆగస్టు 8 ఉదయం గుడిపల్లి రిజర్వాయర్ వద్ద గేట్లు ఎత్తి కాలువలకు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ వివరాలన్నీ అందుబాటులో ఉన్నప్పటికీ మోటర్లు ఆన్ చేయలేదని, రైతులకు నీరు ఇవ్వడం లేదని ఆరోపించడం సరికాదని మేఘారెడ్డి అన్నారు. రాజకీయంగా మాట్లాడే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సమయంలో సాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. పంపులు ప్రారంభించిన తేదీలు, ఎత్తిపోసిన నీటి పరిమాణం, రిజర్వాయర్లలోని నీటి నిల్వలు, కాలువలకు నీటి విడుదల తేదీలకు సంబంధించిన వివరాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడిస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు అన్ని విధాలా అండగా నిలిచేందుకు ప్రభుత్వం పనిచేస్తోందని మేఘారెడ్డి తెలిపారు. రైతులు సాగు చేసిన పంటలకు నీటి కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జాతీయ ప్రాజెక్టు నుంచి నీటిని వినియోగించుకోవాలంటే సంబంధిత అనుమతులు అవసరమనే విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా రైతుల ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని మేఘారెడ్డి పేర్కొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
09 ఆగస్టు 2026

# నిరంజన్ రెడ్డి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

- ఆగస్టు 01 నుంచే మోటర్లు నడుస్తున్నాయి
- ఆగస్టు 07న కాలువలకు సాగునీళ్లు విడుదలయ్యాయి
- రైతులను తప్పుదోవ పట్టిస్తున్న నిరంజన్ రెడ్డి
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుల్తాన్ అలీ



**రేవల్లి, ఆగస్టు 8 (జనంసాక్షి) :** రైతులకు నీళ్లు ఇవ్వడం లేదని, కృష్ణాలో వరదలు వస్తున్నా ప్రభుత్వం నీటిని వినియోగించుకోవడం లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని రేవల్లి మండలంలోని బండరాయిపాకుల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుల్తాన్ అలీ ఆరోపించారు. 05 సంవత్సరాలు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షునిగా, మరో 05 సంవత్సరాలు వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసిన నీళ్ల నిరంజన్ రెడ్డి నీటి పారుదల వ్యవస్థలో క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకోకుండానే రాజకీయ ప్రెస్‌మీట్ పెట్టి ఇష్టానుసారంగా మాట్లాడడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. ఆగస్టు 01 తేదీ నుంచి నుంచే లిఫ్ట్-1 ప్రారంభమయ్యాయి. మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ లిఫ్ట్-1 పంపుల ద్వారా 01-08-2026 నుంచే నీటి ఎత్తిపోతలు ప్రారంభమైతే ఇప్పటి వరకు శ్రీశైలం నుంచి 2.7 టీఎంసీల నీటిని ఎత్తిపోసామని అన్నారు. ఎల్లూరు రిజర్వాయర్ మొత్తం సామర్థ్యం ప్రస్తుతం 0.34 టీఎంసీల నీరు ఉంది.
సింగోటం రిజర్వాయర్ సామర్థ్యం 0.40 టీఎంసీల నీరు ఉంది. ఈ లెక్కల ప్రకారం చూస్తే మోటర్లు ఆన్ చేయలేదని ఆధారాలు లేకుండా మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఉమ్మడి గోపాలపేట మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు ఎక్కే వెంకటేష్ మాట్లాడుతూ గుడిపల్లి గట్టు రిజర్వాయర్ లో ప్రస్తుతం 0.42 టీఎంసీల నీరు ఉండడంతో శనివారం అన్ని కాలువలకు సాగునీటిని విడుదల చేశారు. 08-08-2026 ఉదయం గుడిపల్లి రిజర్వాయర్ వద్ద గేట్లు ఎత్తి సాగునీటిని కాలువలకు విడుదల చేశామని అన్నారు. మాజీ మంత్రి పేరుకు నీళ్ల నిరంజన్ రెడ్డి అని పేరు పెట్టుకున్నారు తప్ప వాస్తవానికి ఆ పేరుకు తగు న్యాయం చేయలేదని విమర్శించారు. రైతుల పట్ల అవగాహన రైతుల కోసం శ్రమించే నాయకుడు మేఘారెడ్డికి ఆ పేరు సరియైన పేరు అని అన్నారు. గుడిపల్లి రిజర్వాయర్లో 90% పనులు కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి చేసిందని మిగతా పది శాతం పనులు పూర్తి చేసి నీళ్ల నిరంజన్ రెడ్డి అని పేరు పెట్టుకున్నారని విమర్శించారు.ఇకనైనా ప్రెస్ మీట్ పెట్టేముందు అధికారులతో వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గోపాల్ పేట మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కే వెంకటేష్, రేవల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుల్తాన్ అలీ, మార్కెటింగ్ డైరెక్టర్లు సిరి మల్లేష్, తిరుపతయ్య, నారాయణరెడ్డి, బండరాయపాకుల సర్పంచ్ ధూపం రాజు, ఉప సర్పంచ్ సుకుమార్ రెడ్డి, రేవల్లి సర్పంచ్ రాజయ్య, పాత తాండ సర్పంచ్ శ్రీను నాయక్, కొంకలపల్లి సర్పంచ్ రేణుక బాలనాగయ్య, మిద్దె స్వామి, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## వరద ముప్పునకు శాశ్వత పరిష్కారం చూపాలి

- ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి



**ఎల్‌బీనగర్, ఆగస్టు 8 (జనంసాక్షి) :** ఎస్ఎన్‌డీపీ పనుల్లో భాగంగా సాగర్ రింగ్‌రోడ్డు వద్ద చేపడుతున్న స్ట్రామ్‌వాటర్ లైన్ల నిర్మాణ పనులను ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల కారణంగా చేపట్టిన ట్రాఫిక్ మళ్లింపులతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సాగర్ రింగ్‌రోడ్డు వద్ద నిర్మిస్తున్న స్ట్రామ్‌వాటర్ లైన్లను బైరామల్‌గూడ చెరువు వద్ద ఇప్పటికే నిర్మించిన స్ట్రామ్‌వాటర్ డ్రెయిన్‌కు అనుసంధానం చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ పనులు పూర్తయితే వర్షాకాలంలో వరద నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న పలు కాలనీలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో భారీ వర్షాలు కురిసినా వరద నీరు సులభంగా తరలిపోయేలా పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ రోహిణి, ఈఈ మాధవిలత, నాయకులు గండికోట శ్రీనాథ్, రవి ముదిరాజ్, చంద్రశేఖర్‌రెడ్డి, ముద్ద కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కృషి వల్లే సాగుకు నీళ్లు




**పెబ్బేరు, ఆగస్టు 8 (జనం సాక్షి) :** పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు దిలీప్ రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. టిఆర్ఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, నాయకులు వాకిటి శ్రీధర్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయాన్ని పండగ చేసి చూపిస్తాం అని తప్పుడు వాగ్దానాలు చేసి అధికారంలో వచ్చిన వీళ్ళకు కనీసం వ్యవసాయం పైన మినిమం అవగాహన కూడా లేదు. ఎలినో పోయి వర్షాలు పడి వాటర్ వస్తే ఎట్లా ఉపయోగించుకోవాలి అనే సోయి కూడా లేదు ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అనుక్షణం ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూనే ఉన్నారు. నీళ్ల మీద, రైతుల మీద, వ్యవసాయం మీద బాధ్యత, మమకారం, సోయి లేని సన్నాసులు ఈ కాంగ్రెసోళ్ళు తాగునీటి కోసమే ఎల్లూరు, గుడిపల్లి, జొన్నలబొగుడ రిజర్వాయర్లు నింపేందుకు ప్రయత్నించారు. కానీ రైతులకు సాగునీరు ఇవ్వడానికి కాదు. ఇప్పటికి కూడా ఎక్కడా రైతులకు సాగునీరు విడుదల చేయడం లేదు. గుడిపల్లిలో ఈ క్షణం వరకు నీళ్లు విడుదల చేయలేదు. బీఆర్ఎస్ హెచ్చరికలతో కాంగ్రెస్ నేతలు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రెస్వామి, శంకర్ నాయుడు మన్యం సాయినాథ్ రాజశేఖర్ సహదేవ్ వడ్డె రమేష్ సాయిరెడ్డి వడ్డె శీను మహేష్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి గొంతు కొరికిన వీధికుక్క

- అయినా అధికారుల్లో చలనం లేదు
- కుక్కల బెడదతో పట్టణ ప్రజల బెంబేలు



**చింతపల్లి, ఆగస్టు 8 (జనం సాక్షి) :** చింతపల్లి మండలంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా మగ్దూం బాబా నగర్‌లో ఓ చిన్నారిపై వీధికుక్క దాడి చేసి గొంతు భాగంలో కరవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనతో స్థానికుల్లో భయాందోళన నెలకొంది. పట్టణంలోని శాలిబండ, పటాన్‌వాడి, ఇస్లాంపుర, సంతోష్‌మాత కాలనీ, సంజయ్ కాలనీతో పాటు పలు నివాస ప్రాంతాలు, ప్రధాన రహదారుల్లో వీధికుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ముఖ్యంగా ఉదయం, రాత్రి వేళల్లో రోడ్లపై వెళ్లే చిన్నారులు, మహిళలు, వృద్ధులు కుక్కల దాడి భయంతో ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులను కుక్కలు వెంబడిస్తుండటంతో ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొంది. తాజాగా చిన్నారిపై జరిగిన దాడి ఘటన కలకలం రేపినా అధికారుల్లో మాత్రం కదలిక కనిపించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుక్కల సంఖ్య విపరీతంగా పెరుగుతున్నా వాటి నియంత్రణకు తగిన చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికే పలువురు కుక్కల దాడులకు గురైనప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై అధికారులను ప్రశ్నిస్తున్నారు. కుక్క కాటుకు ఇంకెంతమంది బలికావాలి? చిన్నారులు, వృద్ధులు తీవ్రంగా గాయపడిన తర్వాతే అధికారులు స్పందిస్తారా అని ప్రజలు నిలదీస్తున్నారు. పట్టణంలో వీధికుక్కల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టి, ప్రజలకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి కుక్కల బెడదను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## కంటైనర్ లో అంగన్వాడి సేవలు ప్రారంభం

- ఫారెస్ట్ అనుమతులు లేకపోవడంతో స్పందించిన దాతలు



**ములకలపల్లి, జూలై 9 (జనం సాక్షి) :** మండలంలోని ధర్మన్న నగర్ ఆదివాసీ గోత్తికోయ గుంపు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నప్పటికీ, వీరు వలస ఆదివాసీలు కావడంతో, నివాసం ఏర్పరచుకుంది అటవీ ప్రాంతం కావడంతో, ఫారెస్ట్ అనుమతులు లభించగా ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. దీంతో డైనట స్వచ్ఛంద సంస్థ స్పందించి సి ఎస్ ఆర్ గ్రాంట్స్ 2026-27 నిధులతో కంటైనర్ ఏర్పాటు చేసి దానిలో అంగన్వాడి స్కూల్ ను డిజైన్ చేసి, దానికి అవసరమైన సామాగ్రి ని గ్రామానికి అందించడం జరిగింది. దీంతో ధర్మన్న నగర్ లో ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత పూర్వ ప్రాథమిక విద్య కోసం, గర్భిణీలు, బాలింతలు సంరక్షణ కోసం ఒక స్థిర నివాసం ఏర్పడినట్లు అయ్యింది. ధర్మన్న నగర్ గ్రామంలో శనివారం నాడు స్థానిక సర్పంచ్ కుంజా రవి ఆధ్వర్యంలో కార్యక్రమం లో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, చైల్డ్ రైట్ ప్రొటెక్షన్ కమిషన్ మెంబర్ కంచర్ల వందన గౌడ్, ఈ కంటైనర్ ను లాంఛనం గా ప్రారంభించారు.

## సమగ్ర సాగునీటి ప్రణాళికను ప్రకటించాలి



**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 8 (జనం సాక్షి) :** ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సాగునీటి లభ్యత, వినియోగం, నీటి విడుదలపై రైతులకు ప్రభుత్వం స్పష్టమైన అవగాహన కల్పించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో పంటల సాగుకు అవసరమైన నీటి లభ్యతపై స్పష్టత ఇవ్వడంతో పాటు, రైతులు ముందస్తుగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకునేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని మాజీ మంత్రి పువ్వాడ పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్షపాతంలో హెచ్చుతగ్గుల నేపథ్యంలో అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. సాగర్, గోదావరి, మున్నేరు, వైరా, పాలేరు, కిన్నెరసాని తదితర జల వనరుల్లో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు అంచనా వేసి, ఆయకట్టు రైతులకు ముందస్తుగా సమాచారం అందించాలని కోరారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడితే రైతులు నష్టపోకుండా పంటల సాగును ప్రణాళికాబద్ధంగా కొనసాగించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

# అంగన్‌వాడీ టీచర్ల నియామకాలకు కొనసాగుతున్న ప్రక్షాళన

- క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న పర్యవేక్షకులు
- 7 అంగన్‌వాడీ టీచర్లకు గాను 206 దరఖాస్తులు

**న్యాల్‌కల్, ఆగస్టు 8 (జనం సాక్షి) :** మండలంలో గత కొంతకాలంగా ఖాళీగా ఉన్న అంగన్వాడి టీచర్లు, ఆయాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం దృష్టి సాధించిన విషయం తెలిసిందే. ఈ మేరకు జూన్ 7నుండి17వరకు దరఖాస్తులను స్వీకరించింది. స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ఈ మేరకు జహీరాబాద్ ఇన్చార్జి సీడీపీఓ పర్యవేక్షణలో.. న్యాల్ కల్ మండలానికి చెందిన పర్యవేక్షకులు.. అభ్యర్థులు అందజేసిన దరఖాస్తులను అభ్యర్థుల స్వగ్రామానికి వెళ్లి నేరుగా క్షేత్రస్థాయిలో పరిశీలన, ప్రక్షాళన కార్యక్రమం చురుగ్గా కొనసాగుతుంది. గత వారం రోజులుగా న్యాల్ కల్, హద్నూర్, గంగువార్ అంగన్వాడి క్లస్టర్ పర్యవేక్షకులు దరఖాస్తుల ప్రక్షాళన చేపడుతున్నారు.



### 7గురు టీచర్లకు గాను 206 దరఖాస్తులు

మండలంలో ముగ్గురు అంగన్వాడీ కార్యకర్తలు మృతి చెందగా, మరో ముగ్గురు పదవి విరమణ పొందారు, స్వచ్ఛందంగా ఒకరు వదులు కోవడంతో.. మండలంలో గత కొంతకాలంగా 7 అంగన్వాడి కేంద్రాల్లో టీచర్లు లేకపోవడంతో.. ఇన్చార్జి అంగన్వాడి టీచర్లతో నెట్టుకొచ్చారు. ఎట్టకేలకు ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో.. మండలంలోని 7 అంగన్వాడి కేంద్రాల టీచర్ల నియమాలకు గాను ఏకంగా 206 దరఖాస్తులు వచ్చాయి. రేజింతల్ అత్యధికంగా 64 దరఖాస్తులు రాగా, కల్ బేమల్ 22, ఇబ్రహీంపూర్ 22, ముంగి 33, చాల్కి18, చీకూర్తి 22, న్యామతాబాద్ 27 మేరకు దరఖాస్తులను స్వీకరించడం జరిగింది. ముంగి తాండ కేంద్రానికి ఆయా పోస్ట్ కు గాను ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారు. మండలంలోని 63 కేంద్రాలకు గాను 7 అంగన్వాడి కేంద్రాల్లో తాజాగా టీచర్ల నియమకాల కోసం మండలం పర్యవేక్షకులు గతవారం రోజులుగా నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి దరఖాస్తులను పరిశీలించి, ప్రక్షాళన చేపడుతున్నారు.

### ఎంపిక జిల్లా కమిటీదే తుది నిర్ణయం

ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు.. క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన, ప్రక్షాళన అనంతరం.."జిల్లా కమిటీ ఎంపిక" పర్యవేక్షణలోనే అంగన్వాడి టీచర్ల ఎంపిక కొనసాగనుంది. నిబంధనల మేరకు ఎంపిక చేయనున్నారు. ఎంపిక చేయడంలో ప్రజా ప్రతినిధులు, నాయకుల ప్రమేయం అంటూ ఏమీ ఉండదు. అర్హత ఉన్నవారు మాత్రమే ఎంపిక కానున్నారు. తుది నిర్ణయం జిల్లా ఎంపిక కమిటీదే..

## వరి వేసి రైతులు నష్టపోవద్దు

**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 8 (జనంసాక్షి) :** జిల్లాలో వాతావరణం అనుకూలించేలా లేనందున, ఈ ఏడాది వానలు ఆశించిన స్థాయిలో పడకపోవడంతో రైతులు వరి వేసి నష్టపోవద్దని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రైతులకు విజ్ఞప్తి చేశారు.జూన్, జూలై నెలల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని, రాబోయే సెప్టెంబర్‌లోనూ ఎల్ నినో ప్రభావంతో వానలు తక్కువగానే ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తుందని తెలిపారు.ఈ పరిస్థితుల్లో రైతులు వరి సాగుకు వెళ్లకుండా ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు.శనివారం కలెక్టరేట్ లో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ తో కలిసి ఎల్ నినో ప్రభావంపై అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ప్రస్తుతం, నాగార్జున సాగర్, ఎస్సారెస్పీ, ప్రాజెక్టులలో సమృద్ధిగా నీరు లేనందున నీటి విడుదలపై స్పష్టత లేదన్నారు. జిల్లాలోని 190 పెద్ద చెరువుల్లో చాలా వరకు 25 నుంచి 50 శాతం నీటితోనే ఉన్నాయని, భూగర్భ జలాలు కూడా రీఛార్జ్ కావడం లేదని తెలిపారు.ప్రస్తుతం ఆగస్టు నెలకు వచ్చేశామని, ఇప్పుడు వరి నాట్లు వేస్తే అవి కోతకు వచ్చేసరికి నవంబర్, డిసెంబర్ అవుతుందని వివరించారు. అప్పటికి వర్షాలు ఉండవని, ప్రాజెక్టుల్లో నీళ్లు అయిపోతే పంట ఎండిపోయి రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.జిల్లాలో ఇంకా 2.35 లక్షల ఎకరాల్లో సాగు ప్రారంభం కావాల్సి ఉందని, ఆ రైతులంతా ఆలోచించుకోవాలని కోరారు.పంట మార్పిడిపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు రైతులతో మాట పంట మార్పిడికి బాట అనే పంట మార్పిడి పథకాన్ని స్పెషల్ డ్రైవ్ గా తీసుకొని




ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు.10 రోజుల పాటు ప్రతి అధికారి కనీసం 10 మంది రైతులను వ్యక్తిగతంగా కలిసి అవగాహన కల్పిస్తారన్నారు. తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ఏఈఓలు, మహిళా సంఘాల ప్రతినిధులు ఇందులో పాల్గొంటారని, గ్రామ స్థాయిలో రైతు వేదికల ద్వారా ప్రత్యామ్నాయ పంటల లాభాలను వివరిస్తారని తెలిపారు. నెల 10వ తేదీన నాగార్జున సాగర్‌లో వరుణ యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.యాదగిరిగుట్ట అర్చకుల ఆధ్వర్యంలో జరిగే ఈ క్రతువులో సీఎం రేవంత్ రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని చెప్పారు.తుంగతుర్తి నియోజకవర్గంలోని తొండ గ్రామంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు 8 నెలల్లో పూర్తి చేస్తామన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, ఇరిగేషన్ సిఈ నాగభూషణం, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి సాధ్యం

**వెల్దండ, ఆగస్టు 8 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి బాణావత్ శంకర్ నాయక్ అన్నారు.శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాల ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అభివృద్ధి చేస్తున్నారని, కల్వకుర్తి అభివృద్ధి కసిరెడ్డికే సాధ్యమని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్లు,200 యూనిట్ల ఉచిత కరెంటు,పెళ్లయిన ఆడపిల్లలకు లక్ష రూపాయల నగదు అందజేస్తున్నదని తెలిపారు.రెండవసారి కసిరెడ్డి నారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా చేసి మంత్రిగా చూడాలన్నది తన కళ అని తెలిపారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బిక్షపతి నాయక్, లస్కర్ నాయక్ లు ఉన్నారు.





# రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలి

- ఆయిల్ పామ్ సాగుతో కూడా మంచి ఆదాయం
- ఎల్‌నినో ప్రభావంతో ఈసారి వర్షాలు కురిసే అవకాశం తక్కువ
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 8 (జనం సాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూరాల ప్రాజెక్టుకు ఎగువన ఉన్న జలాశయాల నుంచి ప్రస్తుతం పెద్ద ఎత్తున వరద వస్తున్నప్పటికీ ఆ నీటిని జిల్లాలో ఉన్న రిజర్వాయర్లు, చెరువులు నింపుకొని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. జూరాల ప్రధాన కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేసినప్పటికీ వరద తగ్గుముఖం పడితే కాలువలకు నీటి సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం వర్షాలు తక్కువగా పడతాయన్న వాతావరణ శాఖ సూచనల మేరకు ఖరీఫ్ సీజన్ మొత్తం కాలువల ద్వారా నీటి విడుదల చేసే విషయంపై స్పష్టత లేదన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు కూడా ఆయకట్టు రైతులకు వరి సాగు చేయవద్దని ఇప్పటికే తెలియజేయడం జరిగిందన్నారు. ఈనెల 7న హైదరాబాదు నుంచి పలువురు మంత్రులు, అధికారులు కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించినట్లు పేర్కొన్నారు. వచ్చే వేసవి ముగిసే వరకు ప్రజల తాగు నీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యతనిస్తూ వరద నీటితో ఎత్తిపోతల పథకాల ద్వారా జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు, కుంటలను నింపుతున్నట్లు తెలిపారు.కందులు, మిర్చి, మొక్కజొన్న, పెసర్లు మినుములు, కూరగాయలు, తదితర ఆరుతడి పంటలతో కూడా రైతులకు మంచి ఆదాయం చేకూరుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆత్మ నిర్భరత పప్పు దినుసుల పథకం కింద సబ్సిడీకి కందులు, మినుముల విత్తనాలు అందజేస్తున్నందున జిల్లా రైతులు తమ సమీపంలోని వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరి పంటకు నాలుగు నెలల పాటు మడులలో నిత్యం రెండు ఇంచుల నీళ్లు నిలువ చేయాల్సి వస్తుందని, కాబట్టి తక్కువ నీటితో పండించుకునే ఆరుతడి పంటలు సాగు చేసుకోవడం శ్రేయస్కరమని తెలిపారు. పంటల వైవిధ్యంతోనే నేల సారవంతత కూడా పెరుగుతుందని, పంట మార్పిడి విధానాలు రైతులకు మేలు చేస్తాయని ఇప్పటికే వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు తెలియజేశారన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పందిరి కూరగాయల సాగుకు పందిరి నిర్మించుకునేందుకు ఒక్కో రైతుకు రెండున్నర ఎకరాల వరకు ఐదు యూనిట్ల చొప్పున,యూనిట్ కు రూ. 50 వేల చొప్పున ఆర్థిక సహకారాన్ని ప్రభుత్వం అందజేస్తున్నందున అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం గత కొన్నేళ్లుగా ఆయిల్ పామ్



పంటల సాగును కూడా ప్రోత్సహిస్తున్నట్లు గుర్తు చేశారు. ఆయిల్ పామ్ మొక్కల మధ్యన అంతర పంటలుగా మూడేళ్లపాటు పప్పు దినుసులు, కూరగాయలు వంటి స్వల్ప కాలిక పంటలతోనూ లబ్ధి పొందవచ్చన్నారు. పామ్ గెలలు నాలుగో సంవత్సరం నుంచి వస్తాయని, అప్పుడు సమీపంలోని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మంచి ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ఆయిల్ పామ్ తోటల సాగుకు ప్రభుత్వం రైతులకు సబ్సిడీకి మొక్కలను అందజేయడంతో పాటు బిందు సేద్య పరికరాలను కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఈ పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున రైతులు వరి వంటి సాంప్రదాయ పంటలకు బదులుగా ఎక్కువ ఆదాయాన్ని పొందే అవకాశం ఉన్న పామ్ తోటలతో ఆర్థిక పురోగతి సాధించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.




# మళ్లీ భారత్‌పై వంద శాతం
# టారిఫ్ భారం

## రష్యా చమురు కొంటే 100% సుంకం




- 86-11 ఓట్లతో సెనెట్‌లో ఆంక్షల బిల్లు ఆమోదం
- గరిష్ఠంగా 100 శాతం సుంకాలు విధించే అధికారం
- భారత్‌పై ప్రభావం ఉంటుందా? వాణిజ్య వర్గాల్లో ఆందోళన

*రష్యా నుంచి ఇంధన దిగుమతులు చేసుకుంటున్న దేశాలను కట్టడి చేసేందుకు అమెరికా సెనెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. రష్యాపై కొత్త ఆంక్షలతో పాటు, ఆ దేశం నుంచి చమురు, వాయువును కొనుగోలు చేసే ప్రధాన భాగస్వామ్య దేశాలపై గరిష్ఠంగా 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కల్పిస్తూ రూపొందించిన అత్యంత కీలకమైన బిల్లుకు సెనెట్ 86--11 ఓట్ల మెజారిటీతో ఆమోదం తెలిపింది. 'లిండ్సే ఓ. గ్రాహం ఆంక్షల బిల్లు-2026' పేరుతో తెచ్చిన ఈ చట్టంతో రష్యా నుంచి భారీగా ముడిచమురును దిగుమతి చేసుకుంటున్న భారత వాణిజ్య వర్గాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.*

### రష్యా చమురు కొనుగోళ్లే కీలకం

భారత్ రష్యా నుంచి పెద్ద ఎత్తున ముడిచమురు దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో అమెరికా తాజా చర్య ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రతిపాదిత ఆంక్షలు అమల్లోకి వచ్చి భారత్ కూడా వాటి పరిధిలోకి వస్తే.. అమెరికా మార్కెట్‌కు భారతీయ ఉత్పత్తుల ఎగుమతులపై భారీ సుంకాల భారం పడే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా అమెరికాకు గణనీయంగా ఎగుమతులు చేస్తున్న రంగాలపై ప్రభావం పడితే భారతీయ కంపెనీల పోటీతత్వం దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో రష్యా నుంచి చౌకగా లభించే ముడిచమురు దిగుమతులను తగ్గించాల్సిన పరిస్థితి ఏర్పడితే దేశీయ ఇంధన వ్యయాలపైనా ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. దీంతో రష్యా చమురు కొనుగోళ్లు, అమెరికాతో వాణిజ్య సంబంధాలు, దేశీయ ఇంధన భద్రత మధ్య సమతుల్యత సాధించడం కేంద్ర ప్రభుత్వానికి కీలక సవాలుగా మారనుంది.




**వాషింగ్టన్, ఆగస్టు 8 (జనంసాక్షి) :** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై అమెరికా మరింత కఠినంగా వ్యవహరించేందుకు రంగం సిద్ధమవుతోంది. రష్యాపై కొత్త ఆంక్షలకు సంబంధించిన బిల్లును అమెరికా సెనెట్ 86-11 ఓట్ల తేడాతో ఆమోదించింది. ఈ బిల్లులోని నిబంధనల ప్రకారం రష్యా నుంచి చమురు, ఇతర వస్తువులను కొనుగోలు చేసే దేశాలపై గరిష్ఠంగా 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి లభించనుంది. రష్యా ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెంచడంతోపాటు, ఆ దేశంతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలను పరోక్షంగా కట్టడి చేయడమే ఈ చర్య ఉద్దేశంగా భావిస్తున్నారు. రష్యా నుంచి భారీగా ముడిచమురు దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ కూడా ఉండటంతో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించు కుంది. అమెరికా ప్రతిపాదిత సుంకాల పరిధిలో భారత్ వస్తే.. ఇరు దేశాల మధ్య వాణిజ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా భారతీయ చమురు శుద్ధి సంస్థలు రష్యా నుంచి తక్కువ ధరలకు ముడిచమురు కొనుగోలు చేసి శుద్ధి చేస్తున్న నేపథ్యంలో అమెరికా చర్యల ప్రభావం సరఫరా వ్యయాలు, ఇంధన ధరలు, ఎగుమతు లపై పడే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే సెనెట్ ఆమోదించిన బిల్లు వెంటనే అమల్లోకి వచ్చినట్లు భావించరాదు. అమెరికా చట్ట ప్రక్రియలో తదుపరి దశలు, తుది ఆమోదం, అమలు నిబంధనలు కీలకంగా మారను న్నాయి. సుంకాలు ఏ దేశాలపై, ఏ ఉత్పత్తులపై, ఎలాంటి పరిస్థితుల్లో విధించాలన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. దీంతో భారత్‌పై వాస్తవ ప్రభావం ఎంతమేర ఉంటుందన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

భారత్ ఇప్పటికే రష్యాతో ఇంధన వాణిజ్యంపై తన వైఖరిని స్పష్టం చేస్తూ, దేశ ఇంధన భద్రత, వినియోగదారుల ప్రయోజనాలే తమ ప్రధాన ప్రాధాన్యాలని చెబుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు, సరఫరా పరిస్థితులు, భౌగోళిక రాజకీయ పరిణామాలను పరిగణన లోకి తీసుకుని దిగుమతులపై నిర్ణయాలు తీసుకుంటు న్నట్లు పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో అమెరికా తాజా చర్యపై న్యూఢిల్లీ నుంచి వచ్చే స్పందన కీలకంగా మారింది. మరోవైపు 100 శాతం వరకు సుంకాలు విధించే అవకాశం అంతర్జాతీయ వాణిజ్యంపై ప్రభావం చూపవచ్చని వాణిజ్య నిపుణులు చెబుతున్నారు. అమెరికా-రష్యా మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగితే రష్యా చమురు కొనుగోలు చేస్తున్న ఇతర దేశాలపైనా ఒత్తిడి పెరిగే అవకాశముంది. దీంతో భారత్ ప్రత్యామ్నాయ ఇంధన సరఫరా మార్గాలు, దిగుమతి వనరులు, అమెరికాతో వాణిజ్య చర్చలను సమన్వయం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## హెచ్-1బీపై ట్రంప్ సర్కారు మరో పిడుగు!

- ఉద్యోగం పోతే 60 రోజుల గ్రేస్ పీరియడ్ రద్దు?
- అమెరికాలో ఉండే వెసులుబాటుకు మంగళం
- భారతీయ టెకీల్లో పెరుగుతున్న ఆందోళన

**వాషింగ్టన్:** హెచ్-1బీ వీసాదారులకు అమెరికా ప్రభుత్వం మరో షాక్ ఇచ్చే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఉద్యోగం కోల్పోయిన తర్వాత మరో ఉద్యోగం వెతుక్కునేందుకు ప్రస్తుతం ఉన్న 60 రోజుల గ్రేస్ పీరియడ్‌ను తొలగించే ప్రతిపాదనను హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం పంపినట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనను ప్రస్తుతం ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ (ఓఎంబీ) పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇది అమల్లోకి వస్తే ఉద్యోగం కోల్పోయిన హెచ్-1బీ వీసాదారులు తక్షణమే అమెరికా వీడాల్సిన పరిస్థితి ఏర్పడొచ్చు. ప్రస్తుతం లేఆఫ్ లేదా ఇతర కారణాలతో ఉద్యోగం కోల్పోయిన హెచ్-1బీ వీసాదారులకు 60 రోజుల వరకు అమెరికాలో ఉండి కొత్త ఉద్యోగం వెతుక్కునే అవకాశం ఉంది. ఈ వ్యవధిలో కొత్త సంస్థలో చేరి వీసా బదిలీ చేసుకోవడం లేదా వీసా హోదాను మార్చుకోవాల్సి ఉంటుంది. గడువులోగా ఆ ప్రక్రియ పూర్తి కాకపోతే అమెరికా నుంచి వెళ్లిపోవాల్సి ఉంటుంది. విదేశీ నిపుణులపై వీసా నిబంధనలను కఠినతరం చేసే దిశగా ట్రంప్ ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు చేపట్టింది. కొత్త హెచ్-1బీ వీసాలపై భారీ రుసుము విధించే నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో.. తాజాగా గ్రేస్ పీరియడ్‌ను తొలగించే ప్రతిపాదన తెరపైకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది అమల్లోకి వస్తే ముఖ్యంగా ఉద్యోగ భద్రతపై ఆధారపడే విదేశీ నిపుణులు, భారతీయ టెకీలపై ప్రభావం పడే అవకాశం ఉంది.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 530 | ₹ 63.60 |
| వరంగల్ | ₹ 532 | ₹63.84 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు |
|---|---|---|
| హైదరాబాద్ | ₹1,46,630 | ₹1,39,650 |
| చెన్నై | ₹1,52,350 | ₹1,39,650 |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్ ₹ 2,49,900

# మార్కెట్లకు అమ్మకాల సెగ!

## సెన్సెక్స్ 455 పాయింట్లు పతనం




- 78,500 దిగువకు సూచీ
- బ్యాంకింగ్.. ఫైనాన్షియల్ షేర్లలో భారీ అమ్మకాలు
- అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలతోనూ ఒత్తిడి

**ముంబయి, ఆగస్టు 8 (జనంసాక్షి) :**
దేశీయ స్టాక్ మార్కె ట్లు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ షేర్లలో వెల్లువెత్తిన అమ్మకాలతో ప్రధాన సూచీలు ఒత్తిడికి లోనయ్యాయి. సెన్సెక్స్ 455.59 పాయింట్లు పతనమై 78,499.17 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 65.35 పాయింట్లు క్షీణించి 24,570.65 వద్ద ముగిసింది. రోజంతా మార్కెట్ తీవ్ర ఒడిదుడుకులకు లోనైంది. ముఖ్యంగా కీలక రంగాల షేర్లలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీలు గణనీయంగా దిగజారాయి. ఇటీవలి ర్యాలీ నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్ర మత్తంగా వ్యవహరించడం కూడా మార్కెట్‌పై ప్రభావం చూపింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు కోలుకోలేకపోయాయి. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి, విదేశీ పెట్టుబడుల ప్రవాహంపై ఉన్న ఆందోళనలు కూడా దేశీయ మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. సెన్సెక్స్‌లోని కీలక షేర్లలో అమ్మకాలు పెరగడంతో సూచీ రోజులోని గరిష్ఠ స్థాయిల నుంచి క్రమంగా దిగజారింది. నిఫ్టీలోనూ బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. దీంతో మార్కెట్ విస్తృతంగా బలహీనపడింది. కొన్ని ఎంపిక చేసిన రంగాల షేర్లలో కొనుగోళ్లు కనిపించినప్పటికీ.. ప్రధాన సూచీల నష్టాలను పూడ్చేందుకు అవి సరిపోలేదు.

మార్కెట్ కదలికలపై అంతర్జాతీయ పరిణామాలు, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల తీరు, ముడిచమురు ధరలు, రూపాయి మారకం విలువ వంటి అంశాలు ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నా రు. రానున్న రోజుల్లో కంపెనీల ఆర్థిక ఫలితాలు, ప్రపంచ మార్కెట్ల దిశ, అమెరికా వాణిజ్య విధానాలకు సంబంధించిన పరిణా మాలు దేశీయ ఈక్విటీ మార్కెట్లకు కీలకంగా మారనున్నాయని విశ్లేషిస్తున్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని మార్కెట్ వర్గాలు సూచిస్తున్నాయి. ప్రధాన సూచీలు కీలక స్థాయిల వద్ద నిలదొక్కుకోవడం, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి తగ్గడం మార్కెట్ తదుపరి దిశను నిర్ణయించవచ్చని పేర్కొంటున్నాయి. రానున్న సెషన్లలో అంతర్జాతీయ సంకేతాలు, విదేశీ నిధుల కదలికలపై ఇన్వెస్టర్ల దృష్టి కొనసాగనుంది.






# క్రూడ్ మంటలు.. మార్కెట్‌కు సెగ!

## పెరుగుతున్న చమురు ధరలతో ఈక్విటీలపై ఒత్తిడి

- భారీగా పెరగనున్న భారత్ దిగుమతి బిల్లు
- రూపాయి విలువపై మరింత ఒత్తిడి?
- ద్రవ్యోల్బణం పెరిగే ముప్పుపై ఆందోళన

**ముంబయి, ఆగస్టు 8 (జనంసాక్షి) :** అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరుగుతుండటంతో దేశీయ స్టాక్ మార్కెట్లపై ఒత్తిడి పెరుగుతోంది. ఇప్పటికే అంతర్జాతీయ పరిణామాలతో అప్రమత్తంగా ఉన్న ఇన్వెస్టర్లకు క్రూడ్ ధరల పెరుగుదల మరో ప్రతికూల అంశంగా మారింది. చమురు దిగుమతులపై అధికంగా ఆధారపడే భారత్‌కు ధరలు పెరగడం వల్ల దిగుమతి వ్యయం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఫలితంగా వాణిజ్య లోటు, కరెంట్ ఖాతా లోటు, రూపాయి మారకం విలువతో పాటు ద్రవ్యోల్బణంపైనా ప్రభావం పడే అవకాశముందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయంగా క్రూడ్ ధరలు పెరిగిన ప్రతిసారీ భారత్‌పై నేరుగా ప్రభావం పడుతుంది. దేశ అవసరాల్లో గణనీయమైన భాగం ముడిచమురు దిగుమతుల ద్వారానే తీరుతున్నందున.. ధరల పెరుగుదలతో చమురు దిగుమతి బిల్లు భారమవుతుంది. దిగుమతుల కోసం అధిక మొత్తంలో డాలర్లను వెచ్చించాల్సి రావడంతో విదేశీ మారక ద్రవ్యంపై డిమాండ్ పెరుగుతుంది. ఇది రూపాయిపై ఒత్తిడిని పెంచే అవకాశముంది.

చమురు ధరలు ఎక్కువకాలం అధిక స్థాయిలో కొనసాగితే రవాణా, ఉత్పత్తి, విద్యుత్, తయారీ వంటి పలు రంగాల వ్యయాలు పెరిగే అవకాశం ఉంది. కంపెనీల నిర్వహణ వ్యయాలు పెరగడంతో లాభాలపై ప్రభావం పడవచ్చన్న ఆందోళన మార్కెట్ వర్గాల్లో నెలకొంది. ముఖ్యంగా చమురు వినియోగం అధికంగా ఉండే రంగాల షేర్లపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు ఇంధన ధరల పెరుగుదల దేశీయ ద్రవ్యోల్బణంపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. పెట్రోల్, డీజిల్, రవాణా వ్యయాలు పెరిగితే వస్తువులు, సేవల ధరలపై పరోక్ష ప్రభావం పడుతుంది. దీనివల్ల ద్రవ్యోల్బణ నియంత్రణ విషయంలో ఆర్‌బీఐకి సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని ఆర్థిక వర్గాలు పేర్కొంటున్నాయి. అదే సమయంలో అధిక చమురు ధరలు వినియోగదారుల కొనుగోలు శక్తిపైనా ప్రభావం చూపవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ క్రూడ్ ధరల కదలికలు, డాలర్-రూపాయి మారకం రేటు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం వంటి అంశాలు దేశీయ మార్కెట్ల తదుపరి దిశను నిర్ణయించనున్నాయి. చమురు ధరలు మరింత పెరిగితే మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి కొనసాగవచ్చని, ధరలు స్థిరపడితే ఇన్వెస్టర్లలో కొంత ఊరట రావచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.

## వచ్చే వారం మార్కెట్‌కు అమెరికా పరీక్ష!

- రష్యా ఆంక్షల బిల్లు.. క్రూడ్ ధరలపైనా కన్ను
- ఎఫ్ఐఐల కదలికలే కీలకం
- సెన్సెక్స్-నిఫ్టీ దిశను నిర్ణయించనున్న కీలక పరిణామాలు

**ముంబయి, ఆగస్టు 8:** దేశీయ స్టాక్ మార్కెట్లకు వచ్చే వారం కీలకంగా మారనుంది. అమెరికా టారిఫ్ విధానానికి సంబంధించిన పరిణామాలు, రష్యాపై ఆంక్షల బిల్లు, అంతర్జాతీయ ముడిచమురు ధరలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల కదలికలు సెన్సెక్స్-నిఫ్టీ దిశను ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా నిలవనున్నాయి. ఇప్పటికే శుక్రవారం బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. అంతర్జాతీయంగా పెరుగుతున్న అనిశ్చితి నేపథ్యంలో వచ్చే వారం మార్కెట్‌లో ఒడిదుడుకులు కొనసాగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అమెరికా టారిఫ్ విధానంపై వెలువడే తాజా నిర్ణయాలు భారత మార్కెట్లకు అత్యంత కీలకంగా మారనున్నాయి. అమెరికా-భారత్ వాణిజ్య సంబంధాల్లో మార్పులు చోటుచేసుకుంటే ఎగుమతి ఆధారిత రంగాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా అమెరికా మార్కెట్‌పై అధికంగా ఆధారపడే ఐటీ, ఫార్మా, టెక్స్‌టైల్స్, ఆటో విడిభాగాలు వంటి రంగాల షేర్లలో ఇన్వెస్టర్ల స్పందన కీలకంగా ఉండనుంది. టారిఫ్‌లపై స్పష్టత వచ్చే వరకు మార్కెట్‌లో అప్రమత్తత కొనసాగవచ్చని నిపుణులు చెబుతున్నారు. రష్యాపై ప్రతిపాదిత ఆంక్షల బిల్లులోని అంశాలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. రష్యా నుంచి ముడిచమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై అమెరికా మరింత ఒత్తిడి పెంచితే భారత్ ఇంధన దిగుమతులపై ప్రభావం పడే అవకాశం ఉందన్న ఆందోళన నెలకొంది. దీనికి తోడు అంతర్జాతీయ క్రూడ్ ధరలు పెరిగితే భారత్ దిగుమతి బిల్లు, రూపాయి విలువ, ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెరిగే అవకాశముంది. ఈ పరిణామాలన్నీ దేశీయ ఈక్విటీ మార్కెట్లకు ప్రతికూలంగా మారే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

# యూపీఐపై ఛార్జీలు లేవు!

- పీర్-టు-పీర్ లావాదేవీలకు రుసుము లేదు
- వ్యాపారులపై ఎంపిక చేసిన లావాదేవీలకే ఎండీఆర్

**ముంబయి, ఆగస్టు 8:**యూపీఐ లావాదేవీలపై కేంద్ర ఆర్థికశాఖ స్పష్టత ఇచ్చింది. వినియోగదారులపై ఎలాంటి ఛార్జీలు ఉండవని, వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని తెలిపింది. వ్యాపారులకు సంబంధించిన అత్యధిక లావాదేవీలూ ఉచితంగానే ఉంటాయని పేర్కొంది. భవిష్యత్తులో ఎండీఆర్ అమల్లోకి వచ్చినా ఎంపిక చేసిన మర్చంట్ లావాదేవీలపైనే నామమాత్రపు రుసుము విధించే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఈ ఛార్జీ డెబిట్, క్రెడిట్ కార్డుల ఎండీఆర్ కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. డిజిటల్ చెల్లింపులపై ఎండీఆర్ విధింపునకు వీలు కల్పించే సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపిన నేపథ్యంలో యూపీఐపై ఛార్జీలు పెరుగుతాయన్న ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తాజా ప్రకటనతో సాధారణ వినియోగదారులకు ఊరట లభించింది.

# బ్యాంకింగ్ వ్యవస్థకు ఆర్‌బీఐ దిశానిర్దేశం!

- ఎన్ఆర్ఐ డిపాజిట్లతో భారీగా డాలర్ ప్రవాహాలు
- రుణ వడ్డీ విధానాల్లో ఏకరీకరణకు ప్రతిపాదనలు
- రూ. 2 లక్షల కోట్ల లిక్విడిటీని శోషించేందుకు సిద్ధం
- బ్యాంకుల నిధుల నిర్వహణపై ఆర్‌బీఐ ప్రత్యేక దృష్టి




**ముంబయి, ఆగస్టు 8 (జనంసాక్షి) ::** దేశ బ్యాంకింగ్ వ్యవస్థలో నిధుల ప్రవాహం, రుణాల వడ్డీ రేట్ల విధానం, విదేశీ మారక నిధుల నిర్వహణపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. ఎన్ఆర్ఐ డిపాజిట్లను ప్రోత్సహించడం ద్వారా విదేశీ మారక నిధుల ప్రవాహాన్ని పెంచడంతో పాటు.. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల రుణ వడ్డీ విధానాల్లో పారదర్శకత, ఏకరీతిని తీసుకురావడానికి ప్రతిపాదనలు చేసింది. మరోవైపు బ్యాంకింగ్ వ్యవస్థలో అధికంగా ఉన్న అదనపు నిధులను వెనక్కి తీసుకునేందుకు ₹2 లక్షల కోట్లను 7 రోజుల వేరియబుల్ రేట్ రివర్స్ రెపో (వీఆర్ఆర్ఆర్) వేలం ద్వారా శోషించేందుకు సిద్ధమవుతోంది.

ఆర్‌బీఐ ప్రత్యేక ఫారెక్స్ స్వాప్ సదుపాయం నేపథ్యంలో భారతీయ బ్యాంకులు దాదాపు 27.99 బిలియన్ డాలర్ల విలువైన ఎఫ్‌సీఎన్ఆర్ డిపాజిట్లను సమీకరించినట్లు సమాచారం. నాన్-రెసిడెంట్ భారతీయులు విదేశీ కరెన్సీలో ఉంచే ఈ డిపాజిట్లు దేశానికి డాలర్ల ప్రవాహాన్ని పెంచడంలో కీలకంగా మారుతున్నాయి. విదేశీ మారక మార్కెట్‌లో ఒత్తిడి ఉన్న సమయంలో డాలర్ లభ్యతను మెరుగుపరచడంతో పాటు.. బ్యాంకుల విదేశీ కరెన్సీ నిధుల స్థితిని బలోపేతం చేయడంలో ఈ డిపాజిట్లు ఉపయోగపడుతున్నాయి. రూపాయి విలువపై ఒత్తిడిని తగ్గించే దిశలోనూ ఇవి కొంత మద్దతు ఇవ్వవచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

మరోవైపు బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు రుణాలపై వడ్డీ రేట్లను నిర్ణయించే విధానాల్లో మరింత ఏకరీతి తీసుకురావడానికి ఆర్‌బీఐ ప్రతిపాదనలు చేసింది. రుణ ధర నిర్ణయంలో పారదర్శకత పెంచడం, రుణగ్రహీతలకు వడ్డీ భారంపై స్పష్టత కల్పించడం ఈ మార్పుల ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. వివిధ రుణ ఉత్పత్తులపై వడ్డీ రేట్ల నిర్ణయంలో అనుసరించే విధానాలను మరింత స్పష్టంగా రూపొందించడం ద్వారా రుణ మార్కెట్‌లో పోటీ, పారదర్శకత పెరిగే అవకాశం ఉంది. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల మధ్య రుణ ధర నిర్ణయంలో ఉన్న విధానపరమైన వ్యత్యాసాలను తగ్గించే దిశగా ఈ ప్రతిపాదనలు కీలకంగా మారనున్నాయి. ఇదిలా ఉండగా బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రస్తుతం అదనపు లిక్విడిటీ గణనీయంగా పెరిగింది. వ్యవస్థలో నిధులు అధికంగా ఉండటంతో స్వల్పకాలిక వడ్డీ రేట్లపై ఒత్తిడి ఏర్పడకుండా చూసేందుకు ఆర్‌బీఐ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ₹2 లక్షల కోట్లను 7 రోజుల వీఆర్ఆర్ఆర్ వేలం ద్వారా శోషించేందుకు సిద్ధమవుతోంది. బ్యాంకుల వద్ద ఉన్న అదనపు నిధులను తాత్కాలికంగా ఆర్‌బీఐ వైపు మళ్లించడం ద్వారా వ్యవస్థలో ద్రవ్య లభ్యతను సమతుల్యం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. లిక్విడిటీ అధికంగా ఉండటం వల్ల ద్రవ్యోల్బణం, మార్కెట్ వడ్డీ రేట్లు, రుణాల ధర నిర్ణయంపై అనూహ్య ప్రభావం పడకుండా నియంత్రణ చర్యలు చేపడుతున్నట్లు బ్యాంకింగ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఎన్ఆర్ఐ డిపాజిట్ల ద్వారా విదేశీ మారక నిధులను పెంచడం ఒకవైపు, అదనపు రూపాయి లిక్విడిటీని మరోవైపు శోషించడం ద్వారా ఆర్‌బీఐ బ్యాంకింగ్ వ్యవస్థలో సమతుల్యత సాధించే ప్రయత్నం చేస్తోంది. అదే సమయంలో రుణ వడ్డీ విధానాల్లో పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలకు స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించే దిశగా అడుగులు వేస్తోంది. ఈ చర్యలు అమల్లోకి వస్తే బ్యాంకుల నిధుల నిర్వహణ, రుణాల ధర నిర్ణయం, విదేశీ మారక నిధుల లభ్యతపై దీర్ఘకాలిక ప్రభావం ఉండే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ఏఐతో ఉద్యోగాల కోత కాదు.. కొత్త కొలువుల జోరు!

- లేఆఫ్‌ల కంటే నియామకాలు మూడు రెట్లు
- భారత్‌లో 83,100 ఏఐ ఆధారిత ఉద్యోగాలు
- నాలుగేళ్లలో 31,921 కొలువులకు కోత
- అనుభవజ్ఞులకు పెరుగుతున్న అవకాశాలు


**ముంబయి (జనంసాక్షి) :** కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా టెక్ కంపెనీల్లో లేఆఫ్‌లు పెరుగుతున్నాయన్న ఆందోళనల మధ్య.. భారత్‌లో మాత్రం ఉద్యోగాల కోతల కంటే కొత్త నియామకాలే ఎక్కువగా ఉన్నట్లు నోమురా అధ్యయనం వెల్లడించింది. 2022 నుంచి 2026 ఆగస్టు మధ్య భారత కంపెనీలు ఏఐ కారణంగా 31,921 ఉద్యోగాలను తగ్గించగా.. ఇదే సమయంలో 83,100 ఏఐ ఆధారిత నియామకాలు చేపట్టినట్లు తెలిపింది. అంటే లేఆఫ్‌లతో పోలిస్తే ఏఐ ఆధారిత నియామకాలు దాదాపు మూడు రెట్లు అధికంగా ఉన్నాయి. ఏఐ చాట్‌బాట్‌ల వినియోగంతో కొన్ని సంస్థలు సపోర్ట్ విభాగాల్లో ఉద్యోగాలను తగ్గించినప్పటికీ.. ఏఐ ఆధారిత సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చేందు కు ఐటీ సేవల రంగంలో నియామకాలు పెరిగినట్లు అధ్యయనం పేర్కొంది. అయితే ఏఐ ప్రభావం ఉద్యోగాలపై సమానంగా లేదని నోమురా హెచ్చరిం చింది. ముఖ్యంగా ఎంట్రీ లెవల్ ఉద్యోగాలకు డిమాండ్ తగ్గుతుండగా.. వ్యాపార కార్యకలాపాలు, ఏఐ సంబంధిత విభాగాల్లో అనుభవజ్ఞులకు అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపింది. ఆసియా వ్యాప్తంగా గత నాలుగేళ్లలో 1.3 లక్షలకు పైగా ఏఐ ఆధారిత నియామకాలు జరిగాయని నోమురా వెల్లడించింది. వీటిలో సుమారు 90 శాతం టెక్నాలజీ రంగంలోనే ఉన్నట్లు తెలిపింది. ఇదే సమయంలో ఆసియా కంపెనీలు 60,654 ఉద్యోగాలను తొలగించగా.. అందులో 60 శాతం ఆర్థిక సేవల రంగంలోనే ఉన్నట్లు పేర్కొంది.

## నిఫ్టీకి స్వల్ప లాభం.. ముందు ముప్పులే!

**ముంబయి, (జనంసాక్షి):** దేశీయ స్టాక్ మార్కెట్లలో వారాంతపు ఒడిదుడుకుల మధ్య నిఫ్టీ ఆగస్టు 3-7 వారంలో స్వల్ప లాభాన్ని నమోదు చేసింది. వారంలో కొన్ని సెషన్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించినప్పటికీ.. చివరి ట్రేడింగ్ రోజున బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో మార్కెట్ సెంటిమెంట్ బలహీనపడింది. దీంతో వచ్చే వారం అంతర్జాతీయ పరిణామాలు, అమెరికా టారిఫ్ వార్తలు, ముడిచమురు ధరలు, బ్యాంకింగ్ షేర్ల కదలికలు సూచీలకు అత్యంత కీలకంగా మారనున్నాయి. వారంలో ప్రారంభ సెషన్లలో దేశీయ మార్కెట్లకు కొంత కొనుగోళ్ల మద్దతు లభించింది. ఎంపిక చేసిన రంగాల షేర్లలో ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడంతో నిఫ్టీ కొంత మేర పుంజుకుంది. అయితే అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి, అమెరికా వాణిజ్య విధానానికి సంబంధించిన పరిణామాలు, విదేశీ పెట్టుబడుల కదలికలపై ఉన్న ఆందోళనలు మార్కెట్ ర్యాలీకి పరిమితులు విధించాయి. చివరి సెషన్‌లో అమ్మకాలు పెరగడంతో వారాంతపు సానుకూలత కొంత మేర తగ్గింది. అమెరికా టారిఫ్ విధానానికి సంబంధించిన తాజా పరిణామాలు వచ్చే వారం మార్కెట్‌కు ప్రధాన దిశానిర్దేశకంగా మారనున్నాయి. టారిఫ్‌ల విషయంలో కఠిన నిర్ణయాలు వెలువడితే అమెరికా మార్కెట్‌పై ఆధారపడే భారతీయ ఎగుమతి రంగాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. మరోవైపు అమెరికా-రష్యా సంబంధాలు, రష్యాపై ప్రతిపాదిత ఆంక్షలు కూడా ఇంధన మార్కెట్‌ను ప్రభావితం చేసే అవకాశం ఉండటంతో ఇన్వెస్టర్లు అంతర్జాతీయ వార్తలను నిశితంగా పరిశీలించనున్నారు. ముడిచమురు ధరల కదలికలు కూడా దేశీయ మార్కెట్లకు కీలకంగా మారనున్నాయి. క్రూడ్ ధరలు అధికంగా కొనసాగితే భారత్ దిగుమతి బిల్లు పెరగడంతో పాటు రూపాయి విలువ, ద్రవ్యోల్బణం, కంపెనీల నిర్వహణ వ్యయాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా చమురు వినియోగం అధికంగా ఉండే రంగాల షేర్లలో దీని ప్రభావం కనిపించవచ్చని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో క్రూడ్ ధరలు స్థిరపడితే మార్కెట్ సెంటిమెంట్‌కు కొంత ఊరట లభించే అవకాశం ఉంది.

జనంసాక్షి www.janamsakshi.org
ఆదివారం
09 ఆగస్ట్ 2026

# మిడ్‌మానేరు 4 గేట్లు ఎత్తివేత



**బోయినపల్లి, ఆగస్టు 08 (జనంసాక్షి) :** మిడ్‌మానేరు జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. శనివారం సాయంత్రం వరకు నమోదు అయినా జలాశయ నీటిమట్టం 315.05 మీటర్లుగా ఉంది. పూర్తి స్థాయి 318 మీటర్లు కాగా.. ప్రస్తుతం 20.538 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు. ఎగువ ప్రాంతాల నుంచి 13,819 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందినీ.వరద ప్రవాహం 1,219 క్యూసెక్కులు ఉండగా.. మొత్తం 5,127 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇందులో రేడియల్ గేట్ల ద్వారా 5,000 క్యూసెక్కులు, ఈవీపీ ద్వారా 82, ఎంబీ ద్వారా 45 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలోని 25 స్పిల్‌వే గేట్లలో నాలుగు గేట్లను ఎత్తారు. 11, 12, 13వ గేట్లను 0.70 మీటర్లు, 14వ గేటును 0.35 మీటరు మేర ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. రేడియల్ గేట్లు మినహా రిజర్వాయర్ గేట్లు తెరవలేదని అధికారులు తెలిపారు.

# సిద్ధార్థ విద్యాసంస్థలలో ఘనంగా బోనాల పండగ

## సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి



**కరీంనగర్ అర్బన్, ఆగస్టు 8 (జనంసాక్షి) :** స్థానిక భగత్నగర్లోని సిద్ధార్థ విద్యాసంస్థలలో బోనాల పండగను ఘనంగా నిర్వహించడం జరిగిందని చైర్మన్ శ్రీపాల్ రెడ్డి తెలిపారు. పాఠశాల ఆవరణాన్ని రంగ వల్లులతో, పూలతో, అందంగా అలంకరించారు. విద్యార్థులందరూ బోనానికి సంబంధించిన కుండలను ఇంటివద్దనే అందంగా అలంకరించుకొని పాఠశాలకు విచ్చేసారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి, డైరెక్టర్ దాసరి స్వప్న రెడ్డి పోచమ్మ తల్లికి జ్యోతి ప్రజ్వలన గావించి, పూజను ఆరంభించారు. ఈ పూజా కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయిని లందరు, విద్యార్థులు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ... మారుతున్న నాగరికతా సమాజంలో పిల్లల్లో ఆధ్యాత్మికతను, భక్తి భావాన్ని పెంపొందించడానికి, ఇలాంటి పండుగలు దోహదపడుతాయని, పంచభూతాలను గ్రామదేవతలుగా భావించుకొని బోనాన్ని నైవేద్యంగా సమర్పించే సాంప్రదాయము వెనుక దాగివున్న శాస్త్రీయ విషయాలను గురించి విద్యార్థులకు వివరించారు. ఈ వేడుకలో మహిళా ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు బోనాలు ఎత్తుకొని సందడిచేసారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి, డైరెక్టర్ దాసరి స్వప్న రెడ్డి, ఉపాధ్యాయ బృంధం, విద్యార్థులు ఈ పండగలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# రాజేందర్ రెడ్డిది ఆత్మహత్య కాదు.. ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే!

## ఎమ్మెల్యే కవ్వంపల్లి, పీఏ మురళీధర్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తీవ్ర ధ్వజం

## బాధిత కుటుంబానికి కోటి పరిహారం, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్



**గన్నేరువరం, ఆగస్టు 08 (జనంసాక్షి):** గన్నేరువరం మండలం గుండ్లపల్లి మాజీ సర్పంచ్ భర్త బేతెల్లి రాజేందర్ రెడ్డి మృతి కేవలం ఆత్మహత్య కాదని, ఇదొక ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సంచలన ఆరోపణలు చేశారు. శనివారం గుండ్లపల్లిలో బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పరామర్శించిన ఆయన, స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఆయన పీఏ మురళీధర్ రెడ్డిలపై నిప్పులు చెరిగారు. పాత నేరస్తులను రాజేందర్ రెడ్డి వద్దకు పంపి హత్య చేయడానికి , దీనిపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. ఉల్టా ఆయనపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించారని మండిపడ్డారు. క్యాంప్ ఆఫీసులో వేధింపులకు గురిచేయడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని, ఇది ఆత్మహత్యనా లేక వారే పెట్రోల్ పోసి అంటించారా అనేది సీసీ కెమెరా ఫుటేజ్ లతో పోలీసులు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. మాకు న్యాయం చేయండి: బేతెల్లి సమత ఆవేదన.. ఈ సందర్భంగా మృతుడి భార్య బేతెల్లి సమత కన్నీరుమున్నీరుగా విలపించారు. కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పనిచేసిన తమ కుటుంబానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి వెన్నుపోటు పొడిచారని వాపోయారు. ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్న భర్తను పరామర్శించకపోగా, నిందితులకు ఎమ్మెల్యే కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ఐదుగురు దోషులకు శిక్ష పడే వరకు తాను పోరాటం చేస్తానని, ఈ పోరులో తనకు మీడియా, బీఆర్ఎస్ పార్టీ అండగా నిలవాలని వేడుకున్నారు. బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారంతో పాటు ఉద్యోగం ఇవ్వాలని రసమయి డిమాండ్ చేశారు. వారం రోజుల్లోగా ఎమ్మెల్యే కవ్వంపల్లి బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే, పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న,మాజీ జడ్పీటీసీ మాడుగుల రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గుడెల్లి ఆంజనేయులు, నాయకులు న్యాత సుధాకర్, గొల్లపల్లి రవి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# థార్ గ్యాంగ్‌కు చెందిన ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్




**కొత్తపల్లి, ఆగస్టు 8 (జనంసాక్షి) :** కరీంనగర్‌లో దొంగతనాలకు పాల్పడేందుకు వచ్చిన మధ్యప్రదేశ్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాలోని ఇద్దరు సభ్యులను కొత్తపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. రేకుర్తి ఐ హాస్పిటల్ కమాన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారించారు.మధ్యప్రదేశ్‌లోని థార్ జిల్లా తాండా తాలూకాకు చెందిన నలుగురు సభ్యుల ముఠా కరీంనగర్‌కు చేరుకుని రేకుర్తి, మల్కాపూర్ ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. గత ఏడాది సంక్రాంతి సమయంలో కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతకుంట ప్రాంతంలో పలు దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో నిందితులు అంగీకరించినట్లు పేర్కొన్నారు. తిరిగి దొంగతనాలకు పాల్పడేందుకు కరీంనగర్‌కు వచ్చినట్లు వెల్లడించారు. ముఠాలోని మరో ఇద్దరు పోలీసుల నుంచి తప్పించుకుని పరారయ్యారు. అరెస్టయిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు కొత్తపల్లి ఎస్‌హెచ్‌ఓ బిల్లా కోటేశ్వర్ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్ఐ సాంబమూర్తి, కానిస్టేబుళ్లు శ్రీనాథ్, వెంకటేష్, మహేష్ తదితర సిబ్బందిని ఏసీపీ, సీఐ అభినందించారు.

# బీజేపీ పాలనలో ప్రజల అవస్థలు

## మోడీని గద్దె దింపే వరకు సిపిఐ పోరు

## సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

## సైదాపూర్ లో సిపిఐ పాదయాత్రలో చాడ



**సైదాపూర్ ఆగస్టు 8 (జనం సాక్షి) :** దేశంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ప్రచార జాత పాదయాత్ర నిర్వహిస్తుందని, బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలే దాని పతనానికి దారి తీస్తుందని, దేశంలో మార్పు కోసం సిపిఐ పోరాటం సాగిస్తోందని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం సిపిఐ ప్రచార జాత పాదయాత్ర కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలో 3వ రోజు ప్రచార జాత అమ్మనగుర్తి లో పాదయాత్ర ప్రారంభమై బొమ్మకల్ రాయికల్ ఘన్పూర్ ఆకునూర్ గొల్లగూడెం మీదుగా సర్దార్ సర్వాయి పాపన్న సర్వాయిపేట గడీల వరకు వరకు ఉత్సాహపూరితంగా సాగింది. ఈ యాత్రకు ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ సీనియర్ నాయకులు,చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తుందని ఆరోపించారు. బీజేపీ 12 ఏళ్ల పాలనలో ప్రజలకు ఉపయోగకరమైన ఒక మంచి పని అయిందా అని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని, సాధారణ పౌరులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టిందని, రైతాంగాన్ని పూర్తిగా విస్మరించిందని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వడంలో విఫలమయ్యారని, రైతు సంక్షేమాన్ని దెబ్బతీశారని అన్నారు. సహజ వనరులను కార్పొరేట్ మిత్రులు అదానీ, అంబానీ లకు కట్టబెట్టడానికి కుట్రలు జరుగుతున్నాయన్నారు. వీటికి వ్యతిరేకంగా కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక విధానాన్ని నిరసిస్తూ దేశంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, విద్య, ఆరోగ్యం ప్రజలకు అందుబాటులోకి తేవాలని, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలని, మహిళా రిజర్వేషన్ తక్షణం అమలు చేయాలని, కార్మికుల హక్కులను పరిరక్షిస్తూ కొత్తగా తెచ్చిన లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, దళితులపై, మహిళలపై అకృత్యాలను, దాడులను నిలిపివేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంకై ఆగస్టు 6 నుండి దేశవ్యాప్తంగా సిపిఐ పాదయాత్రలు వివిధ జిల్లాలు, గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల గుండా సాగుతూ అట్టడుగు వర్గాల ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై సెప్టెంబర్ 1వ తేదీన ఢిల్లీలో దేశంలో మార్పు కోసం మహా ర్యాలీతో ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ప్రచార కార్యదర్శి అందే స్వామి పొన్నగంటి కేదారి బోయిని అశోక్ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల బాబు కసిరెడ్డి సురేందర్ రెడ్డి గూడెం లక్ష్మి మండల పార్టీ కార్యదర్శి లంకదాసరి కళ్యాణ్ ఓజ్జా కొమురయ్య నాయకులు పాల్గొన్నారు.



# రామగుండం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

## నగర మేయర్ మహంకాళి స్వామి

**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రులను నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు . అభివృద్ధి పనుల పురోగతిపై ఉమ్మడి కరీశీనగర్ జిల్లా ప్రజాప్రతినిధులు , జిల్లా కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో హైద్రాబాద్ సచివాలయం లో శనివారం మంత్రుల స్థాయిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రులు శ్రీధర్ బాబు ,అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి ,పొన్నం ప్రభాకర్ లు నిర్వహించిన ఈ సమీక్షా సమావేశంలో రామగుండం శాసన సభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ తో పాటు నగర మేయర్ మహంకాళి స్వామి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామగుండం నగరానికి సంబంధించిన పలు సమస్యలను ప్రస్తావించడంతో పాటు ఎం ఎల్ ఏ రాజ్ ఠాకూర్ నేతృత్వంలో ఈ దిగువ చూపబడిన సమస్యలపై మంత్రివర్యులకు వినతి పత్రం కూడా సమర్పించినట్లు మేయర్ తెలిపారు.

# అంతర్‌జిల్లా బైక్ దొంగల ముఠా అరెస్ట్

## ఐదుగురు నిందితుల అదుపులోకి..

## నాలుగు మోటార్ సైకిళ్లు స్వాధీనం : పోలీసులను అభినందించిన ఎస్పీ



**సదాశివనగర్, ఆగస్టు 8 (జనంసాక్షి):** అంతర్‌జిల్లా స్థాయిలో మోటార్ సైకిళ్లను దొంగిలించి, నకిలీ నంబర్ ప్లేట్లు అమర్చి విక్రయిస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను సదాశివనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు దొంగిలించిన బైక్‌లు, నేరాలకు ఉపయోగించిన మరో బైక్ కలిపి మొత్తం నాలుగు మోటార్ సైకిళ్లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సదాశివనగర్‌కు చెందిన హనుమంత్ రాజు బజాజ్ పల్సర్ బైక్‌ను జూలై 24న ఇంటి ముందు పార్క్ చేయగా చోరీకి గురైంది. ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఆదేశాలతో, ఎల్లారెడ్డి డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ బి. సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో, ఎస్ఐ పుష్పరాజ్ నేతృత్వంలో రెండు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. షేక్ ఇమ్రాన్, అద్నాన్ ఖాన్, సయ్యద్ జుబేర్, షేక్ అయాన్, సచిన్ విశ్వనాథ్ ఖండేవాల్ ముఠాగా ఏర్పడి హోటళ్లు, ఆసుపత్రులు, రైల్వే స్టేషన్ల వద్ద పార్క్ చేసిన బైక్‌లను టార్గెట్ చేసేవారని పోలీసులు తెలిపారు. ఇమ్రాన్, అద్నాన్‌లు బైక్‌లను దొంగిలించి జుబేర్, అయాన్, సచిన్‌లకు తక్కువ ధరకు విక్రయించేవారు. వారు అసలు నంబర్ ప్లేట్లు తొలగించి నకిలీ ప్లేట్లు అమర్చి విక్రయించేందుకు ప్రయత్నించేవారు. హనుమంత్ రాజు పల్సర్‌ను రూ.7 వేలకు సచిన్‌కు విక్రయించి, అతను ఎంహెచ్-26-సిబి-1576 నకిలీ నంబర్ ప్లేట్ అమర్చినట్లు గుర్తించారు. పద్మాజీవాడి ఎక్స్‌రోడ్ బ్రిడ్జి వద్ద నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముఠాను ఛేదించిన ఎల్లారెడ్డి డీఎస్పీ, సీఐ బి. సంతోష్ కుమార్, ఎస్ఐ పుష్పరాజ్, ఎండీ అజహర్ ఫరూక్, ఏఆర్‌పీసీ శంకర్, సీసీఎస్ టీమ్ సభ్యులు రవి, గణపతిలను ఎస్పీ యం. రాజేష్ చంద్ర అభినందించారు.




# 400 మీటర్ల పరుగు పందెంలో ఆనందికి స్వర్ణ పతకం


## జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన కమాన్‌పూర్ క్రీడాకారిణి నల్లవెల్లి ఆనంది

**కమాన్‌పూర్, ఆగస్టు 8, (జనంసాక్షి) :** హనుమకొండలోని జేఎన్ఎం స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన ఐదో తెలంగాణ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్లో కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి ఆనంది ప్రతిభ చాటింది. 18 సంవత్సరాల విభాగంలో నిర్వహించిన 400 మీటర్ల పరుగు పందెంలో 56 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని స్వర్ణ పతకం సాధించింది. ఈ విజయంతో ఆనంది 21వ జాతీయ యువ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది. పంజాబ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనుంది. కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి భారతి--శంకర్ దంపతుల రెండో కుమార్తె అయిన ఆనంది ప్రస్తుతం కమాన్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. గతంలోనూ జాతీయ, రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించిన ఆమె, తాజాగా రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించి మరోసారి సత్తా చాటింది. ఆనంది జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో కమాన్‌పూర్ మండల ప్రజలు, కళాశాల అధ్యాపకులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జాతీయస్థాయిలోనూ ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి, కమాన్‌పూర్ మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నారు.

# రైతాంగ ప్రయోజనాలను కాపాడేందుకు సమిష్టిగా కృషి చేద్దాం

## జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశంలో ప్రభుత్వ సలహాదారు పోచారం, ఎమ్మెల్యేలు

## నిజామాబాద్ కలెక్టర్ భవేష్ మిశ్రా అధ్యక్షతన కొనసాగిన సమావేశం



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 08 (జనంసాక్షి) :** నిజామాబాద్ ఉమ్మడి జిల్లా రైతాంగం ప్రయోజనాలను కాపాడడమే పరమావధిగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమిష్టిగా కృషి చేద్దామని శాసన సభ్యులు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శనివారం నిజామాబాద్ కలెక్టర్ భవేష్ మిశ్రా అధ్యక్షతన జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం జరిగింది. ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డిలు విచ్చేయగా, కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వర్చువల్ విధానం ద్వారా పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలోని నిజాంసాగర్, శ్రీరాంసాగర్, సింగూరు, కౌలాస్ నాలా, పోచారం, రామడుగు తదితర జలాశయాలలో నీటి నిల్వల స్థితిగతులు, ఆయకట్టు పంటలకు సాగు నీటిని అందించే వెసులుబాటు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, పంటల వైవిధ్యీకరణకై రైతులకు అవగాహన కల్పించడం తదితర అంశాలపై చర్చించారు.ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, వివిధ జలాశయాల ద్వారా యాసంగి పంటలకు సాగు నీటిని అందించేందుకు వీలుగా ప్రతీ సంవత్సరం రబీ సీజన్ సమయంలో జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశాలు జరిగేవని గుర్తు చేశారు. అయితే ఈసారి ఎల్ నినో ప్రభావం వల్ల రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకునేందుకు వీలుగా ప్రభుత్వ సూచనల మేరకు ఖరీఫ్ సీజన్ సమయంలోనే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల మునుముందు వర్షాలు తక్కువగా కురిసే అవకాశాలు ఉన్నందున, వరి పంట విత్తుకున్న రైతులు నష్టపోకుండా అధికారులు చొరవ చూపాలన్నారు. ఇంకా పంట వేసుకోని రైతులు ఆరుతడి పంటలు, కూరగాయలు, ఆయిల్ పామ్ సాగు చేసేలా రైతు వేదికల ద్వారా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం నారు ముదిరిపోయినందున వరి నాట్లు వేసే సమయం మించిపోయిందని, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడమే మేలు చేకూరుస్తుందని అన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, నీటి పారుదల, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ, క్షేత్రస్థాయిలో రైతులకు అవసరమైన తోడ్పాటును అందించాలని హితవు పలికారు. నిజామాబాద్ కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ, ఇటీవల తుపాను ప్రభావంతో కొంతవరకు వర్షాలు కురిసినప్పటికీ, ఎల్ నినో కారణంగా ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నందున అందుబాటులో ఉన్న నీటి వనరులను ఎంతో జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇప్పటికే జిల్లాలో 3.96 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి పంట వేసుకున్నారని, కమాండ్, నాన్ కమాండ్ ఏరియాలలో ఇంకనూ 45 వేల ఎకరాల విస్తీర్ణంలో పంటలు విత్తుకోవాల్సి ఉన్నందున వరికి బదులుగా జొన్న, మొక్కజొన్న, కూరగాయలు, పప్పుదినుసులు వంటి ఆరుతడి పంటలతో పాటు ఆయిల్ పామ్ సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు.




# విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు తప్పనిసరి

## సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా విజయాలను సులభంగా సాధించవచ్చు

**కరీంనగర్ అర్బన్, ఆగస్టు 8 (జనంసాక్షి) :** విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల విస్తృతమైన అవగాహన కల్పించాలని, వాటిలో పాల్గొనేందుకు సరైన ప్రోత్సాహంతో పాటు ఉత్తేజ పరచాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, వివిఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులు ప్రతిష్టాత్మక తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు సంపాదించిన సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల చక్కటి అవగాహన ఉండడమే కాకుండా వాటిలో పాల్గొని పై చేయి సాధించాలని చెప్పారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో సాంస్కృతిక కార్యక్రమాలకు చాలా ప్రాముఖ్యత ఇస్తారని, వాటి నిర్వహణకు తోడ్పాటునందిస్తుందని వారు గుర్తు చేస్తూ, ఇటీవల కాలంలో హైదరాబాద్ లోని శ్రీ త్యాగరాజ గాన సభ వారు నిర్వహించినటువంటి కార్యక్రమంలో 12 గంటల పాటు నిర్విరామంగా కొనసాగిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో ఎం.స్నేహిత 9వ - తరగతి, అదిత్రీ - 3వ తరగతి చోటును కైవసం చేసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. విజేతలందరికీ పుష్పగుచ్ఛాలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేసి రానున్న రోజుల్లో మరిన్ని అద్భుత విజయాలను నమోదు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తాండూరులో అత్యాధునిక వైద్య సేవలకు కొత్త అధ్యాయం

**వినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ 24/7 అందుబాటులో**
**మా లక్ష్యం ప్రపంచస్థాయి వైద్యాన్ని తాండూరుకే తీసుకురావడమే..**
**వినాయక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సీఈఓ వర్య ప్రశాంతి**



**తాండూరు అగస్టు 8(జనంసాక్షి)**తాండూరు ప్రజలకు సంతోషకరమైన వార్త. ఇక అత్యాధునిక వైద్య సేవల కోసం పెద్ద నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. తాండూరులో వినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభమై, 24/7 అన్ని సేవలతో ప్రజలకు అందుబాటులో ఉందని వినాయక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సీఈఓ వర్య ప్రశాంతి వెల్లడించారు.గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా అత్యాధునిక వైద్యం అందాలని, అందుకోసమే తాండూరులో ఈ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించామన్నారు.ఆధునిక టెక్నాలజీతో అన్ని వైద్య సేవలు ఒకే చోట వినాయక హాస్పిటల్‌లో 36-స్లైస్ సిటి స్కాన్ 24 గంటల్లో రిపోర్ట్, అడ్వాన్స్‌డ్ ల్యాబ్ టెక్నాలజీ,ఎబిజీ టెస్ట్, ట్రోపోనిన్-I టెస్ట్, పిటి/ఐఎన్ ఆర్ టెస్ట్, థైరాయిడ్ ప్రొఫైల్ టెస్ట్ వంటి అన్ని కీలకమైన పరీక్షలు చేస్తున్నారు.

**గుండె సంబంధిత సమస్యలకు 2డి**

ఈసీహెచ్‌ఓ స్కానింగ్, ఈసిజీ, టిఎంటి, హోల్టర్ తో సహా కార్డియాక్ బేసిక్ టెస్టులు అందుబాటులో ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల కోసం డెడికేటెడ్ క్రిటికల్ కేర్ టీమ్, 12 అధునాతన వెంటిలేటర్లు సిద్ధంగా ఉన్నాయి. శస్త్రచికిత్సలకు ప్రత్యేక ఏర్పాట్లు. మైనర్ ఓటి నుండి మేజర్ ఓటి వరకు అన్ని రకాల జనరల్, ఎమర్జెన్సీ శస్త్రచికిత్సలు ఇక్కడ చేస్తున్నారు. అనుభవజ్ఞులైన డాక్టర్ల బృందం అధునాతన టెక్నాలజీతో చికిత్స అందిస్తుంది.

**24/7 సేవలు - అంబులెన్స్ సదుపాయం**

వినాయక హాస్పిటల్ ప్రత్యేకత ఏంటంటే 24/7 ఓపెన్. అంటే రోజులో 24 గంటలు, వారంలో 7 రోజులు అన్ని సేవలు అందుబాటులో ఉంటాయి. అత్యవసర పరిస్థితుల కోసం 24/7 అంబులెన్స్ సర్వీస్ కూడా ఉంది. సరసమైన ధరలో నాణ్యమైన చికిత్స అందించడమే వారి లక్ష్యం.మా డాక్టర్ల బృందం అనుభవజ్ఞులు. అత్యాధునిక టెక్నాలజీతో పాటు మానవత్వంతో రోగులకు సేవ చేయడం మా ధ్యేయం. సరసమైన ఖర్చుతో నాణ్యమైన చికిత్స అందించడం ద్వారా ప్రతి కుటుంబానికి భరోసా ఇవ్వాలనుకుంటున్నాం.



## ఎస్సీ బాలికల హాస్టల్ సమస్యలు పరిష్కరించి నూతన భవనం నిర్మించాలి



**చేవెళ్ల, ఆగస్టు 08 (జనంసాక్షి)** ఎస్సీ బాలికల వసతి గృహానికి నూతన భవనం నిర్మించి, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించిన ఆయన విద్యార్థులు, వార్డెన్‌తో మాట్లాడి వసతి గృహంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుత హాస్టల్ భవనం విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉందని, ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి నూతన భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

# బుల్లెట్ ట్రైన్ కొరకు ఉమ్మడి పోరాటాలు కొనసాగించాలి



**సూర్యాపేట(జనంసాక్షి):**జాతీయ రహదారి 65 వెంట బుల్లెట్ ట్రైన్ మొదటగా కేంద్ర ప్రభుత్వం శంషాబాద్ నుండి వయా సూర్యాపేట, అమరావతి, చెన్నైకి వెళ్లే విధంగా ప్రకటించి,ఆ తర్వాత జరిగిన అలైన్మెంట్ మార్పుపై గత 20 రోజులుగా సూర్యాపేట పట్టణంలో కొనసాగుతున్న ఉద్యమాలను ఉధృతం చేసేందుకు గ్రామీణ స్థాయి నుండి అన్ని వర్గాలు, సంఘాలు కలిసి రావాలని బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష కమిటీ కోరింది.శనివారం పట్టణంలోని మహావీర్ బ్యాంకెట్ హాల్ లో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సూర్యాపేట పట్టణంలో రైల్వే సాధన సమితి పేరున సాగుతున్న మరో ఉద్యమ కమిటీ కన్వీనర్ దేగల జనార్ధన్, రాచూరి ప్రతాప్ తో అఖిలపక్ష కమిటీ చర్చలు జరిపారు.రెండు సంఘాల ఉద్యమాలు కొనసాగించడం వలన ప్రజలు అయోమయంలో ఉన్నారని, ఉమ్మడిగా బుల్లెట్ ట్రైన్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కలిసికట్టుగా పోరాటాలు కొనసాగించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.ఆ దిశగా ఈ రౌండ్ టేబుల్ సమావేశాలు చర్చలు నిర్వహించారు.త్వరలో జరిగే విద్యార్థి,ఉద్యోగ, తదితర సంఘాల ఉద్యమాలలో అందరూ భాగస్వాములై పోరాటాన్ని తీసుకెళ్లాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో బుల్లెట్ ట్రైన్ సాధన సమితి అఖిలపక్ష కన్వీనర్ ప్రొఫెసర్ఆరుట్ల జానకి రెడ్డి, ముఖ్య సలహాదారు రమణాచారి, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, టీజేఎస్ రాష్ట్ర నాయకులు కుంట్ల ధర్మార్జున్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు అనుములపురి రవి,కునుకుంట్ల సైదులు, మట్టిపల్లి సైదులు,జర్నలిస్ట్ భూపతి రాములు, సట్టు నాగయ్య, ఆవుల నాగరాజు, ధనియాకుల శ్రీకాంత్, పేర్ల నాగయ్య, నల్లెడ మాధవరెడ్డి, గట్ల రమాశంకర్, బూర వెంకటేశ్వర్లు, కారింగుల ఉపేందర్, అబ్దుల్ కరీం, తండు నాగరాజు,నర్సిరెడ్డి,లతీఫ్ అఖిలపక్షాల నేతలు, సామాజికవేత్తలు పాల్గొన్నారు.

# ఐటీసీ గేటు వద్ద శ్రీరామ్ కుటుంబం ధర్నా

## మృతదేహంతో ఆందోళన



**బూర్గంపహాడ్ ఆగస్టు 08 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా : ఐటీసీ పీఎస్పీడీ కర్మాగారం గేటు వద్ద శ్రీరామ్ కుటుంబ సభ్యులు మృతదేహంతో చేపట్టిన ధర్నా శనివారం ఉద్రిక్తతకు దారితీసింది. ఐటీసీలో విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ప్రధాన రహదారిపైకి వస్తున్న సమయంలో లారీ ఢీకొనడంతో శ్రీరామ్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై తమ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతదేహాన్ని ఐటీసీ గేటు వద్ద ఉంచి ఆందోళన చేపట్టారు. కర్మాగారంలో విధులు ముగించుకుని బయటకు వచ్చిన కొద్దిసేపటికే ఐటీసీ సమీపంలో ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అగ్రిమెంట్ ప్రకారం తమ కుటుంబానికి రావాల్సిన పరిహారం, ఇతర ప్రయోజనాలపై ఐటీసీ యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని వారు కోరారు. కన్నీటితో కుటుంబ సభ్యుల నిరసన శ్రీరామ్ మృతదేహాన్ని గేటు వద్ద ఉంచి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ నిరసన తెలిపారు. తమ కుటుంబ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఐటీసీ యాజమాన్యం తక్షణమే స్పందించాలని కోరారు. న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. శ్రీరామ్ కుటుంబ సభ్యులు చేపట్టిన ధర్నాకు సారపాక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్ సంఘీభావం తెలిపారు. ఐటీసీ గేటు వద్ద ఉంచిన శ్రీరామ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# ఆషాఢ బోనాల జాతరకు కేటీఆర్‌ను ఆహ్వానించిన ఎమ్మెల్యే



**మల్కాజిగిరి (జనం సాక్షి) :** మల్కాజిగిరి నియోజకవర్గంలో నిర్వహించనున్న ఆషాఢ మాస బోనాల జాతరకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ను నియోజకవర్గ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. శనివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బోనాల ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఏటా ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఆషాఢ మాస బోనాలు, ఫలహారం బండి ఊరేగింపు విశేషాలను కేటీఆర్‌కు వివరించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఆహ్వానానికి సానుకూలంగా స్పందించిన కేటీఆర్. బోనాల జాతర, ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మేకల రాముయాదవ్, చిన్నయాదవ్, జంగరాజు, శ్రీకాంత్ యాదవ్, నజీర్ పాల్గొన్నారు.

# బడిలో బోనాల సందడి!



**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిన విద్యార్థులు**
**పోతురాజుల విన్యాసాలతో అలరించిన చిన్నారులు**

**శేరిలింగంపల్లి, ఆగస్టు 8 (జనంసాక్షి ):** గోపన్‌పల్లి ఎన్టీఆర్‌నగర్‌లోని నియో శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని విద్యార్థులకు పరిచయం చేస్తూ నిర్వహించిన ఈ వేడుకల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్, కరస్పాండెంట్ ఉమా, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు పసుపు, కుంకుమ, నైవేద్యాలతో బోనం సిద్ధం చేసి అమ్మవారికి సమర్పించారు. తెలంగాణ పండుగల విశిష్టత, బోనాల పండుగ ప్రాశస్త్యాన్ని విద్యార్థులు తమ ప్రసంగాల ద్వారా వివరించారు. సంప్రదాయ వేషధారణలో పోతురాజులుగా విద్యార్థులు చేసిన విన్యాసాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేసే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కలిసి విందులో పాల్గొని బోనాల వేడుకలను ముగించారు.

# వంగపల్లిలో ఎక్స్‌ప్రెస్ బస్ స్టాప్‌ను ఏర్పాటు చేయాలి

## రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి



**యాదగిరిగుట్ట ఆగస్ట్ 8 (జనంసాక్షి) :** వంగపల్లి గ్రామంలోకి ఎక్స్‌ప్రెస్ బస్సులను పునరుద్ధరించడంతో పాటు నూతన ఎక్స్‌ప్రెస్ బస్ స్టాప్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. గ్రామ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి గ్రామంలో ఎదురవుతున్న రవాణా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ వినతిపై స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే ఆర్టీసీ ఉన్నతాధికారులతో ఫోన్లలో మాట్లాడారు. వంగపల్లి గ్రామ ప్రజల రవాణా ఇబ్బందులను త్వరలోనే పరిష్కరిస్తామని, ఎక్స్‌ప్రెస్ బస్ స్టాప్ ఏర్పాటుకు సానుకూల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వంగపల్లి గ్రామ సర్పంచ్ వగ్గు రవళి రాణా ప్రతాప్, వార్డు సభ్యులు కళ్ళే వినోద్ కుమార్, గడ్డం విజయలక్ష్మి ప్రకాష్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేటీఆర్ చేతుల మీదుగా బోనాల పాట విడుదల



**నాంపల్లి,ఆగస్టు 08 (జనం సాక్షి) :** మండల పరిధిలోని దామెర గ్రామానికి చెందిన మండల పెద్దలు కుమార్తె ప్రణీత బోనాల పండుగ సందర్భంగా నూతనంగా చిత్రీకరించిన పాటను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటి శాఖ మంత్రి కేటీఆర్ ఈ పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రణీత అఫీషియల్ యూట్యూబ్ ఛానల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రణీతని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దామెర సహదేవ్, ఉప సర్పంచ్ కాటబోయిన శంకరయ్య, మండల పెద్దలు, గాజుల హరిబాబు, నక్క శ్రీనివాసులు, మంటిపెల్లి శివకుమార్, వల్లపు పర్వతాలు, సిరిపంగి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

# ఒక సరికొత్త అధ్యాయానికి శ్రీకారం

## శ్రీ ఇందు ఇంజనీరింగ్‌లో ఓరియెంటేషన్ ప్రోగ్రాం



**రంగారెడ్డి, ఆగస్టు 8 (జనంసాక్షి) :** శ్రీ ఇందు ఇంజనీరింగ్ కళాశాలలో 'ఓరియెంటేషన్ ప్రోగ్రాంను అత్యంత ఘనంగా నిర్వహించారు. కొత్తగా కళాశాలలో అడుగుపెట్టిన ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఈ కార్యక్రమం కొత్త అనుభవాలు, స్నేహాలు, జ్ఞానం మరెన్నో అద్భుతమైన అవకాశాలతో కూడిన విద్యా ప్రయాణానికి అంకురార్పణ చేసింది. విద్యార్థులు తమలోని సృజనాత్మకతను, ప్రతిభను గుర్తించడంతో పాటు, కొత్త సవాళ్లను స్వీకరించి తమ లక్ష్యాల వైపు ఆత్మవిశ్వాసంతో అడుగులు వేసేందుకు ఈ వేదిక ఎంతగానో దోహదపడింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఆర్ వెంకట్ రావు జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, ఆధునిక నైపుణ్యాలను పెంపొందించుకుని, భవిష్యత్తులో అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. కళాశాల సెక్రటరీ అనూప్ చక్రవర్తి, కరస్పాండెంట్ దేవీ ప్రసాద్, నూతన విద్యార్థులకు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఓరియెంటేషన్ వేడుకల్లో విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. వారు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభను చూసి కార్యక్రమానికి హాజరైన అధ్యాపకులు, తల్లిదండ్రులు వారిని అభినందించారు.

# దుండిగల్ రైతులకు అధికారుల మధ్య సమన్వయంతో అంగీకారం



**పట్టా కలిగిన భూనిర్వాసితులకు ఎకరానికి 750 గజాల భూమి పరిహారం చెల్లింపు**
**రైతు వద్ద నుంచి కొనుగోలు దారునికి ఎకరానికి 600 గజాలు భూమి పరిహారం చెల్లింపు**
**ఆర్డీవో, తాసిల్దార్ లతోపాటు దుండిగల్ గ్రామ రైతుల మధ్య అంగీకారం**

**నిజాంపేట్, జనంసాక్షి :**

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మండల పరిధిలో గతంలో సర్వే నెంబర్ 453, 454 గల అసైన్డ్ భూములను వ్యవసాయ సాగు కోసం నిరుపేద రైతులకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని, మరల తమ భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకునేందుకు భూమికి పరిహారంగా కొంత భూమిని రైతులకు ఇచ్చేందుకు అంగీకరించారు. గత రెండు సంవత్సరాల క్రితం నుంచి అధికారుల , రైతుల, నాయకుల మధ్య అందరి సమన్వయ చర్చల్లో కృషి చేశారు.

అందులో భాగంగా అనేక దఫాలుగా గ్రామ సభలు నిర్వహించి రైతులను ఒప్పించేందుకు అధికారుల ప్రయత్నం తోఎట్టకేలకు దుండిగల్ గ్రామ రైతులు వారిచ్చే భూమి అంగీకారంతో అధికారుల నాయకుల చర్చల్లో ఆమోదం తెలిపారు. శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి ఆర్డీవో శ్యాం ప్రసాద్, దుండిగల్ మండల తహసిల్దార్ రాజేశ్వర్ రెడ్డి ల నేతృత్వంలో దుండిగల్ గ్రామ వాడు కార్యాలయంలో సమావేశం నిర్వహించగా రైతులు, నాయకుల అధికారుల సమావేశంలో చర్చల్లో భాగంగా రైతులు తమ పట్టా పట్టా భూమికి ఎకరాకి 750 గజాలు చొప్పున ఇవ్వడానికి అధికారులు ఆమోదం తెలిపారు, అలాగే రైతుల పట్టాదారుని వద్ద కొనుగోలు చేసిన వారికి ఎకరాకి 600 చొప్పున ఇవ్వడానికి ఇరువురి మధ్య అంగీకారానికి రైతులు ఆమోదం తెలిపారు.

ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ క్యాంపెనింగ్ సభ్యులు లద్ధిపీర్ల నర్సింగ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఉపాధ్యక్షులు ముత్యం రెడ్డి, జిల్లా అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, శశి కుమార్, కొత్తపేట శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షుడు చిన్నంగి వెంకటేష్, రైతులు బొల్లి వెంకటేష్, పిట్ల వీరస్వామి, బండారి నర్సింగ్, లైన్ జనార్ధన్, ఆర్. మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ మూసీ సరోవర్ ప్రాజెక్టుపై ఎమ్మెల్యేకు రైతుల విజ్ఞప్తి



**రాజేంద్రనగర్, ఆగస్టు8 (జనంసాక్షి) :** మహాత్మా గాంధీ మూసీ సరోవర్ ప్రాజెక్టులో భాగంగా తమ భూములు కోల్పోతున్న రైతులు ఎమ్మెల్యేను కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. హైదర్‌గూడకు చెందిన రైతులు గుమ్మడి పెంటారెడ్డి, గుమ్మడి హనుమంతరెడ్డి, సుభాష్‌రెడ్డి, మొండ్ర కొమురయ్య, మొండ్ర నరసింహ ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి తమ సమస్యను వివరించారు. భూములు కోల్పోతున్నందుకు ప్రస్తుత మార్కెట్ ధరకు అనుగుణంగా ఎకరాకు సరైన నష్టపరిహారం అందించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కలెక్టర్‌తో మాట్లాడగా, ఈ నెల 25న జరిగే సమావేశంలో డిప్యూటీ సీఎం, క్యాబినెట్ మంత్రుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో హైదర్‌గూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామా ఇంద్రపాల్‌రెడ్డి, నాయకులు చాకలి నర్సింగ్ పాల్గొన్నారు.

# 9 వాహన చోరీ కేసులో బాల నేరస్థుడు అరెస్ట్

## ఛేదించిన ఆర్జీఐఏ పోలీసులు



**శంషాబాద్,ఆగస్టు8(జనంసాక్షి) :** వరుస వాహన చోరీ కేసుల్లో ఓ బాల నేరస్థున్ని అదుపులోనికి తీసుకొని, ఆర్జీఐఏ పోలీసులు కేసును ఛేదించారు. ఏసిపి శ్రీకాంత్ గౌడ్ తెలిపిన ప్రకారం హైదరాబాద్ లోని పలు పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతూ ఇంట్లోనే ఉంటున్న బాల నేరస్థుడిని అదుపులోకి తీసుకుని, సుమారు రూ.5 లక్షల విలువైన చోరీ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన జె. అభిరానందన్ (15), నిందితుడిగా గుర్తించారు.విచారణలో ఆర్జీఐఏ, గచ్చిబౌలి, టప్పాచబుత్రా, పంజాగుట్ట, జూబ్లీహిల్స్, టోలిచౌకి, ఎస్ఆర్‌నగర్, ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన మొత్తం 9 వాహన చోరీ కేసుల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. జువెనైల్ జస్టిస్ చట్టం ప్రకారం తదుపరి చర్యలు చేపట్టినట్లు ఆర్జీఐఏ పోలీసులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ వి. సంజీవ్, డిఐ పవన్ కుమార్, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.



# 15 రోజులుగా కనిపించని వికలాంగుడు అఖిల్

## తల్లి ఒడికి చేర్చిన జవహర్‌నగర్ పోలీసులు

**జవహర్‌నగర్, ఆగస్టు 8 (జనంసాక్షి):** 15 రోజులుగా కనిపించకుండా పోయిన 24 ఏళ్ల దివ్యాంగుడు అఖిల్‌ను జవహర్‌నగర్ పోలీసులు ఎట్టకేలకు గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. తమ కుమారుడు క్షేమంగా తిరిగి రావడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌లో నివాసం ఉంటున్న అఖిల్ గత నెల 26వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అఖిల్ ఆచూకీ కోసం ప్రత్యేక దృష్టి సారించారు. అఖిల్‌కు తన పేరు, చిరునామా, తల్లిదండ్రుల ఫోన్ నంబర్ చెప్పే పరిస్థితి లేకపోవడంతో అతని ఆచూకీ కనుగొనడం పోలీసులకు సవాల్‌గా మారింది. ఈ విషయంపై పలు వార్తా పత్రికలు, టీవీ చానళ్లలో కథనాలు రావడంతో జవహర్‌నగర్ ఠాణా సీఐ సైదులు స్పందించి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. పోలీసులు అంబేద్కర్‌నగర్ నుంచి బోయిన్‌పల్లి వరకు సుమారు 100కు పైగా సీసీ కెమెరాలను పరిశీలించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా అఖిల్ ఆ ప్రాంతాల్లోనే సంచరిస్తున్నట్లు గుర్తించి అతని కోసం నిరంతరం గాలింపు చేపట్టారు. పోలీసులు మరోవైపు మున్సిపల్ సిబ్బందికి అఖిల్ వివరాలను అందించి అప్రమత్తం చేశారు. శనివారం ఉదయం బాలానగర్ ప్రాంతంలో ఓ వ్యక్తి అఖిల్‌ను గుర్తించి జవహర్‌నగర్ పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందిన వెంటనే సీఐ సైదులు ప్రత్యేక బృందాన్ని బాలానగర్‌కు పంపించారు. పోలీసులు అక్కడికి చేరుకుని అఖిల్‌ను గుర్తించి, అతనికి దుస్తులు అందించి సురక్షితంగా జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. తల్లిదండ్రులను పిలిపించి అఖిల్‌ను వారికి అప్పగించారు. కుమారుడిని క్షేమంగా చూసిన తల్లిదండ్రులు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తమ బిడ్డ ఆచూకీ కనుగొని తిరిగి తమకు అప్పగించిన జవహర్‌నగర్ పోలీసు అధికారులు, సిబ్బందికి, అలాగే అఖిల్ ఆచూకీ కోసం కథనాలు ప్రచురించిన మీడియా ప్రతినిధులకు వారు పేరు పేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళలు ఓటు వేసే స్థాయి నుంచి
# నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగాలి

**తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క**

**ఢిల్లీలో యూత్ కాంగ్రెస్ నారీ శక్తి అభియాన్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క**




**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** మహిళలు కేవలం ఓటర్లుగా కాకుండా.. దేశ భవిష్యత్తును నిర్ణయించే నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఢిల్లీలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నారీ శక్తి అభియాన్ శిక్షణ కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజకీయాల్లో మహిళల పాత్ర, మహిళా సాధికారత, ప్రజాస్వామ్యంలో మహిళల భాగస్వామ్యం, ఆన్‌లైన్ యుగంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లపై ఆమె కీలక ఉపన్యాసం చేశారు. మహిళల అభివృద్ధి లేకుండా దేశ అభివృద్ధి సాధ్యం కాదని సీతక్క అన్నారు. మహిళల హక్కులు, సమాన అవకాశాలు, రాజకీయ భాగస్వామ్యం కోసం కాంగ్రెస్ పార్టీ చారిత్రకంగా పోరాడిందని తెలిపారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం కేవలం సంక్షేమ కార్యక్రమం కాదని.. అది సామాజిక న్యాయానికి, ప్రజాస్వామ్యానికి పునాది అని అన్నారు. దేశంలో మహిళల రాజకీయ ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. మహిళలకు ఓటు హక్కు రావడంతోనే సమానత్వం పూర్తికాదని.. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం, విధాన నిర్ణయాల్లో భాగస్వామ్యం, ప్రభుత్వాలను నడిపించే అవకాశం కూడా సమానంగా ఉండాలని అన్నారు. మహిళలు రాజకీయాల్లోకి వస్తే వారి దృష్టి కేవలం రోడ్లు, భవనాలపై మాత్రమే ఉండదని సీతక్క అన్నారు. పిల్లల విద్య, తల్లుల ఆరోగ్యం, తాగునీరు, అంగన్‌వాడీ కేంద్రాలు, పోషకాహారం, గ్రామీణ జీవనోపాధులు, మహిళల ఆర్థిక స్వావలంబన వంటి అంశాలకు మహిళా నాయకత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఆన్‌లైన్ యుగంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లపై మంత్రి సీతక్క తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు ప్రజా సమస్యలను లేవనెత్తినప్పుడు వారి వాదనలకు సమాధానం చెప్పకుండా వ్యక్తిగత దూషణలు, ట్రోలింగ్, అసభ్యకర వ్యాఖ్యలు, తప్పుడు ప్రచారం, మార్ఫింగ్, బెదిరింపులకు పాల్పడటం ఆందోళనకరమని అన్నారు. మహిళలు భయపడకుండా మాట్లాడాలి.. ధైర్యంగా ఎన్నికల్లో పోటీ చేయాలి.. నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగాలి. మహిళలను బలోపేతం చేయడం అంటే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమేనని మంత్రి సీతక్క అన్నారు.

# పోలీసులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

**రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్**

- 4వ బెటాలియన్‌ను సందర్శించిన తెలంగాణ డీజీపీ




**వరంగల్ బ్యూరో, ఆగస్టు 08 (జనం సాక్షి) :** ప్రజల విశ్వాసాన్ని పెంపొందించేలా పోలీసు సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ 4వ బెటాలియన్‌ను సందర్శించారు. బెటాలియన్‌కు చేరుకున్న డీజీపీ కి కమాండెంట్ డి. శివ ప్రసాద్ రెడ్డి పుష్పగుచ్ఛంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం బెటాలియన్ పోలీసు సిబ్బంది డీజీపీ కి గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంకి బెటాలియన్స్ అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్ హాజరైనారు. అనంతరం డీజీపీ సి.వి. ఆనంద్ బెటాలియన్ పోలీసు అధికారులతో ముఖాముఖిగా సమావేశమై వారి విధులు, సంక్షేమం మరియు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అంకితభావంతో, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం డీజీపీ బెటాలియన్ ఆవరణలో మొక్కను నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. బెటాలియన్ ప్రాంగణంలో మరిన్ని మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా డీజీపీ బెటాలియన్‌లోని ఎస్డిఆర్ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) సిబ్బంది ఏర్పాటు చేసిన పరికరాల ప్రదర్శనను తిలకించారు. వరదలు, ప్రమాదాలు, నీట మునకలు, ప్రకృతి విపత్తుల సమయంలో ఉపయోగించే రెస్క్యూ పరికరాలు, సాంకేతిక సామగ్రి పనితీరును ఎస్డిఆర్ఎఫ్ సిబ్బంది డీజీపీ గారికి వివరించారు. విపత్తు పరిస్థితుల్లో బాధితులను సురక్షితంగా రక్షించేందుకు ఎస్డిఆర్ఎఫ్ సిబ్బంది అనుసరించే విధానాలు, సమన్వయం, రక్షణ పరికరాల వినియోగాన్ని ఆయన పరిశీలించారు. ఎస్డిఆర్ఎఫ్ సిబ్బంది చూపిన నైపుణ్యాన్ని డీజీపీ అభినందించారు. బెటాలియన్ పోలీసింగ్‌ను మరింత పటిష్టం చేసేందుకు నిరంతర శిక్షణ, వృత్తి నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం, సమన్వయాన్ని పెంపొందించుకోవాలని డీజీపీ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేలా సిబ్బంది ఎల్లప్పుడూ సన్నద్ధంగా ఉండాలని, ముఖ్యంగా విపత్తు నిర్వహణలో ఎస్డిఆర్ఎఫ్ సామర్థ్యాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. బెటాలియన్ ఆడిటోరియంలో సమావేశమైనారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, శిక్షణ, వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుని బెటాలియన్ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలి' అని అన్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్స్ బాలయ్య,వీరన్న, రాజేందర్ ఆర్ఐలు కార్తీక్,విజయ్, రవి, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, కృష్ణ పోలీసు అధికారులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కోళ్లపందేలు ఆడుతున్న ముగ్గురు అరెస్టు



**మక్తల్, ఆగస్టు 8 (జనంసాక్షి) :** మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్యాల గ్రామ శివారులో అక్రమంగా కోళ్ల పందేలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను మక్తల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పి పి. రాజు తెలిపారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు చిట్యాల గ్రామ శివారులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోళ్ల పందేలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి నుంచి 5 పందెం కోళ్లు, 2 మొబైల్ ఫోన్లు, 6 ద్విచక్ర వాహనాలు, రూ.4,150 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పి పి. రాజు మాట్లాడుతూ అక్రమంగా కోళ్ల పందేలు నిర్వహించడం ద్వారా ప్రజలను జూదం వైపు ప్రోత్సహించడమే కాకుండా శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉంది. ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నాం అని తెలిపారు. చట్టవిరుద్ధంగా కోళ్ల పందేలు, జూదం లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని ఎస్పి కోరారు.

## చనిపోయిన ఏడాది తరవాత అస్తిపంజరం గుర్తింపు

- ఒంటరి మహిళ మృతిని గుర్తించని బంధువులు

**బెంగళూరు, ఆగస్ట్8 (జనంసాక్షి) :** ఓ డూప్లెక్స్ ఇంట్లో మహిళ అస్థిపంజరం వెలుగుచూసిన సంఘటన కర్ణాటకలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరులోని బాగలగుంటే ఏరియాకు చెందిన 52 ఏళ్ల దాక్షాయణి హవనూర్ లేఅవుట్‌లోని డూప్లెక్స్ ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఆమె భర్త ఉమేష్ 10 సంవత్సరాల క్రితం యాక్సిడెంట్‌లో చనిపోయాడు. కుమారుడు క్యాన్సర్‌తో ప్రాణాలు కోల్పోయాడు. దాక్షాయణికి ఓ కూతురు ఉంది. ఆమెకు చాలా కాలం క్రితమే పెళ్లైంది. ఒంటరిగా ఉంటున్న దాక్షాయణి సంవత్సరం క్రితం చనిపోయింది. ఈ ఏడాది కాలంలో కూతురు, అల్లుడు ఆ ఇంటికి రాకపోవటంతో దాక్షాయణి చనిపోయిన సంగతి బయటపడలేదు. సమాచారం అందుకున్న బాగలగుంటే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అస్థిపంజరాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మహిళ మరణానికి గల కచ్చితమైన కారణాలు తెలుసుకునే పనిలో పడ్డారు. అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తున్నారు.

# లోయలో పడ్డ బొలెరో వాహనం

- ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు దుర్మరణం

**నైనిటాల్, ఆగస్ట్8 (జనంసాక్షి) :** ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బొలెరో వాహనం లోయలో పడ్డ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దేవ్‌ప్రయాగ్ నుంచి పౌరీ వెళుతున్న బొలెరో వాహనం శుక్రవారం సాయంత్రం సబ్దర్‌ఖల్ వద్ద ప్రమాదానికి గురైంది. రోడ్డు పక్క ఉన్న లోయలో పడిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే దేవ్‌ప్రయాగ్ పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బొలెరోలో ఒకే కుటుంబానికి చెందిన 7 మంది ఉన్నారు. వాహనం లోయలో పడగానే తీవ్ర గాయాలపాలై ఐదుగురు అక్కడికక్కడే చనిపోయారు. తీవ్రంగా గాయపడ్డ మరో ఇద్దరిని సహాయక సిబ్బంది దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.

# ఫీజు కోసం వేధింపులు.. విద్యార్థి ఆత్మహత్య

**కాకినాడ, ఆగస్ట్ 8 (జనంసాక్షి) :** స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాల సిబ్బంది వ్యాఖ్యలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ ఇంటర్ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాకినాడ జగన్నాథపురంలోని జె.రామారావుపేట సమ్మెటవారి వీధికి చెందిన పైలా రాంబాబు, జ్యోతి దంపతుల రెండో కుమారుడు పైలా అరవింద్ (15) స్థానికంగా ఉన్న శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. శుక్రవారం అరవింద్, అతడి తండ్రి మొదటి టర్మ్ ఫీజు కట్టేందుకు కళాశాలకు వెళ్లినప్పుడు.. చాలామంది సెకండ్ టర్మ్ కూడా కట్టేశారని, మీరు ఇంకా మొదటి టర్మ్ ఫీజే కట్టలేదని సిబ్బంది అనడంతో వారు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. శుక్రవారం రాత్రి ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో అరవింద్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# జూరాల నీటిని పొదుపుగా వినియోగించాలి

- వరి సాగుకు బదులు ఆరుతడి పంటలు సాగు చేయాలి: సీఈ రహీముద్దీన్
- వరద ప్రవాహం ఉన్నంతవరకే ఎత్తిపోతల పథకాలకు నీటి పంపింగ్





**వనపర్తి బ్యూరో /శ్రీరంగాపూర్, ఆగస్టు 8 (జనంసాక్షి) :** జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం ప్రారంభమైన జూలై 27వ తేదీ నుంచే జూరాలపై ఆధారపడిన నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలకు పంపింగ్ ప్రారంభించినట్లు వనపర్తి నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ మొహమ్మద్ రహీముద్దీన్ తెలిపారు. జూరాల కెనాల్స్‌కు జూలై 29న నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం వరద ప్రవాహం కొనసాగుతున్నంతకాలం ఎటువంటి ఆటంకం లేకుండా నీటి విడుదల, పంపింగ్ కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు జూరాల నుంచి నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలకు కలిపి 5.4 టీఎంసీల నీటిని పంపింగ్ చేసినట్లు సీఈ వెల్లడించారు. నెట్టెంపాడు ప్రాజెక్టులో 750 క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన నాలుగు పంపులు ఉండగా, మొత్తం 3,000 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే సామర్థ్యం ఉందన్నారు. అయితే రేలంపాడు రిజర్వాయర్ లీకేజీ సమస్య కారణంగా సుమారు 2 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేసుకునే అవకాశం ఉందని, గూడెం దొడ్డి రిజర్వాయర్ సామర్థ్యం కూడా ఒక టీఎంసీ మాత్రమేనని తెలిపారు. దీంతో గత ఐదేళ్లుగా రెండు పంపులను మాత్రమే వినియోగిస్తున్నట్లు చెప్పారు. ప్రారంభంలో రెండు పంపులు నడిపామని, రిజర్వాయర్ నిండిన నేపథ్యంలో ప్రస్తుతం నీటి విడుదలను అనుసరించి ఒక పంపును నడుపుతున్నట్లు వివరిం చారు. భీమా ప్రాజెక్టు స్టేజ్-2లో తిరుమలాయపల్లి వద్ద 750 క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన మూడు పంపులు ఉన్నాయని, వీటిలో రెండు వినియోగానికి, ఒకటి స్టాండ్‌బైగా ఉన్నాయని తెలిపారు. రెండు పంపుల ద్వారా 1,500 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేయవచ్చన్నారు. అయితే శంకసముద్రం రిజర్వాయర్ పూర్తికాకపోవడం, ఏనుకుంట రిజర్వాయర్ సామర్థ్యం కేవలం 0.1 టీఎంసీ ఉండటంతో మొదటి నుంచీ ఒక పంపును మాత్రమే నడుపుతున్నట్లు తెలిపారు. భీమా స్టేజ్-2 కొత్తకోట వద్ద 318 క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన మూడు పంపులు ఉండగా, ఒకటి స్టాండ్‌బైగా, రెండు వినియోగంలో ఉన్నాయని చెప్పారు. రిజర్వాయర్ల సామర్థ్యం, నీటి నిల్వ, విడుదల పరిస్థితులను బట్టి అవసరానికి అనుగుణంగా పంపులను నడుపుతున్నట్లు సీఈ స్పష్టం చేశారు.

### వరి సాగుకు దూరంగా ఉండాలి

ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగు చేయకుండా ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని సీఈ రహీముద్దీన్ సూచించారు. రాబోయే రోజుల్లో జూరాల నుంచి నీటి విడుదల ప్రధానంగా వరద ప్రవాహంపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రాబోయే రోజుల్లో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున రైతులు పరిస్థితిని దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. రాబోయే రోజుల్లో నీటిని చెరువులు నింపుకోవడానికి, తాగునీటి అవసరాలకు అందుబాటులో ఉంచాల్సి ఉన్నందున నీటిని పొదుపుగా వినియోగించాలని రైతులు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# బీసీల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలి

**క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంగా దిశగా ప్రత్యేక కార్యాచరణ పై బీసీ ముఖ్య నేతల సమావేశంలో చర్చ**



**హైదరాబాద్ ఆగస్టు 08 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో బీసీ మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. బీసీల సమస్యలు, సంక్షేమ కార్యక్రమాల అమలు, రాబోయే విగ్రహావిష్కరణ కార్యక్రమాలు, బీసీ వర్గాల అభ్యున్నతికి తీసుకోవాల్సిన తదుపరి కార్యాచరణపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో హైదరాబాద్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ పక్కన ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఈ నెల 14న ప్రారంభించేందుకు నిర్ణయించారు. అలాగే ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాలను ఈ నెల 18న ప్రారంభించే కార్యక్రమంపై చర్చించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు కలిసి ఆహ్వానించాలని సమావేశంలో నిర్ణయించారు. ముఖ్యమంత్రిని కలిసి బీసీ వర్గాల సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా చర్చించాలని నిర్ణయించారు.

### పూలే దంపతుల విగ్రహావిష్కరణ సభను ఘనంగా నిర్వహించాలి

మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు, బీసీ కుల సంఘాల ప్రతినిధులు, బీసీ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సమావేశం పిలుపునిచ్చింది. పూలే దంపతుల ఆశయాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు.

### బీసీ కులగణనపై తదుపరి కార్యాచరణ

రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టినప్పటికీ, బీసీ వర్గాల ఆకాంక్షలు, లక్ష్యాలు పూర్తిస్థాయిలో నెరవేరలేదనే అభిప్రాయంతో తదుపరి కార్యాచరణపై ఐక్యంగా ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతికి బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి తగిన నిధులు కేటాయించే అంశంపై కృషి చేయాలని నిర్ణయించారు. అలాగే బీసీ కమిషన్‌ను మరింత బలోపేతం చేసి, బీసీల సమస్యల పరిష్కారంలో కమిషన్‌కు అవసరమైన సహకారం అందించాలని చర్చించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రజా పాలన ప్రభుత్వం కొనసాగిస్తోందని సమావేశంలో పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడతల వారీగా విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. బీసీ వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా బీసీ సంక్షేమ శాఖకు అవసరమైన నిధులు కేటాయించి, సంక్షేమం, ఉపాధి, ఆర్థిక సాధికారతకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.

### ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి వేగం

రాష్ట్రంలోని వివిధ బీసీ కుల సంఘాలకు సంబంధించిన ఆత్మగౌరవ భవనాలకు సాధ్యమైనంత త్వరగా నిధులు కేటాయించి, నిర్మాణ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. అదేవిధంగా క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని నాయకులు నిర్ణయించారు. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రంలోని బీసీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఐక్యంగా ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, నవీన్ యాదవ్, ఈర్లపల్లి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు. పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ జూమ్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

## మారిన తిరుపతి-కరీంనగర్ బైవీక్లీ టైమ్

- తిరుపతిలో 15 నిముషాలు ముందుకు జరిగిన సమయం

**కరీంనగర్, ఆగస్ట్8 (జనంసాక్షి) :** ప్రయాణికుల సౌకర్యార్థం తిరుపతి-కరీంనగర్ బైవీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (రైలు నం. 12761) బయలుదేరే సమయాన్ని దక్షిణ మధ్య రైల్వే అధికారులు సవరించారు. ప్రస్తుతం ప్రతీ బుధ, శనివారాల్లో తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి రాత్రి 8:05 గంటలకు బయలుదేరుతున్న ఈ రైలు, అక్టోబరు 10 నుంచి రాత్రి 7:50 గంటలకు బయలుదేరనుంది. అంటే ప్రస్తుతం ఉన్న సమయంతో పోలిస్తే 15 నిమి షాల ముందుగా ప్రారంభమవుతుంది. గూడూరు, విజయవాడ, వరంగల్, పెద్దపల్లి మార్గం మీదుగా కరీంనగర్‌కు చేరే ఈ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరే సమయ మార్పునకు సంబంధించి దక్షిణ మధ్య రైల్వే జోన్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పును ప్రయాణికులు గమనించి, తమ ప్రయాణ ప్రణాళికలను అందుకు అనుగుణంగా మార్చుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

## కన్నకూతురుపైనే కామాంధుడి లైంగిక దాడి

- కూతురు ఫిర్యాదుతో పోలీసుల అరెస్ట్

**హైదరాబాద్, ఆగస్ట్8 (జనంసాక్షి) :** కన్న తండ్రి క్రూర మృగంలా మారాడు. కంటికి రెప్పలా కాపాడాల్సిన వాడే పశువులా మారిపోయాడు. కన్న కూతురిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ అమానీవయ ఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు(45) తన భార్య ముగ్గురు కూతుళ్లతో కలిసి సనత్‌నగర్‌లో హౌస్‌కీపింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మద్యానికి బానిసై తరచూ భార్యా బిడ్డలతో గొడవలు పెట్టుకునేవాడని సమాచారం. కాగా, మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి తన రెండో కూతురిపై కన్నేసి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో వరుసగా ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. కుటుంబం పరువు పోతుందని విషయం బయటకు రాకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్త పడ్డారు. కానీ తండ్రి అరాచకాలు ఆగకపోవడంతో, ఓపిక నశించిన బాలిక సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించింది. దీంతో బాలిక తండ్రిపై పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు.

## కార్మికుడి మృతదేహంతో ఆందోళన

**బూర్గంపహాడ్, ఆగస్ట్8 (జనంసాక్షి) :** లారీ ప్రమాదంలో మృతి చెందిన ఐటీసీపీఎస్పీడీ కర్మాగారం కాంట్రాక్టు కార్మికుడు గుగులోత్ శ్రీరామ్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం ఐటీసీ గేటు వద్ద ఆందోళనకు దిగారు. విధులు ముగించుకుని వాహనంపై ఇంటికి వస్తున్న సమయంలో ఐటీసీ సమీపంలో లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొని అక్కడికక్కడే శ్రీరామ్ మృతిచెందాడు. యాజమాన్యం నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని మృతదేహంతో ఆందోళన చేపట్టారు. ఈ సంఘటన విషయం తెలుసుకున్న సర్పంచ్ గుగులోత్ కిషోర్నాయక్ ఐటీసీ గేటు వద్ద శ్రీరామ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబానికి అండగా ఉంటానని, ఐటీసీ యాజమాన్యం న్యాయం చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## కళాశాల ప్రాంగణ నియామకాలకు విశేష స్పందన

- ఆరోబిందో ఫార్మా, హెటెరో ల్యాబ్స్‌లో ఉద్యోగావకాశాల కోసం విద్యార్థులకు ఇంటర్వ్యూలు
- వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో ప్లేస్మెంట్ డ్రైవ్



**వరంగల్ ఈస్ట్, ఆగస్టు 08 (జనం సాక్షి) :** విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా బొల్లికుంటలోని వాగ్దేవి ఫార్మసీ కళాశాల, వరుసగా రెండు రోజుల పాటు పూల్ క్యాంపస్ డ్రైవ్ మరియు క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్‌లను విజయవంతంగా నిర్వహించింది. కళాశాల ప్లేసెమెంట్ సెల్ ఆధ్వర్యంలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సహకారంతో చేపట్టిన ఈ నియామక ప్రక్రియలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు నియామక ప్రక్రియకు సంబందించిన విధి విధానాలను ఉద్యోగాల జీత భత్యాలపై అవగాహన కల్పించారు. ఆగస్టు 7న ఆరోబిందో ఫార్మా సంస్థలో ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్, వేర్‌హౌస్ విభాగాల్లో ఖాళీల భర్తీ కోసం బి. ఫార్మసీ ., ఎం ఫార్మసీ తో పాటు ఇతర విద్యార్హతలు కలిగిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అదేవిధంగా మరుసటి రోజు ఆగస్టు 8న హెటెరో ల్యాబ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ లో ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్, వేర్‌హౌస్ విభాగాల్లో ఖాళీల భర్తీ కోసం బి. ఫార్మసీ, బీఎస్సీ అర్హత కలిగిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ రెండు రోజుల నియామక ప్రక్రియలో 250 కి పైగా విద్యార్థులు, ఉద్యోగార్థులు ఉత్సాహంగా పాల్గొని సంస్థ ప్రతినిధుల ముందు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఫార్మసీ రంగంలోని ప్రముఖ సంస్థలు కళాశాలలోనే నియామక ప్రక్రియ నిర్వహించడం విద్యార్థులకు మంచి కెరీర్ అవకాశాలను అందించడంతో పాటు, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వారి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు దోహదపడుతుందని కళాశాల యాజమాన్యం పేర్కొంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జి.కమల్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఔషధ పరిజ్ఞానాన్ని అందించి అత్యుత్తమ ర్యాంకులను సాధించే దిశగా విద్యాభ్యాసం అందించడంతో పాటు పాటు, వారి భవిష్యత్ ఉపాధి అవకాశాలకు కళాశాల ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలుపుతూ, ప్రముఖ ఫార్మా సంస్థలతో సమన్వయం చేసుకుంటూ కళాశాల ప్రాంగణ నియామకాలను నిర్వహించడానికి నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ ప్లేస మెంట్ డ్రైవ్ లో 54 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఈ ప్లేస్మెంట్ డ్రైవ్ విజయవంతంగా నిర్వహించడంలో ప్లేస్మెంట్ ఆఫీసర్ డా. ఆర్. శివ కుమార్, డా. బస్వరాజ్, డా. శ్రీకాంత్, డా. రాజేంద్రప్రసాద్, డా. సందీప్, శ్వేత, ఇతర అధ్యాపకులు, కీలక పాత్ర పోషించారు.

## రిజర్వాయర్ పూర్తి స్థాయి ఆయకట్టుకు సాగునీరు అందిస్తా

- స్టేషన్ ఘన్పూర్ ఎంఎల్ఏ కడియం శ్రీహరి
- రిజర్వాయర్ల నుండి ఆగస్టు 14న పంటలకు సాగు నీరు విడుదల చేస్తాం



**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 08 (జనంసాక్షి) :** ఘనపూర్ రిజర్వాయర్ పూర్తి స్థాయి ఆయకట్టు కు సాగు నీరు అందిస్తానని, 2,500 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందాలంటే కేనాల్స్ నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందని, ఏది ఏమైనా ఆగస్టు 14నుండి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని అన్ని దేవాదుల రిజర్వాయర్ల ద్వారా పంటలకు సాగు నీరు విడుదల చేసి తీరు తామని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. స్టేషన్ ఘనపూర్ రిజర్వాయర్ కుడి కాలువను నీటిపారుదల శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు నాయ కులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ఎస్సి కాలనీ నుండి వెళ్తున్న పంట కాలువను, తూమువద్ద కాలువను, పలు కాలనీలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పంట కాలువలో మురుగు నీరు చేరడం పట్ల ఎమ్మెల్యే తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మురుగు నీరు పంట కాలువలో చేరకుం డా చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశిం చారు. పంటల కాలువకు రెండు వైపులా సైడ్ వాల్స్ నిర్మాణం చేసి చివరి వరకు సాగు నీరు వెళ్లే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నీటి పారుదల శాఖ అధికారుల కు సూచించారు. ప్రస్తుతం రెండు మూడు రోజుల లో సాగునీరు అందించేందుకు వెంటనే కాలువలో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఆదేశించారు. 3 నెల లలో శాశ్వత కెనాల్ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వెల్లడించారు. మున్సిపాలిటీ డ్రైనేజి నీరు పంట కాలువలలో చేరకుండా మున్సిపల్ అధికారులు, నీటి పారుద ల శాఖ అధికారులు సమన్వయంతో డ్రైనేజిలు, వరద కాలువలు, పంట కాలువల నిర్మాణం చేయాలని ఆదేశించారు. దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా 1.5 టీఎంసిల సామర్థ్యంతో ఘనపూర్ రిజర్వాయర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ రిజర్వాయర్ కింద సుమారు 2,500 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించాల్సి ఉందని కానీ కెనాల్స్ ఆధునిక రించకపోవడం వల్ల పూర్తి స్థాయిలో సాగు నీరు అందడం లేదని తెలిపారు. రిజర్వాయర్ కింద ఉన్న 2,500 ఎకరాలకు సాగు నీరు అందాలంటే చివరి వరకు కెనాల్స్ నిర్మాణం చేయాల్సిన అవస రం ఉందని అన్నారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను నీటి పారుదల శాఖ అధికారులు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. మున్సిపాలిటీకి సంబంధించిన మురుగు నీరు పంట కాలువలలోకి రాకుండా డ్రైనేజిల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఇప్పటికే కొన్ని డ్రైనేజీ లు, వరద కాలువలకు టెండర్లు పూర్తి అయ్యాయ ని ఇంకా ఎక్కడెక్కడ డ్రైనేజి నీరు పంట కాలువ లలో కలుస్తుందో అక్కడ డ్రైనేజిల రీడిజైన్ చేయాలని తెలిపారు. అందుకు మున్సిపాలిటీ అధికారులు, నీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. రిజర్వాయర్ ఆయకట్టుకు రెండు పంటలకు సాగు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రం లో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆరుతడి పంటలే ఎండిపోయే పరిస్థితులు ఏర్ప డ్డయని అన్నారు. దింతో ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో మాట్లాడుతూ, అధికారులను సమన్వయం చేస్తూ రైతులకు సాగు నీరు అందెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. కాలువల ద్వారా వచ్చే నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నీటి పారుదల శాఖ ఎస్ఈ సీతారాం, ఈఈలు, డిఈలు, మున్సిపాలిటీ అధికారులు, కౌన్సిలర్లు, ఇతర అధికారులు, పట్టణ నాయకులు, కార్యకర్త లు తదితరులు పాల్గొన్నారు.

## పోడు భూముల సాగుకు ట్రాక్టర్లను అనుమతించాలని ఆందోళన




**ఖానాపూర్ ఆగస్టు 08 (జనం సాక్షి) :** దశాబ్దాల కాలంగా రైతులు సాగు చేసుకుంటున్నా పోడు భూముల్లో సాగుకు ట్రాక్టర్లు, డోజర్ల వాడకాన్ని అనుమతించాలని కోరుతూ సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంతా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నందిరామయ్య డిమాండ్ చేశారు. శనివారం నియోజకవర్గ కేంద్రంలోని ఆర్ అండ్ బి విశ్రాంతిభవనము నుండి అటవీ శాఖ కార్యాలయం వరకు పోడు సాగు చేస్తున్న రైతులతో ర్యాలీ నిర్వహించి మెమోరండం సమర్పించారు. ఈ సందర్భంగా నంది రామయ్య మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందిగా మారిన కనీస హక్కులను హరింపజేస్తున్న టైగర్ జోన్ వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు బెదిరింపులు, హెచ్చరికలు చేయడం సరికాదని ప్రస్తుత పరిస్థితుల్లో ట్రాక్టర్లు వాడకుండా వ్యవసాయం చేసే పరిస్థితి లేదన్న విషయాన్ని అధికారులు గమనించాలని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఆచరణకు సాధ్యం కాని నిబంధనలు పెట్టి పోడు రైతులను ఇబ్బందులను గురిచేయడం ఏమాత్రం సరికాదన్నారు. కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో ప్రజల కనీస అవసరాలు తీర్చుకోకుండా ఆంక్షలు విధించడం ఏ మాత్రం సరి కాదన్నారు. టైగర్ జోన్ వల్ల ఆదివాసి ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. ఒకరి సాగు భూమిని మరొకరికి కేటాయిస్తూ గిరిజనులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీలను అడవికి దూరం చేస్తున్న టైగర్ జోన్ వెంటనే ఎత్తివేయాలని లేని పక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం మండల నాయకులు జక్కుల రాజన్న, నూనె నర్సింగరావు, అభి యాదవ్, శంకర్, మోహన్, మనోహర్, శ్రీనివాస్, లక్ష్మణ్, జైతు, ఎర్రన్న, రాజన్న, శంభు, వర్మ, భూమేష్, శేఖర్, లాలు, దేవరావు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుద్ఘాతంతో మేకలు మృత్యువాత



**కొత్తగూడ ఆగస్టు 8 (జనంసాక్షి) :** మహబూ బాబాద్ జిల్లా కొత్తగూడ మండల పరిధిలోని ఎంచగూడెం గ్రామానికి చెందిన శెట్టి వెంకటేష్ ఇంటి ఆవరణలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు ఐరన్ కంచె అంతటా విద్యుత్ ప్రవహించింది. ఆ సమయంలో అక్కడ ఉన్న మేకలు కంచెను తాకడంతో తీవ్రమైన విద్యుత్ ఘాతానికి గురై స్థలంలోనే నాలుగు మేకలు ప్రాణాలు విడిచాయి. తమ జీవనాధారమైన మేకలు కళ్లముందే విగతజీవులుగా పడి ఉండటాన్ని చూసి బాధితుడు శెట్టి వెంకటేష్ కన్నీరుమున్నీరవుతున్నాడు. ఈ ప్రమాదం వల్ల తనకు సుమారు రూ. 60 వేల వరకు ఆర్థిక నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సదరు రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. బాధిత రైతును ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఎంచగూడెం గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సాహిత్యంలో లెజెండ్ గద్దరన్న

- గద్దర్ వర్ధంతి సభలో జన నాట్యమండలి నాయకుడు సంజీవ్




**హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 8 (జనం సాక్షి) :** జనం సమస్యలకు జనం బాషను, జనం యాసను, భౌతికవాదాన్ని జోడించి సాహిత్యంలో కొత్త ఒరవడిని సృష్టించిన గొప్ప కవి, కళాకారుడు, ప్రజా యుద్ధ నౌక గద్దర్ సాహిత్యంలో లెజెండ్ అని జననాట్యమండలి నాయకుడు సంజీవ్ అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రం ప్రెస్ క్లబ్ లో గద్దర్ గళం ఆధ్వర్యంలో విసికె పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం జరిగిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ 3 వ వర్ధంతి సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన ఆయన మాట్లాడారు. తరతరాలుగా దేశంలో జరుగుతున్న దోపిడి, దేశ భూస్వామ్య, పాలకుల దోపిడీకి ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ తోడై దోపిడి ఎలా కొనసాగిందో, ఆ దోపిబాలో చిక్కుకున్న ప్రజలు ఎలా విలవిలలాడారో గద్దర్ ప్రతి పాటలో కనపడుతుందని అన్నారు. ప్రజల అజ్ఞానం, మూఢనమ్మకాలు, పాలకుల దోపిడి, పోలీసుల ప్రవర్తనపై ప్రజల బాషలో, పలు భాషల్లో పాడి ప్రజలను చైతన్యం చేసి ప్రజా యుద్ధానికి సిద్ధం చేసిన యుద్ధ నౌక గద్దర్ ప్రపంచంలోనే గొప్పవాడని అన్నారు. గద్దర్ అజ్ఞాతంలో ఉన్నపుడు అన్న కోసం మూడు సంవత్సరాలు ఆటో నడిపి గద్దరన్నను సాధుకున్నట్లు ఆవేదనతో మాట్లాడాడు. సాంస్కృతిక ఉద్యమంలో నిర్మాణాత్మకమైన సమస్యల గురించి గద్దర్ వ్రాశాడని, సామ్రాజ్యవాదం గురించి, అమెరికా దోపిడి గురించి రచించి పాడిన గద్దర్ కార్మికుల గురించి, కర్షకుల గురించి, మహిళల గురించి, కూలీల గురించి, తల్లుల త్యాగం గురించి, విద్యార్థుల త్యాగాల గురించి ఏ వర్గాన్ని కూడా విస్మరించకుండా చైతన్యపరిచి తన జీవితాంతం పోరాటం చేశాడని అన్నారు. ఆయా వర్గాల సమస్యలపై, ప్రజల విముక్తికై గద్దరన్న పాడిన పాటలను సంజీవ్ పాడి సభను ఉత్తేజపరిచారు.

## విద్యార్థులపై విషవాయువు చిమ్ముతుండ్రు

- పాఠశాల కిందే ఎరువుల దుకాణం
- రసాయనాల వాసనతో అవస్థలు
- తరచూ అనారోగ్యం పాలవుతున్న విద్యార్థులు



**చెన్నూర్ ఆగస్టు 8 (జనంసాక్షి) :** చెన్నూర్ నియోజక వర్గ కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ సమీపంలోతెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల మూడంతస్తుల అద్దె భవనంలో కొనసాగుతోంది. భవనం గ్రౌండ్ ఫ్లోర్ను ఇంటి యజమాని ఎరువుల దుకాణానికి అద్దెకు ఇచ్చారు. దీంతో పైఅంతస్తుల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యార్థులకు ఎరువులు, క్రిమిసంహారక మందుల వాసన తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని వారు చెబుతున్నారు. రసాయనాల వాసనను భరించలేక విద్యార్థులు తరచూ చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. నిత్యం ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో చదువుకోవాల్సిన విద్యార్థులు దుర్వాసన మధ్య విద్యనభ్యసించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలను సురక్షితమైన భవనంలోకి మార్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థుల గోసను గుర్తించి గతంలో నోటీసులు జారీ చేసిన మాజీ మండల వ్యవసాయ అధికారి కవిత ఇప్పుడున్న అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## భూపాలపల్లిలో బీఆర్ఎస్ యూత్ వినూత్న నిరసన



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సుభాష్ కాలనీలో రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంపై బీఆర్ఎస్ యూత్ విభాగం శనివారం వినూత్న నిరసన చేపట్టింది. బీఆర్ఎస్ అర్బన్ యూత్ ప్రధాన కార్యదర్శి మహేందర్ యాదవ్ నేతృత్వంలో నిరసనకారులు రోడ్డుపై ఉన్న వర్షపు నీటి గుంతల్లో చేపల వలలు, గాలాలు వేసి నిరసన తెలిపారు. పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు, కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతూ నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ మంజుల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ ముంజంపల్లి మురళీధర్, యూత్ నాయకులు పాల్గొన్నారు.

## అదుపు తప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు

- బస్సులో ఉన్న 20 మంది ప్రయాణికులు సురక్షితం




**మహదేవపూర్, ఆగస్టు 8 (జనంసాక్షి):** మహదేవపూర్ మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి టెంపుల్ వద్ద ప్రధాన జాతీయ రహదారిపై ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు అదుపుతప్పిచెట్ల పొదల్లోకి దూసుకువెళ్లడం జరిగింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న 20మంది ప్రయాణికులు సురక్షితంగా బయట పడడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు అదుపుతప్పడంతో ప్రయాణికులు ఒక్కసారిగా బయందోళనకు గురికావడం జరిగింది. వరంగల్ నుంచి కాలేశ్వరం వైపు ప్రయాణికులతో వస్తున్న ఎలక్ట్రికల్ ఆర్టీసీ బస్సు మహదేవపూర్ అయ్యప్ప స్వామి టెంపుల్ వద్ద జాతీయ రహదారిపై చేరుకోగానే సాంకేతిక సమస్య వల్ల బస్సు అదుపుతప్పి రహదారి పక్కకు చెట్ల పొదల్లోకి కదూసుకువెళ్లడం జరిగింది. అలాగే వరంగల్ నుండి కాళేశ్వరం వరకువాహనాలరాకపోకులను దృష్టిలో పెట్టుకొని రహదారి పరిస్థితిని సంబంధిత అధికారులు పరిశీలించి రహదారిపై ఏర్పడిన గాడీలను వెంటనేపూడ్చిమరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు. అయ్యప్ప స్వామి టెంపుల్ ఈ జాతీయ రహదారిపై గాడీలు అధికంగా కావడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామ ప్రజలు అనుకుంటున్నారు.

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిన చిన్నారుల ప్రదర్శనలు



**హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 8 (జనం సాక్షి) :** హన్మకొండ జిల్లా గోపాలపూర్‌లోని క్యాంబ్రిడ్జ్ మాంటిస్సోరి ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలు ఎత్తుకుని, పోతరాజుల వేషధారణతో ఆకట్టుకున్నారు. గ్రామదేవతల అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు ప్రదర్శించిన తెలంగాణ సంప్రదాయ నృత్యాలు, పాటలు, స్కిట్లు ప్రేక్షకులను అలరించాయి. విద్యార్థుల ఉత్సాహభరిత ప్రదర్శనలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణ ఇలి, కరస్పాండెంట్ శ్రావణి టాబేటి, హెడ్‌మాస్టర్ జెన్నిఫర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు చిన్నారుల్లో సంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారి సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దివ్య, హెప్సిబా, శ్రావణి, మౌనిక, సమ్రీన్, ఆయేషా, కావ్య, స్వాతితో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారుల బోనాల వేడుకలతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది.

## సోమేశ్వరాలయానికి వెండి కిరీటం బహూకరణ



**పాలకుర్తి, ఆగస్టు 08 (జనంసాక్షి) :** సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం, స్వయంభు. శ్రీ చండికా సమేత సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ఓ భక్తుడు వెండి కిరీటం అందచేశారు. శనివారం హైదరాబాద్ కు చెందిన భక్తుడు, ప్రపంచ ఆర్యవైశ్య మహసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్ గుప్త కుటుంబ సభ్యులు సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మనవడు శీల నాగరాజు-మంజుల దంపతులు ఆలయానికి సుమారు 45 వేల విలువగల 177 గ్రాముల మిశ్రమ వెండి కిరీటాన్ని స్వామివారికి బహూకరించినట్లు ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు డీ.వీ.ఆర్ శర్మ, అనిల్ శర్మ, కుటుంబ సభ్యులు నాగరాజు, మణికంఠ, మంజులత పాల్గొన్నారు.


## దర్జాగా శునక రాజు..



**వరంగల్ ఈస్ట్, ఆగస్టు 08( జనం సాక్షి) :** ప్రయాణికులకే కాదు మాక్కూడా బస్టాండ్ లో హక్కు ఉన్నదన్నంత దర్జాగా శునకాలు ప్రయాణికులు కూసునే గద్దెలపై ప్రయాణికుల పక్కనే కూర్చున్న దృశ్యం హనుమకొండ బస్టాండ్ లో శనివారం ఉదయం కనిపించింది. పక్కన కూర్చున్న ఒక మహిళ పై ఆ శునకం గుర్రు మంటూ బెదిరించిన పరిస్థితి కూడా కనిపించింది. ఇది ఒక్క శునకమే కాదు బస్టాండ్ లో ప్రయాణికుల మధ్య నిత్యం శునకాలు తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేస్తు దాడులకు పాల్పడుతున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు. ఈమధ్య కుక్కకాటుకు గురై చాలామంది హాస్పిటల్ కి వెళ్లి చికిత్స చేయించుకుంటున్న పరిస్థితి కనిపిస్తుంది. ఇప్పటికైనా సంబంధిత బస్టాండ్ నిర్వాహకులు శునకాల బారిన ప్రయాణికులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరికలు

- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన తీన్మార్ మల్లన్న



**తొర్రూరు, ఆగస్టు 08 (జనం సాక్షి):** తొర్రూరు మండలంలోని వెలికట్ట గ్రామానికి చెందిన బిఆర్ఎస్, బిజెపి పార్టీకి చెందిన నాయకులు దీకొండ రవి, చామకూరి వీరాస్వామి, కొమ్ము కుమారస్వామిలు ఆ పార్టీలకు రాజీనామా చేసి టిఆర్పి మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు బత్తుల కుమారస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సమక్షంలో టీఆర్పి పార్టీలో చేరారు. చేరిన వారికి తీన్మార్ మల్లన్న పార్టీ కండువా కప్పి ఆధారంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ తెలంగాణలోని మెజార్టీ వర్గాల ప్రజల హక్కుల సాధన, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్పి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉడుగుల ఐలయ్య యాదవ్,పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ దీకొండ బాలకృష్ణ,జిల్లా యూత్ అధ్యక్షుడు నిమ్మకంటి అనిల్ బాబు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# నాగార్జునసాగర్‌కు భారీగా వరద

## 516.20 అడుగులకు చేరిన నీటిమట్టం

**నాగార్జునసాగర్, ఆగస్టు 8 (జనంసాక్షి) :** ఎగువన ఉన్న శ్రీశైలం జలాషాయం నుంచి విద్యుత్ ఉత్పాదన ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి సాగర్ జలాశయానికి 50,317 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రస్తుతం నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం 516.20 అడుగులకు చేరుకుంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 142.4378 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పూర్తి స్థాయి సామర్థ్యం 312.0450 టీఎంసీలు. సాగర్ జలాశయం నుంచి ప్రధాన విద్యుత్ కేంద్రం ద్వారా నీటి విడుదల ప్రస్తుతం నిలిచిపోయింది. కుడి, ఎడమ కాలువలకు కూడా నీటి విడుదల లేదు. క్రస్ట్ గేట్లు మూసి ఉండగా, ఎస్ఎల్‌బీసీ(ఏఎంఆర్‌పీ) ద్వారా 900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయం నుంచి నదిలోకి నీటి విడుదల లేకపోగా, మొత్తం ఔట్‌ఫ్లో 900 క్యూసెక్కులుగా నమోదైంది. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం ఇదే విధంగా కొనసాగితే సాగర్ జలాశయంలో నీటి మట్టం మరింత పెరిగే అవకాశం ఉంది. అధికారులు జలాశయానికి వస్తున్న ఇన్‌ఫ్లో, నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# తెలంగాణలో పెట్టుబడులకు అపార అవకాశాలు

- రూ.3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- వేమో డ్రైవర్‌లెస్ కారులో ప్రయాణం
- హైదరాబాద్‌లో స్వయంచాలక మొబిలిటీపై ఆసక్తి
- ప్రవాసులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**శాన్‌ఫ్రాన్సిస్కో, ఆగస్టు 8 (జనంసాక్షి) :** తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, నిరంతర విద్యుత్ సరఫరా, మెరుగైన మౌలిక సదుపాయాలు రాష్ట్ర బలాలని పేర్కొన్నారు. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో భారత కాన్సులేట్ జనరల్ (సీజీఐ ఎస్ఎఫ్ఓ) ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్ర మంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బే ఏరియాకు చెందిన తెలుగు ప్రవాసులు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు, వృత్తి నిపుణులతో ఆయన సమావేశమయ్యారు. తెలంగాణను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని భట్టి విక్రమార్క చెప్పారు. పారిశ్రామిక కారిడార్లు, పార్కుల్లో తయారీ, ఐటీ, జీవశాస్త్రం, స్వచ్ఛ ఇంధనం తదితర రంగాల్లో పెట్టుబడులకు అనువైన భూమి అందుబాటులో ఉందన్నారు. పరిశ్రమలకు అవసంమైన నైపుణ్య మానవ వనరులను అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు ఇతర విద్యా, సాంకేతిక సంస్థలను బలోపేతం చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో పరిశ్రమలకు 24 గంటలూ నాణ్యమైన విద్యుత్ అందించే సామర్థ్యం ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సంప్రదాయ విద్యుత్‌తో పాటు పునరుత్పాదక ఇంధన వనరు రంగంలోనూ రాష్ట్రం గరిష్ఠ ప్రగతిని సాధిస్తోందని చెప్పారు. పెట్టుబడిదారులకు వేగంగా అనుమతులు ఇచ్చేందుకు సింగిల్ విండో విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. అనుమతులకు ఎక్కడా అలస్యం జరక్కుండా పారిశ్రామిక అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికత, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, సుస్థిర పట్టణ ప్రణాళికను సమన్వయం చేస్తూ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచస్థాయి సంస్థలను ఆకర్షించేందుకు ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని చెప్పారు. ఐటీ, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, అధునాతన తయారీ, నాలెడ్జ్ ఆధారిత పరిశ్రమలపై దృష్టి సారించి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ అభివృద్ధి ప్రయాణంలో తెలంగాణ ప్రవాసులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు సాంకేతికత, ఆవిష్కరణలు, పరిశ్రమల విస్తరణలో భాగస్వాములు కావాలని కోరారు. అమెరికా పర్యటనలో భాగంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాన్‌ఫ్రాన్సిస్కోలో వేమో స్వయంచాలక (డ్రైవర్‌లెస్) వాహనంలో ప్రయాణించారు. అనంతరం వేమో ప్రతినిధులతో సమావేశమై స్వయంచాలక వాహన సాంకేతికత, దాని నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, నియంత్రణ విధానాలపై వివరాలు తెలుసుకున్నారు. హైదరాబాద్‌తో పాటు ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీలో స్వయంచాలక మొబిలిటీ పరిష్కారాలను ప్రయోగాత్మకంగా అమలు చేసే అవకాశాలపై ఆయన ఆరా తీశారు. ఇందుకు అవసరమైన అధిక రిజల్యూషన్ మ్యాపింగ్, సెన్సార్ అనుకూల రోడ్డు డిజైన్, ప్రత్యేక టెస్టింగ్ కారిడార్లు, డేటా కనెక్టివిటీ, ఏఐ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాల గురించి వేమో ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. స్వయంచాలక వాహనాల ట్రయల్స్, భవిష్యత్ విస్తరణకు అవసరమైన నియంత్రణ, విధానపరమైన చట్రాలపైనా చర్చించారు. నూతన తరం మొబిలిటీ సాంకేతికతను హైదరాబాద్, ఫ్యూచర్ సిటీ పట్టణాభివృద్ధి ప్రణాళికల్లో అనుసంధానం చేసే అవకాశాలను పరిశీలించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆసక్తి వ్యక్తం చేశారు.

# సిద్ధంగా డా.ఎంసీఆర్ టిమ్స్

- త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి
- హాస్పిటల్‌ను పరిశీలించిన మంత్రి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్) సిద్ధంగా ఉందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్‌ను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని మంత్రి వెల్లడించారు. హాస్పిటల్ ప్రారంభానికి సంబంధించిన ఏర్పాట్లు, మౌలిక వసతులు, వైద్య సేవలు, డాక్టర్లు, సిబ్బంది, భద్రత, ఇతర సహాయక వ్యవస్థలను పరిశీలించేందుకు మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్‌ను సందర్శించారు. హాస్పిటల్‌లోని ఇూ, దీ, జ బ్లాకులను మంత్రి పరిశీలించారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఉద్యోగులతో మాట్లాడి సేవల నిర్వహణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌లోని వివిధ విభాగాలను పరిశీలించిన మంత్రి, ప్రారంభానికి ముందు పూర్తి చేయాల్సిన పనులు, అవసరమైన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. మిగిలిన అన్ని పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, హాస్పిటల్‌ను పూర్తిస్థాయి సేవలకు సిద్ధం చేయాలని ఆరోగ్యశాఖ, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. హాస్పిటల్ ప్రారంభమైన రోజు నుంచే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వ్యవస్థలు సమన్వయంతో పనిచేసేలా ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. హాస్పిటల్‌లో వైద్య సేవల నిర్వహణ, మౌలిక వసతులు, మానవ వనరులు, నాన్‌-మెడికల్ సర్వీసులు, విద్యుత్, నీటి సరఫరా, పారిశుధ్యం, భద్రత, ఫైర్ సేఫ్టీ, ఇతర వ్యవస్థలపై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌లోని ప్రతి విభాగం ప్రారంభానికి ముందే పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు, వారికి అవసరమైన అన్ని సహాయక సేవలు కూడా నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హాస్పిటల్‌లో పనిచేసే డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, టెక్నీషియన్లు, పరిపాలనా సిబ్బంది తదితర మానవ వనరులను అవసరానికి అనుగుణంగా అందుబాటులో ఉంచాలని సూచించారు. డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్‌ను రాష్ట్రంలోని ప్రజలకు అత్యాధునిక, నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించే ప్రముఖ ప్రభుత్వ వైద్య సంస్థగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని మంత్రి తెలిపారు. అత్యాధునిక వైద్య పరికరాలు, ఆధునిక మౌలిక వసతులు, సూపర్ స్పెషాలిటీ వైద్య విభాగాలు, క్రిటికల్ కేర్, అత్యవసర వైద్యం, అవయవ మార్పిడి వంటి క్లిష్టమైన వైద్య సేవలను ఒకే వేదికపై అందించేలా టిమ్స్‌ను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

# 10న సీఎం వరుణ యాగం

- ఏర్పాట్ల పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే



**నాగార్జునసాగర్ ఆగస్టు 8 (జనంసాక్షి) :** నాగార్జునసాగర్ విజయవిహార్ వద్ద ఈనెల 10న సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించనున్న వరుణ యాగం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి తో కలిసి శనివారం పరిశీలించారు. ఎల్ నినో కారణంగా రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలన్నింటిలో చాలా తక్కువ నీరు ఉండడం, వర్షాలు లేకపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రజల ప్రయోజనార్థం ,ప్రజలు సుభిక్షంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఈ నెల 10న నాగార్జునసాగర్ సమీపంలోని కృష్ణా నది ఒడ్డున విజయ విహార్ లో వరుణ యాగం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రాక ఏర్పాట్ల విషయమై శనివారం జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే అధికారులతో కలిసి వరుణ యాగం నిర్వహించే యాగశాల, ప్రవచన శాల,హెలిప్యాడ్, తదితర ప్రదేశాలను పర్యటించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో 108 మంది అర్చకులతో రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల అర్చకులు కలిసి ఈ నెల 10న ఉదయం 4 గంటలకు వరుణ యాగం చేపట్టనున్నారని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. కృష్ణా నది ఒడ్డున చేపడుతున్న ఈ యాగం వల్ల వానలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్న ఆకాంక్షతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు లేక రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా రైతాంగం అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ సంవత్సరం వర్షాలు రావడం చాలా ఆలస్యమైందని, అంతేకాక గోదావరి, కృష్ణ నదులలో నీరు చాలా తక్కువగా ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రైతుల సంక్షేమం కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో తలపెట్టిన వరుణ యాగం ఈనెల 10 న ఆధ్యాత్మిక కేంద్రంగా వెలిసిన నాగార్జునసాగర్ విజయ్ విహార్ కృష్ణ నది ఒడ్డున నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారమే మంత్రులు ఇతర ప్రముఖులు, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ,దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ వస్తున్నట్లు తెలిపారు. వరుణయాగాన్ని భక్తులు తిలకించే విధంగా ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ యాగంతో తప్పకుండా దేవుడు కరుణిస్తాడని, రైతులకు మంచి జరుగుతుందని ఆశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో రాష్ట్ర ముఖ్యమంత్రి రాక ఏర్పాట్లపై సమీక్షించారు. ముఖ్యంగా యాగానికి అవసరమైన ఏర్పాట్లతో పాటు, శానిటేషన్, తాగునీరు, నిరంతరాయ విద్యుత్ సరఫరా, ఎల్ఈడి స్క్రీన్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, లైటింగ్,బందోబస్తు అన్నిటిని ఏర్పాటు చేయాలని ,ప్రతి అంశానికి ఒక అధికారిని ఇన్చార్జిగా నియమించాలని చెప్పారు. ఈ కార్యక్రమం లొ సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ, నల్గొండ అడిషనల్ ఎస్పి రమేష్, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి ,ముఖ్యమంత్రి భద్రత అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఎల్‌నినోతో సాగునీటికి కష్టాలు

- సాగర్ నీళ్లు తాగడానికే సరిపోవు
- రైతులు ఆరుతడి పంటలనే వేయాలి
- సాగునీటి సలహామండలి సమావేశంలో కోమటిరెడ్డి

**నల్గొండ, ఆగస్టు8 (జనంసాక్షి) :** ఎల్‌నినో కారణంగా ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీరు తాగునీటికే సరిపోతుందని, అంతేకాక పైనుంచి నీరు వచ్చే అవకాశం కూడా లేనందున రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి వేయకుండా ఆరుతడి పంటలు వేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒకవేళ నాగార్జునసాగర్ నిండినప్పటికీ చెరువులు నింపే పరిస్థితి లేదని, ఇప్పటికే బోర్లలో కూడా గ్రౌండ్ వాటర్ తగ్గిపోతున్నందున కష్టకాలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు అండగా నిలబడి ఆరుతడి పంటలు వేసుకునేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. శనివారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు డెడ్‌స్టోరేజీలో ఉందని, శ్రీశైలం నుంచి నీరు వచ్చినప్పటికీ పంటలకు సాగునీరు ఇచ్చే పరిస్థితి లేదని, ఉన్న నీరు జూన్ 2027 వరకు తాగునీటికే సరిపోతుందని తెలిపారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు. ఏఎంఆర్‌పీ కూడా సగమే నిండిందని, గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని మంత్రి అన్నారు. కరువు వచ్చినప్పటికీ నల్గొండ జిల్లాకు శాశ్వతంగా సాగునీరు అందించే ఎస్‌-ఎల్‌బీసీ సొరంగం పనులు ఆగస్టు 2028 నాటికి పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. పనులు కొనసాగుతున్నాయని, ఏఎంఆర్‌పీ, ఎస్ఎల్‌బీసీ, బ్రాహ్మణ వెల్లంల ద్వారా జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. ఎస్ఎల్‌బీసీ కోసం ఎంతైనా ఖర్చు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. కరువు వచ్చినా, శ్రీశైలం డెడ్‌స్టోరేజీలో ఉన్నప్పటికీ ఎస్ఎల్‌బీసీ నుంచి సాగునీరు అందించవచ్చన్నారు. రాబోయే రోజుల్లో సూపర్ ఎల్‌నినో కారణంగా దక్షిణ తెలంగాణలో పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు.

# అబ్బాయిలు తమ బాధను చెప్పుకునే స్వేచ్ఛ ఉండాలి

- మహిళా భద్రత విభాగం డీజీ చారు సిన్హా




**హైదరాబాద్ (జనంసాక్షి) :** తల్లిదండ్రులతో మగ పిల్లలు తమ మనసులోని బాధను చెప్పుకుంటే సమాజం ఏమనుకుంటుందో అన్న భయం పోవాలని, ఆడ, మగ అనే తేడా లేకుండా పిల్లలిద్దరినీ సమానత్వంతో పెంచినప్పుడే రేపటి సమాజం బాగుంటుందని మహిళా భద్రత విభాగం డీజీ చారు సిన్హా అభిప్రాయపడ్డారు. శనివారం హైదరాబాద్‌లోని వీహబ్‌లో పిల్లల పెంపకం సమానత్వం, గౌరవం, సమ్మతి అనే అంశంపై స్టాండ్ విత్ హర్ ప్రచారంలో భాగంగా ఆరో విడత చర్చాగోష్ఠి జరిగింది. ఈ కార్యక్రమంలో చారు సిన్హా ఐపీఎస్, నటి అమల అక్కినేని, దర్శకురాలు నందిని రెడ్డి తదితరులు పాల్గొని తల్లిదండ్రుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పంచుకున్నారు. ఈ సందర్భంగా మహిళా భద్రత విభాగం డీజీ చారు సిన్హా మాట్లాడుతూ.. పెంపకం విషయంలో తల్లిదండ్రుల ఆలోచనా తీరు మారాలన్నారు. అబ్బాయిలు కూడా తమ భావోద్వేగాలను స్వేచ్ఛగా పంచుకునే వాతావరణం ఇంట్లో ఉండాలి. ఎదుటి వారిని గౌరవించడం, బాధ్యతగా ఉండటం వంటివి చిన్నప్పటి నుంచే నేర్పాలి. ఆడపిల్లలతో పాటు మగ పిల్లల పెంపకంపై కూడా దృష్టి పెట్టినప్పుడే మార్పు వస్తుంది అని ఆమె పేర్కొన్నారు. నటి అమల అక్కినేని మాట్లాడుతూ.. పిల్లలకు కేవలం చదువు మాత్రమే సరిపోదని, ఏది మంచి.. ఏది చెడు అని తెలుసుకునే వివేకం నేర్పాలని తెలిపారు. తాము చేసే పనుల వల్ల ఇతరులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవడం కూడా ఒక విలువేనని ఆమె గుర్తుచేశారు. నందిని రెడ్డి మాట్లాడుతూ.. సమాజం అనాదిగా పెట్టిన కొన్ని పాత పద్ధతులను పిల్లల మీద బలవంతంగా రుద్దవద్దని కోరారు. రాయలసీమ రుచులు వ్యవస్థాపకుడు ఉత్తమ్ రెడ్డి మాట్లాడుతూ.. నేటి డిజిటల్ కాలంలో పేరెంట్స్ అంతా ఫోన్లలో మునిగిపోతున్నారని, అది పిల్లలపై ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్లు పక్కన పెట్టి పిల్లలతో రోజూ మాట్లాడితేనే వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, తద్వారా వారు తమ సమస్యలను స్వేచ్ఛగా పంచుకుంటారని చెప్పారు. హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అనురేఖ చారి వాఘ్ మాట్లాడుతూ.. సమ్మతి గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. అమ్మాయిలకు నో చెప్పే ధైర్యం ఇవ్వడం ఎంత ముఖ్యమో.. ఎవరైనా వద్దు లేదా నో అన్నప్పుడు అబ్బాయిలు దాన్ని గౌరవించడం నేర్చుకోవడం కూడా అంతే ముఖ్యం అని వివరించారు. పరిశోధకుడు చరణ్ తన అనుభవాన్ని చెబుతూ.. పిల్లలు మనం చెప్పే మాటల కంటే, మనం చేసే పనులనే ఎక్కువగా గమనిస్తారు. ఇంట్లో పెద్దలు కోపంగా ఉంటే పిల్లలు కూడా అదే నేర్చుకుంటారు. అందుకే తల్లిదండ్రులు ఆదర్శంగా ఉండాలి అని అన్నారు. సమాజంలో లింగ సమానత్వంపై అవగాహన తెచ్చేందుకు స్టాండ్ విత్ హర్ పేరుతో ఏడాది పొడవునా ఇలాంటి చర్చలు జరుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370